# శుభోదయం!

WWW.SUBHODAYAMDAILY.COM

ప్రతీ అక్షరం..ప్రజా సమరం......!

అమరావతి,హైదరాబాద్, సంపుటి : 01, సంచిక : 306, పేజిలు : 08, ఎడిటర్ : వి. శ్రీనివాసరావు (6281773157) శనివారం - 18- జనవరి - 2025


## చర్చించిన అంశాలివే..

- – ఫ్రీ హెూల్డ్ లాండ్స్‌పై కేబినెట్‌లో సుదీర్ఘ చర్చ.
- – 12 లక్షల ఎకరాలు విడుదలపై చర్చించారు.
- – ఇన్‌చార్జి మంత్రులను జిల్లాల వారీగా మీటింగ్ పెట్టి, సమీక్ష చేసి, వచ్చే కేబినెట్ సమావేశానికి నివేదికలు తీసుకురావాలని నిర్ణయించారు.
- – బడ్జెట్ సమావేశాలకు ముందు కలెక్టర్ల సమావేశం ఏర్పాటు చేయాలని నిర్ణయం.
- – ఇన్‌చార్జి మంత్రులు జిల్లాలో సమావేశం ఏర్పాటు చేసి స్థలాలు సేకరణపై నిర్ణయాలు తీసుకోవాలని ఆదేశాలు.
- –అమరావతి, పోలవరం, వైజాగ్ స్టీల్ ప్లాంట్‌కు నిధులు ఇవ్వడంపై కేంద్రానికి కృతజ్ఞతలు తెలిపిన కేబినెట్.
- – విశాఖ స్టీల్ ప్లాంట్‌కు నిధులు ఇచ్చినా భవిష్యత్‌లో స్టీల్ ప్లాంట్ కొనసాగే విధంగా చర్యలు చేపట్టాలని భావించిన కేబినెట్.
- – విశాఖ ఉక్కు, ఆంధ్రుల హక్కు అనే సెంటిమెంట్ ఉందని, అందుకు అనుగుణంగా ప్లాంట్‌ను నడపాలని భావించిన కేబినెట్.
- –శనివారం సాయంత్రం కేంద్ర హెూంమంత్రి అమిత్ షా వస్తున్నారని, ఆయనతో డిన్నర్ మీట్‌లో మూడు పార్టీల నేతలు కలుస్తారని సీఎం చెప్పారు.

## ఏపీ కేబినెట్
# సంచలన నిర్ణయాలు..

ప్రభుత్వ పథకాల అమలు, పోలవరం ప్రాజెక్టు, అమరావతి నిర్మాణ పనులు, పేదలకు భూమి పంపిణీ వంటి అంశాలపై ప్రధానంగా చర్చించారు



అమరావతి, : ఆంధ్రప్రదేశ్ కేబినెట్ సమావేశం ముగిసింది. ఈ సమావేశంలో కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ప్రభుత్వ పథకాల అమలు, పోలవరం ప్రాజెక్టు, అమరావతి నిర్మాణ పనులు, పేదలకు భూమి పంపిణీ వంటి అంశాలపై ప్రధానంగా చర్చించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మిగతా..2లో

## యువతకు ఉద్యోగాలు, పెట్టుబడుల ఆకర్షణే లక్ష్యంగా మంత్రి లోకేశ్ దావోస్ టూర్!



ఈ నెల 20 నుంచి 24 వరకు దావోస్‌లో జరిగే వరల్డ్ ఎకనమిక్ ఫోరం సదస్సుకు మంత్రి లోకేశ్

ఐదు రోజుల పర్యటనలో 50 మందికిపైగా ప్రముఖులతో సమావేశాలు

30 మంది దిగ్గజ పారిశ్రామికవేత్తలతో భేటీ కానున్న మంత్రి లోకేశ్

### దేశంలోనే అతిపెద్ద మొబిలిటీ గ్లోబల్ ఎక్స్‌పో..
## భారత్ మండపంలో ప్రారంభించనున్న ప్రధాన మంత్రి




న్యూఢిల్లీ : న్యూఢిల్లీలోని భారత్ మండపంలో జనవరి 17న 'ఇండియా మొబిలిటీ గ్లోబల్ ఎక్స్‌పో 2025'ని ప్రధాని నరేంద్ర మోదీ ప్రారంభించనున్నారు. ఇది దేశంలోనే అతిపెద్ద మొబి లిటీ ఎక్స్‌పో, ఇది మొబిలిటీ రంగంలోని అన్ని అంశాలను ఒకే వేదికపైకి తీసుకురావడానికి ప్రయత్నిస్తోంది. జనవరి 17 నుండి 22 వరకు భారత్ మండపం యశోభూమి, ఇండియా ఎక్స్‌పో సెంటర్, గ్రేటర్ నోయిడాలోని మార్ట్ అనే మూడు ప్రదేశాలలో ఎక్స్‌పో జరుగుతుంది. ఈ కార్యక్రమంలో 9 ప్రదర్శ నలు, 20కి పైగా సమావేశాలు, పెవిలియన్లు ఉంటాయి. దీనితో పాటు, వివిధ రాష్ట్రాల ప్రత్యేక సమావేశాలు మొబిలిటీ రంగంలో మిగతా..2లో

### ఎలాన్ మస్క్‌కు ఎదురుదెబ్బ..
## పేలిన స్టార్‌షిప్ రాకెట్..



వాషింగ్టన్: టెస్లా అధినేత ఎలాన్ మస్క్‌కు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. అంతరిక్ష రంగంలో క్రమంగా పురోగతి సాధిస్తున్న ఆయనకు చెందిన స్పేస్‌ఎక్స్ ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన పునర్వినియోగ భారీ రాకెట్ స్టార్‌షిప్ విఫలమైంది. టెక్సాస్‌లోని బొకాచికా వేదికగా గురువారం సాయంత్రం 4.37 గంటలకు (భారత కాలమానం ప్రకారం శుక్రవారం ఉదయం 4 గంటలకు) ఈ రాకెట్‌ను ప్రయోగించారు. అయితే, కరేబియన్ మీదుగా భూవాతావరణంలోకి ప్రవేశించినప్పుడు సాంకేతిక లోపం తలెత్తడంతో అది పేలిపోయింది. దీంతో దాని శకలాలు కరేబియన్ సముంద్రంలో పడిపోయాయి.

### జనవరి 26 నుంచి
## రైతు భరోసా 12 వేలు ఇస్తాం: పొన్నం



- గతంలో వడ్లు, పత్తి, సన్ ఫ్లవర్ కొనుగోలు కేంద్రాలను సమర్థవంతంగా నిర్వహించాం
- 2 లక్షల వరకు రైతు రుణమాఫీ చేశామని, రైతు సంక్షేమం కోసం అనేక కార్యక్రమాలు చేపట్టాం
- కందుల కొనుగోలు కేంద్రాన్ని రవాణా బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రారంభించారు
- యోగ్యమైన భూములు రైతు భరోసా ఇస్తున్నామని, రైతు భరోసా 12 వేలకు పెంచామని స్పష్టం

# ఢిల్లీలోనూ లిక్కర్ పార్టీని ఓడిస్తాం

తెలంగాణలో ఆప్ లిక్కర్ పార్ట్‌నర్‌ను ఓడించాం..

ఇప్పుడు ఢిల్లీలో కేజ్రీవాల్‌ను చిత్తు చేస్తాం

తెలంగాణలో రైతులకు రూ.2లక్షల రుణమాఫీ చేశాం

ఢిల్లీ ప్రజలకు రెండు గ్యారంటీలు ఇస్తున్నాం

అధికారంలోకి రాగానే 300 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, రూ.500లకే గ్యాస్ సిలిండర్ ఇస్తాం

తెలంగాణ స్ఫూర్తితో ఢిల్లీలో హామీల అమలు

ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల గ్యారంటీ పోస్టర్ ఆవిష్కరణలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి



హైదరాబాద్: కేజ్రీవాల్ లిక్కర్ పార్టనర్ బిఆర్ఎస్‌ను తెలంగాణలో ఓడించామని సిఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ఇప్పుడు ఢిల్లీలో అరవింద్ కేజ్రీవాల్‌ను ఓడిస్తామని సిఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన గ్యారెంటీలను అమలు చేస్తున్నామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు.

ఇప్పటి వరకు 120 కోట్ల జీరో టికెట్లతో మహిళలు ప్రయాణం చేశారని సిఎం రేవంత్ పేర్కొన్నారు. ఢిల్లీలో కాంగ్రెస్ పార్టీకి ప్రజలు అవకాశం ఇవ్వాలని ఆయన కోరారు. రాష్ట్రంలో తమ ప్రభుత్వం నిబద్ధతతో పనిచేస్తోందని సిఎం రేవంత్ తెలిపారు. ఢిల్లీ ప్రజలకు రెండు గ్యారంటీ హామీలు ఇస్తున్నామని ఆయన తెలిపారు.

### ఢిల్లీలో రేవంత్ బిజీబిజీ..
## రాష్ట్రాభివృద్ధిపై పలు కేంద్రమంత్రులతో కీలక భేటి



ఢిల్లీ : ఢిల్లీ పర్యటనలో కేంద్ర మంత్రులు భూపేందర్ యాదవ్, కుమారస్వామితో భేటీ అయ్యారు సీఎం రేవంత్ రెడ్డి. రీజనల్ రింగ్ రోడ్, పర్యాటక శాఖకు సంబంధించి కొన్ని అటవీ భూముల నుంచి అభివృద్ధి పనులు చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. ఇందుకు సంబంధించి ఇప్పటికే పంపించిన ప్రతిపాదనలను వెంటనే క్లియర్ చేయాలని భూపేందర్ యాదవ్‌ను సీఎం రేవంత్, మంత్రి కొండా సురేఖ కోరారు. దీనికి సానుకూలంగా స్పందించారు భూపేంద్ర యాదవ్. తెలంగాణలో ఉక్కు పరిశ్రమ మిగతా..2లో

## విశాఖ ఉక్కు పరిశ్రమకు ప్యాకేజీపై కేంద్రం నుంచి అధికారిక ప్రకటన విడుదల




- ఢిల్లీలో ప్రధాని మోదీ అధ్యక్షతన కేంద్ర క్యాబినెట్ సమావేశం
- విశాఖ ఉక్కు పరిశ్రమకు భారీ ప్యాకేజీ ఇవ్వాలని నిర్ణయం
- అధికారిక ప్రకటన విడుదల చేసిన కేంద్రమంత్రి అశ్విని వైష్ణవ్
- కేంద్రం ప్రకటన పట్ల హర్షం వ్యక్తం చేసిన కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు

## మహా కుంభమేళాలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన తేజస్ ఎయిర్‌క్రాఫ్ట్ 'తేజస్ పండల్'



ఢిల్లీ : ప్రపంచంలోనే అతిపెద్ద ఆధ్యాత్మిక కార్యక్రమం గ్రాండ్‌గా జరుగుతోంది. మహా కుంభమేళాకు లక్షలాదిగా భక్త జనులు తరలివస్తున్నారు. త్రివేణీ సంగమంలో పుణ్యస్నానాలు ఆచరి స్తు న్నారు. అయితే ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ఒక అక్కడికి విచ్చే సిన భక్తులను ఎంతగానో ఆకట్టుకుంటోంది. భారత వైమానిక దళం కి చెందిన హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ తేజస్ ఎయిర్ క్రాఫ్ట్ 'తేజస్ పండల్' ప్రయాగ్‌రాజ్‌లోని భక్తుల దృష్టిని ఆకర్షి స్తోంది. దీని నిర్మాణంలో మహంత్ బ్రిజ్‌భూషణ్ దాస్ జీ మహారాజ్ కీలక పాత్ర పోషించారు.

## ఇక్కడ ఇచ్చిన హామీలకు దిక్కు లేదు..




- ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ ఎన్నికల హామీలను సీఎం రేవంత్ ప్రకటించడంపై బీఆర్ఎస్ విమర్శలు
- తెలంగాణలో 420 హామీలు ఇచ్చి గంగలో కలిపారంటూ కేటీఆర్ వ్యంగ్యాస్త్రాలు
- ఢిల్లీ పురవీధుల్లో కొత్త నాటకం మొదలు పెట్టారంటూ ఆరోపణలు

## మహిళా ఓటర్లే టార్గెట్..
# బీజేపీ ఢిల్లీ మేనిఫెస్టోలో కీలక హామీలు

- మహిళా సమృద్ధి యోజన పేరుతో ఢిల్లీలో అర్హులైన మహిళలకు ప్రతినెలా 2500
- పేద మహిళలకు గ్యాస్ సిలిండర్‌పై 500 రూపాయల సబ్సిడీ ఇసాం
- 'దేశ రాజకీయాల్లో సంస్కృతిని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మార్చారు


మిగతా హామీలు అమలుచేసే ప్రయత్నంలో ఉన్నాయి

వివరాలు 2లో..



న్యూఢిల్లీ: దేశ రాజధాని ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల తొలి విడత మేనిఫెస్టోను బీజేపీ విడుదల చేసింది. శుక్రవారం(జనవరి17) ఢిల్లీలో బీజేపీ జాతీయ అధ్యక్షుడు నడ్డా మేనిఫెస్టో విడుదల చేశారు. మహిళా సమృద్ధి యోజన పేరుతో ఢిల్లీలో అర్హులైన మహిళలకు ప్రతినెలా 2500 రూపాయలు ఇచ్చే స్కీమ్‌ను అధికారంలోకి వచ్చిన తర్వాత తొలి కేబినెట్ భేటీలోనే ఆమోదిస్తామని తెలిపారు.

## వచ్చే ఆర్థిక సంవత్సరం ప్రారంభంలో పలు పథకాలకు శ్రీకారం: సీఎం చంద్రబాబు



సీఎం చంద్రబాబు అధ్యక్షతన ఏపీ క్యాబినెట్ సమావేశం

సమావేశం అనంతరం రాజకీయ అంశాలపై చర్చ

వివిధ పథకాల అమలుకు సిద్ధం కావాలన్న చంద్రబాబు

పేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని నిర్దేశం

## యువతకు ఉద్యోగాలు, పెట్టుబడుల ఆకర్షణే లక్ష్యంగా మంత్రి లోకేశ్ దావోస్ టూర్!

అమరావతి : రాష్ట్రంలో యువతకు ఉద్యోగాల కల్పన, భారీ పెట్టుబడుల సాధనే లక్ష్యంగా పెట్టుబడుల టాస్క్ ఫోర్స్ కమిటీ ఛైర్మన్, రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేశ్ ఈ నెల 20 నుంచి 24వ తేదీ వరకు దావోస్ లో జరిగే వరల్డ్ ఎకనమిక్ ఫోరం సదస్సుకు హాజరుకానున్నారు. ఐదు రోజులపాటు జరిగే ఈ సదస్సులో వివిధ దేశాలకు చెందిన 50 మందికి పైగా అంబాసిడర్లు, పారిశ్రామికవేత్తలు, పారిశ్రామికరంగ పెద్దలతో మంత్రి లోకేశ్ భేటీ కానున్నారు. ప్రత్యేకించి ఏపీ పెవిలియన్ లో ప్రపంచవ్యాప్తంగా పేరెన్నికగన్న 30 మంది పారిశ్రామికవేత్తలతో ముఖాముఖి సమావేశమై రాష్ట్రంలో పెట్టుబడులపై చర్చలు జరుపుతారు. వరల్డ్ ఎకనమిక్ ఫోరం వేదికగా విద్యారంగంలో ప్రపంచవ్యాప్తంగా వస్తున్న మార్పులపై విద్యారంగ గవర్నర్ల సమావేశంలో పాల్గొంటారు. ఇంటిలిజెంట్ పరిశ్రమల కోసం మెరుగైన పర్యావరణ వ్యవస్థ నిర్మాణం, అధునాతన యుగంలో ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ ప్రభావం, జెండర్ పారిటీ స్ప్రింట్ ఛాంపియన్స్ అంశాలపై ప్రముఖులతో నిర్వహించే సమావేశాలకు హాజరవుతారు. నెక్స్ట్ జెన్ ఏఐ, డాటా ఫ్యాక్టరీ, ఏఐ విశ్వవిద్యాలయం ఏర్పాటు అంశాలపై ఎన్ విడియా ప్రతినిధులు, ఏఐ ఫర్ గుడ్ గవర్నెన్స్ పై గూగుల్ సంస్థ ప్రతినిధులతో రౌండ్ టేబుల్ సమావేశాల్లో పాల్గొంటారు. గ్లోబల్ ఎకానమీ స్థితిగతులు-లేబర్ మార్కెట్ పై ఏఐ ట్రాన్స్ ఫర్మేషన్ ప్రభావం అనే అంశంపై వైట్ షీల్డ్ తో, భవిష్యత్తుపై వాతావరణ ఉద్యమ ప్రభావం అంశంపై స్వానితి ఇనిషియేటివ్ ప్రతినిధులతో, వార్షిక లీడర్ ఫోరమ్ పునరుద్దరణపై నిర్వహించే సమావేశాలకు మంత్రి లోకేశ్ హాజరు కానున్నారు. ఐదు రోజుల సదస్సులో 30 మంది దిగ్గజ పారిశ్రామికవేత్తలతో ముఖాముఖి సమావేశమై ఏపీలో పెట్టుబడులు పెట్టాల్సిందిగా ఆహ్వానిస్తారు. రాష్ట్రంలో పెట్టుబడులకు గల అనుకూలతలు, మెరుగైన పర్యావరణ వ్యవస్థ, ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సహకాల గురించి వారికి వివరిస్తారు. సీఎన్‌బీసీ, టీవీ 18, బిజినెస్ టుడే, ఎకనమిక్ టైమ్స్, బ్లూమ్ బర్గ్, మనీ కంట్రోల్ వంటి ప్రముఖ జాతీయ, అంతర్జాతీయ మీడియా సంస్థల ప్రతినిధులతో ఇంటరాక్టివ్ సెషన్స్ కు హాజరవుతారు. భారత్, డెన్మార్క్ మధ్య గ్రీన్ స్ట్రాటజిక్ పార్టనర్‌షిప్‌ను బలోపేతం చేయడంపై నిర్వహించే సదస్సుతో పాటు కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ (సీఐఐ) నిర్వహించే కార్యక్రమానికి లోకేశ్ అతిథిగా హాజరు కానున్నారు. రాష్ట్రంలో ప్రజాప్రభుత్వం ఏర్పాటయ్యాక తొలిసారిగా వరల్డ్ ఎకనమిక్ ఫోరమ్ సదస్సులో పాల్గొనేందుకు దావోస్ వెళ్తున్న మంత్రి లోకేశ్ వైపు పారిశ్రామికవర్గాలు ఆసక్తితో ఎదురుచూస్తున్నాయి.

## దేశంలోనే అతిపెద్ద మొబిలిటీ గ్లోబల్ ఎక్స్‌పో.. భారత్ మండపంలో ప్రారంభించనున్న ప్రధాన మంత్రి

మొదటి పేజి తరువాయి

తమ విధానాలు, పథకాలను ప్రదర్శిస్తాయి. ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఎగ్జిబిటర్లు, సందర్శకులతో ఈవెంట్ ప్రపంచ ప్రాముఖ్యతను సంతరించుకుంటుంది. ఇది ఇంజినీరింగ్ ఎగుమతి ప్రమోషన్ కౌన్సిల్ భారతదేశం, ఇతర భాగస్వామ్య సంస్థల సహకారంతో కేంద్ర ప్రభుత్వ మద్దతుతో కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఇదిలావుంటే, భారతదేశంలో ఆటోమొబైల్ అమ్మకాలు 2024లో 11.6% వృద్ధిని నమోదు చేయడం గమనార్హం, మొత్తం అమ్మకాలను 25 మిలియన్ యూనిట్లకు తీసుకువెళ్లింది. ఇప్పటి వరకు ఇదే అతిపెద్ద సంఖ్య. ద్విచక్ర వాహనాల అమ్మకాలు 1.95 కోట్ల యూనిట్లలో 14.5% వృద్ధి చెందడం ఈ వృద్ధికి ప్రధాన కారణం. ప్యాసింజర్ వాహనాలు, మూడు చక్రాల వాహనాలు కూడా రికార్డు స్థాయిలో అమ్మకాలను నమోదు చేశాయి. 2024లో, భారతదేశం ప్రపంచంలో మూడవ అతిపెద్ద కార్ మార్కెట్‌గా కొనసాగుతుంది. అక్టోబర్ నుండి డిసెంబర్ త్రైమాసికంలో, ప్యాసింజర్ వాహనాలు, వాణిజ్య వాహనాలు మరియు త్రిచక్ర వాహనాలు ఎన్నడూ లేని విధంగా అత్యధిక వృద్ధిని నమోదు చేశాయి.

## ఎలాన్ మస్క్‌కు ఎదురుదెబ్బ.. పేలిన స్టార్‌షిప్ రాకెట్..

మొదటి పేజి తరువాయి

పెద్దఎత్తున నిప్పులు చిమ్ముతూ అవి పేలిపోయాయి. బూస్టర్ మాత్రం క్షేమంగా లాంచ్ ప్యాడ్‌కి తిరిగి చేరుకుంది. దీనికి సంబంధించిన వీడియోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. రాకెట్ పేలిపోవడంపై స్పేస్ ఎక్స్ స్పందించింది. ప్రయోగం విఫలమవడానికి సంబంధించి ముఖ్యమైన సమాచారాన్ని సేకరిస్తున్నామని వెల్లడించింది. ప్రయోగం విఫలమైనప్పటికీ ఇది స్టార్‌షిప్ విశ్వసనీయతను పెంచిందని పేర్కొంది. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటామని పేర్కొంది. ఇదిలాఉంటే.. ప్రయోగ కేంద్రం నుంచి దూసుకెళ్లిన ఎనిమిది నిమిషాల తరువాత స్టార్ షిప్ రాకెట్‌తో తాము కమ్యూనికేషన్ కోల్పోయామని స్పేస్ ఎక్స్ కమ్యూనికేషన్స్ మేనేజర్ డాన్ హుట్ వెల్లడించారు. కాగా, 232 అడుగుల భారీ రాకెట్ అయిన స్టార్‌షిప్‌లో మొత్తం 33 రాప్టర్ ఇంజిన్లు వాడారు. కాగా, ఈ వీడియోలను ఎలాన్ మస్క్ తన ఎక్స్ ఖాతాలో షేర్ చేశారు. విజయవంతం కాకపోయిన.. వినోదం మాత్రం గ్యారెంటీ అంటూ అందులో రాసుకొచ్చారు.

## ఢిల్లీలో రేవంత్ బిజీబిజీ.. రాష్ట్రాభివృద్ధిపై పలు కేంద్రమంత్రులతో కీలక భేట

మొదటి పేజి తరువాయి

ఏర్పాటుకి అవకాశాలు, భారీ పరిశ్రమలకు సంబంధించి ప్రోత్సాహకాల కోసం కేంద్ర పరిశ్రమల శాఖ మంత్రి కుమారస్వామిని కోరినట్టు తెలుస్తోంది. పెట్టుబడులే లక్ష్యంగా సీఎం రేవంత్ బృందం విదేశాల్లో పర్యటించనుంది. ముందుగా సింగపూర్‌కి వెళ్తారు. మూడు రోజుల పాటు అక్కడ పర్యటిస్తారు. ప్రపంచ ప్రసిద్ధిగాంచిన సింగపూర్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్‌ను సందర్శిస్తారు. నైపుణ్య అభివృద్ధికి సంబంధించిన కోర్సులు, విధానాలపై అధ్యయనం చేస్తారు. తెలంగాణలో నూతనంగా ఏర్పాటు చేసిన యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ కోసం సింగపూర్ ఐటీఈతో ఒప్పందం చేసుకోనున్నారు. అలాగే సింగపూర్ రివర్ ఫ్రంట్ ప్రాజెక్ట్‌ను పరిశీలిస్తారు. మూసీ నది పునరుజ్జీవన ప్రాజెక్ట్‌కి ఆ .. రివర్ ఫ్రంట్ అభివృద్ధి మోడల్‌ను అనుసరించేందుకు ప్రణాళికలు రూపొందించనున్నారు. స్కిల్ యూనివర్సిటీతో భాగస్వామ్యంపై ఒప్పందాలతో పాటు పెట్టుబడులపై సింగపూర్ పారిశ్రామికవేత్తలతో చర్చించనుంది సీఎం బృందం. అక్కడి నుంచి ఈ నెల 20న స్విట్జర్లాండ్ వెళ్తారు. దావోస్‌లో జనవరి 20, 21, 22న జరగనున్న ప్రపంచ ఆర్థిక ఫోరం సదస్సులో పాల్గొని, ప్రముఖ కంపెనీలతో సంప్రదింపులు జరుపుతారు. గతంలో దావోస్, అమెరికా, దక్షిణ కొరియా పర్యటనలతో భారీగా పెట్టుబడులను రాష్ట్రానికి తీసుకురాగలిగిన సీఎం రేవంత్.. ఈ పర్యటనతో తెలంగాణ ఆర్థిక ప్రగతికి మరింత ఊతం కలిగించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.

## ఇక్కడ ఇచ్చిన హామీలకు దిక్కు లేదు.

హైదరాబాద్ : ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ తరపున ప్రచారం చేస్తున్న తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిన్న (గురువారం) హస్తం పార్టీ హామీల పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఢిల్లీ లిక్కర్ స్కామ్‌లో భాగస్వామిగా ఒక పార్టీని తెలంగాణ ఎన్నికల్లో ఓడించామని, కీలకమైన భాగస్వామిని ఢిల్లీ ఎలక్షన్స్‌లో మట్టికరిపిస్తామని అన్నారు. ఈ వ్యాఖ్యలకు మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కౌంటర్ ఇచ్చారు. తల్లికి బువ్వ పెట్టనోడు-చిన్నమ్మకు బంగారు గాజులు చేయిస్తా అన్నట్లుగా ఉందంటూ సీఎం రేవంత్‌పై కేటీఆర్ వ్యంగ్యాస్త్రాలు సంధించారు. తెలంగాణలో 420 హామీలు ఇచ్చి గంగలో కలిపి, ఢిల్లీ పురవీధుల్లో కొత్త నాటకం మొదలు పెట్టారంటూ మండిపడ్డారు. తెలంగాణలో సాగుతున్న నికృష్ట పాలన ఢిల్లీలో కూడా చేయిస్తానంటూ పులకేశి బయలుదేరాడని అన్నారు. పేరు గొప్ప ఊరుదిబ్బ అన్నట్టుగ ఇక్కడ హామీలకు దిక్కులేదు గానీ అక్కడ ఢిల్లీ ప్రజలకు గ్యారంటీలు ఇస్తున్నావా? అని ప్రశ్నించారు. “ ఇక్కడ ఇచ్చిన హామీలకు దిక్కు లేదు. ఢిల్లీలో ఇస్తున్న హామీలకు గ్యారంటీ ఇస్తున్నావా?. ఢిల్లీ గల్లీల్లో కాదు, దమ్ముంటే మీ ఢిల్లీ గులాంతో అశోక్ నగర్ గల్లీల్లో చెప్పు ఉద్యోగాలు ఇచ్చామని. నవ్విపోదురు గాక నాకేంటి సిగ్గు అన్నట్లుంది రేవంత్ వ్యవహారం. జాగో ఢిల్లీ జాగో” అని ఎక్స్ వేదికగా కేటీఆర్ స్పందించారు. “ఉచిత కరెంటు ఇచ్చింది ఎవరికి?, గ్యాస్ సబ్సిడీ ఇచ్చింది ఎవరికి?, నెలకు రూ.2,500 తీసుకుంటున్న మహిళలు ఎవరు?, తులం బంగారం పొందుతున్న ఆడబిడ్డలు ఎవరు?, రైతు భరోసా రూ.7,500 ఇచ్చిందెక్కడ?, ఆసరా పింఛన్లు రూ.4,000 చేసిందెక్కడ?, రూ.5 లక్షల విద్యా భరోసా ఎక్కడ?, విద్యార్థినులకు ఎలక్ట్రిక్ స్కూటీలు ఎక్కడ?” అని కేటీఆర్ ప్రశ్నించారు.

## వచ్చే ఆర్థిక సంవత్సరం ప్రారంభంలో పలు పథకాలకు శ్రీకారం: సీఎం చంద్రబాబు



అమరావతి : వచ్చే ఆర్థిక సంవత్సరం ప్రారంభంలో పలు పథకాలకు శ్రీకారం చుడుతున్నామని ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు వెల్లడించారు. ఇవాళ చంద్రబాబు అధ్యక్షతన ఏపీ క్యాబినెట్ సమావేశం జరిగింది. ఈ సమావేశ ముగిసిన అనంతరం రాజకీయ అంశాలపై చర్చ జరిగింది. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ, తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ, మత్స్యకార భరోసా పథకాల అమలుకు సిద్ధం కావాలని దిశానిర్దేశం చేశారు. కేంద్రం పీఎం కిసాన్ నిధులు జమ చేసిన వెంటనే, రాష్ట్రంలో అన్నదాత సుఖీభవ నిధులు జమ చేయాలని తెలిపారు. పేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని స్పష్టం చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో 3 సెంట్లు, పట్టణ ప్రాంతాల్లో 2 సెంట్ల స్థలం పేదలకు ఇచ్చేలా ఏర్పాట్లు చేయాలని చెప్పారు. పోలవరం డయాఫ్రం వాల్ నిర్మాణం వెంటనే ప్రారంభించి, నిర్దేశిత సమయం లోపు పూర్తి చేయాలని అన్నారు. ఇక, రాజధాని అమరావతి పనులు కూడా వెంటనే ప్రారంభం అవుతాయని సీఎం చంద్రబాబు వెల్లడించారు.

# ఏపీ కేబినెట్ సంచలన నిర్ణయాలు..

మొదటి పేజి తరువాయి



అధ్యక్షతన జరిగిన ఈ మంత్రివర్గ సమావేశంలో.. తల్లికి వందనం పథకం అమలు విషయంపై సీరియస్ డిస్కషన్ నడిచింది. వచ్చే విద్యా సంవత్సరం నాటికి తల్లికి వందనం ఇవ్వాలని కేబినెట్ నిర్ణయించింది. ఖరీఫ్ ధాన్యం సేకరణ కోసం రూ.700 కోట్ల రుణానికి మార్క్‌ఫెడ్‌కు అనుమతి ఇస్తూ కేబినెట్ తీర్మానించింది. ఫెర్రో అల్లాయ్స్ కంపెనీలకు గతంలో ఇచ్చిన విద్యుత్ సబ్సిడీ టారిఫ్‌లు మరో 6 నెలల పొడిగించింది. కొత్తగా మరో 62 నియోజక వర్గాల్లో 63 అన్న క్యాంటీన్‌లు ఏర్పాటు చేయాలని మంత్రివర్గం నిర్ణయించింది. నాగావళి నదిపై తోటపల్లి బ్యారేజ్ దగ్గర కుడి, ఎడమ కాలువల దగ్గర హైడ్రో ప్రాజెక్టుల నిర్మాణానికి కేబినెట్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. కృష్ణా బ్యారేజ్ కుడి వైపు రూ.294 కోట్ల నిధులతో రిటైనింగ్ వాల్ నిర్మాణానికి అనుమతి ఇచ్చింది. నిషేధిత జాబితా నుంచి అక్రమంగా తొలగించిన భూములపై నిర్ణయానికి కమిటీ ఏర్పాటు చేయాలని మంత్రివర్గం నిర్ణయించింది. వైసీపీ హయాంలో దాదాపు 7 లక్షల ఎకరాలు నిషేధిక జాబితా నుంచి తొలగించారని గుర్తించారు. ఆ భూముల గురించి ప్రభుత్వానికి మంత్రుల కమిటీ నివేదిక ఇవ్వనుంది. వచ్చే కేబినెట్ భేటీలోపు దీనిపై నివేదిక ఇవ్వాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. పేదలందరికీ ఇళ్ల కేటాయింపు అంశంపై కేబినెట్ పలు నిర్ణయాలు తీసుకుంది. రూరల్‌లో 3 సెంట్లు, పట్టణాల్లో 2 సెంట్లకు వరకు అనుమతి ఇవ్వాలని తీర్మానించింది. అభ్యంతరం లేని ప్రభుత్వ స్థలాల ఆక్రమణల క్రమబద్ధీకరణకు కేబినెట్ ఓకే చెప్పింది. 11 వేల 162 గ్రామ, 3 వేల 842 వార్డు సచివాలయాల హేతుబద్ధీకరణకు మంత్రివర్గం తీర్మానించింది. జనాభా ప్రాతిపదికన %ూ, దీ, జ% కేటగిరీలుగా వీటిని విభజించాలని నిర్ణయించింది. అలాగే కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పీఎం కిసాన్ పథకం డబ్బులు వేసిన వెంటనే.. రాష్ట్ర ప్రభుత్వం తరపున అన్నదాత సుఖీభవ వేయాలని నిర్ణయించారు. ఇక పోలవరం డయాఫ్రామ్ వాల్‌ను వెంటనే ప్రారంభించామని నిర్ణయించారు. రాధాజాని అమరావతి పనులు కూడా వెంటనే ప్రారంభమవుతానని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఈ కేబినెట్ భేటీలో చెప్పారు. గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్లు, పట్టణ ప్రాంతాల్లో రెండు సెంట్లు స్థలం పేదలకు ఇచ్చేందుకు వెంటనే ఏర్పాట్లు చేయాలని అధికారులను ముఖ్యమంత్రి ఆదేశించారు.

## మహిళా ఓటర్లే టార్గెట్.. బీజేపీ ఢిల్లీ మేనిఫెస్టోలో కీలక హామీలు

మొదటి పేజి తరువాయి

పేద మహిళలకు గ్యాస్ సిలిండర్‌పై 500 రూపాయల సబ్సిడీ ఇస్తామన్నారు. వీటితో పాటు మరిన్ని కీలక హామీలిచ్చారు. ఈ సందర్భంగా జేపీనడ్డా మాట్లాడుతూ ‘దేశ రాజకీయాల్లో సంస్కృతిని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మార్చారు. గతంలో మేనిఫెస్టోలు ప్రకటించేవారు ఆ తర్వాత వాటిని ప్రకటించిన వాళ్లు కూడా మర్చిపోయారు.బీజేపీ ‘సంకల్ప పాత్ర’ పేరుతో మేనిఫెస్టోలను ప్రకటించడమే కాకుండా వాటిని నిజం చేసి చూపిస్తుంది. బీజేపీ చెప్పింది చేస్తుంది. చెప్పనిది కూడా చేసి చూపిస్తుంది. మోదీ గ్యారెంటీ..అమలయ్యే గ్యారంటీ.2014లో బీజేపీ ఐదు వందల హామిలిస్తే 499 హామీలు అమలు చేశాం.2019లో 235 హామీలిస్తే 225 అమలు చేశాం. మిగతా హామీలు అమలుచేసే ప్రయత్నంలో ఉన్నాయి.

బీజేపీ మేనిఫెస్టోలో కీలక హామీలివే..

హెూలీ, దీపావళి పండుగల సమయంలో అర్హులకు ఉచితంగా గ్యాస్ సిలిండర్,గర్భిణీ స్త్రీల కోసం 21000 రూపాయల సాయం,ఢిల్లీ బస్తీల్లో 5 రూపాయలకే భోజనం అందించేందుకు అటల్ క్యాంటీన్ల ఏర్పాటు.

ఆప్, బీజేపీ మధ్యే ప్రధాన పోటీ..!

కాగా, ఢిల్లీలో ఫిబ్రవరి 5న అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. ఫిబ్రవరి 8న ఫలితాలు రానున్నాయి. ఈ ఎన్నికల్లో అధికార ఆమ్‌ఆద్మీపార్టీ(ఆప్), బీజేపీ మధ్యే ప్రధాన పోరు జరగనున్నట్లు తెలుస్తోంది.కాంగ్రెస్ పోటీలో ఉన్నప్పటికీ ముక్కోణపు పోరు ఉండబోదన్న ప్రచారం జరుగుతోంది. ఇప్పటికే ఆప్ ప్రధాన స్కీమ్‌లను ప్రకటించింది. నెలనెలా మహిళలకు నగదు ఇచ్చే స్కీమ్‌తో పాటు 60 ఏళ్లు దాటిన వృద్ధులకు పూర్తి ఉచితంగా వైద్యం లాంటి జనాకర్షక పథకాలను ప్రకటించింది. ఎన్నికల నేపథ్యంలో ఆప్, బీజేపీ నేతల మధ్య మాటల యుద్ధం జరుగుతోంది. ఢిల్లీ బీజేపీ సీఎం అభ్యర్థిగా ప్రచారం జరుగుతున్న రమేష్‌బిదూరి సీఎం అతిషితో పాటు కాంగ్రెస్ అగ్రనేత ప్రియాంకగాంధీపై వివాదాస్పద వ్యాఖ్యలు చేయడం చర్చనీయాంశమైంది. రమేష్ బిదూరి కల్కాజి నియోజకవర్గంలో సీఎం అతిషిపై పోటీ చేస్తున్నారు.ధ

## విశాఖ ఉక్కు పరిశ్రమకు ప్యాకేజీపై కేంద్రం నుంచి అధికారిక ప్రకటన విడుదల




అమరావతి : కేంద్ర ప్రభుత్వం విశాఖ ఉక్కు పరిశ్రమకు భారీ ఉద్దీపన ప్యాకేజి ఇవ్వాలని నిన్నటి కేంద్ర క్యాబినెట్ సమావేశంలో నిర్ణయించడం తెలిసిందే. ఈ క్రమంలో, కేంద్రం ప్రభుత్వం విశాఖ ఉక్కు పరిశ్రమకు ప్యాకేజీపై నేడు అధికారికంగా ప్రకటన చేసింది. కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ దీనికి సంబంధించిన ప్రకటన విడుదల చేశారు. విశాఖ ఉక్కు పరిశ్రమకు కేంద్రం రూ.11,440 కోట్ల ప్యాకేజీ ఇస్తున్నట్టు ఆ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ ప్యాకేజీకి కేంద్ర క్యాబినెట్ బేషరతుగా ఆమోదం తెలిపినట్టు అశ్విని వైష్ణవ్ వెల్లడించారు. ప్రధాని మోదీకి, కేంద్రానికి ధన్యవాదాలు తెలిపిన కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు విశాఖ స్టీల్ ప్లాంట్ కు కేంద్రం ప్యాకేజీ ప్రకటించడం పట్ల కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు హర్షం వ్యక్తం చేశారు. ప్యాకేజీ కేటాయించిన ప్రధాని నరేంద్ర మోదీకి, కేంద్ర ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలుపుకుంటున్నామని వెల్లడించారు. ప్రకటించిన ప్యాకేజీలో... రివైవల్ ప్యాకేజీ కింద రూ.10,300 కోట్లు కేటాయించారని వివరించారు. ఉక్కు పరిశ్రమ నష్టాలను అధిగమించేందుకు ఈ ప్యాకేజీ ఎంతో ఉపయోగ పడుతుందని రామ్మోహన్ నాయుడు పేర్కొన్నారు. ఉక్కు పరిశ్రమ పూర్తి స్థాయి ఉత్పాదకతతో లాభాల బాటలో పయనించేందుకు ఈ ప్యాకేజీ దోహదపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఏపీ అభివృద్ధి, రాష్ట్ర ప్రజల ఆకాంక్షలపట్ల కేంద్ర ప్రభుత్వ చిత్తశుద్ధికి ఈ ప్యాకేజీ ఓ నిదర్శనమని రామ్మోహన్ వివరించారు.

## మహా కుంభమేళాలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన తేజస్ ఎయిర్‌క్రాఫ్ట్ ‘తేజస్ పండల్’

మొదటి పేజి తరువాయి

భారతదేశం పురోగతి, బలాన్ని ప్రదర్శించడమే ఈ పండల్ ముఖ్య ఉద్దేశ్యమని చెబుతున్నారు. ప్రపంచం నలుమూలల నుండి భక్తులు పండల్‌ను సందర్శిస్తున్నారు. జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటున్నారు. భారత దేశం గొప్ప సాంస్కృతిక వారసత్వాన్ని జరుపుకుంటున్నారు. మహంత్ బ్రిజ్‌భూషణ్ దాస్ జీ మహారాజ్ మీడియాతో మాట్లాడుతూ, “తేజస్ విమానం భారతదేశానికి గర్వకారణమని, భారత్ శక్తికి చిహ్నంగా నిలచిందన్నారు. ఇది మన దేశంలోనే నిర్మించడం పెరుగుతున్న స్వావలంబనకు నిదర్శనమన్నారు. ఒక శక్తివంతమైన సందేశాన్ని అందించడానికి మహాకుంభ్‌లో తేజస్ ఎయిర్‌క్రాఫ్ట్ గేట్‌ను రూపొందించామని తెలిపారు. భారతదేశం ఇప్పుడు ఎలాంటి సవాలునైనా ఎదుర్కొనేంత బలంగా ఉందని సందేశం ఇస్తున్నామని మహారాజ్ పేర్కొన్నారు. ఇకపై ఇతరులపై ఆధారపడకుండా, చంద్రుడు, అంగారక గ్రహం దాటి చేరుకున్నామన్నారు. తేజస్ విమాన నమూనా కట్టడాన్ని భారతన సైనికులకు అంకెతం చేస్తున్నామని ఆయన తెలిపారు. విపిన్ ఉపాధ్యాయ్ ఆచార్య మాట్లాడుతూ ఈ డిజైన్ వెనుక యువ తరానికి స్ఫూర్తినివ్వడమే లక్ష్యమన్నారు. “శ్రీ రామానందాచార్య మఠం శిబిరంలో ఆచార్యగా సేవ చేయడం గౌరవంగా ఉందన్నారు. ఈ శిబిరంలో తేజస్ విమానం, స్తంభం ఆకారంలో నిర్మించడం, భారతదేశ గర్వానికి చిహ్నంగా నిలుస్తుందన్నారు. ఈ డిజైన్ వెనుక ఉన్న లక్ష్యం యువకులను ప్రేరేపించడం. మహాకుంబ్ ఉద్దేశ్యం భారతదేశ యువతను ముందుకు సాగేలా ప్రోత్సహించడం, అర్థవంతమైన పనిలో పాల్గొనడం, మనమందరం గర్వించదగిన భవిష్యత్తును రూపొందించడమే లక్ష్యమన్నారు. తేజస్ పండల్ భక్తులకు ఆకర్షణీయ కేంద్రంగా కేంద్రంమాత్రమే కాకుండా, భారతదేశ సంస్కృతి తోపాటు అభివృద్ధికి తెలియజేస్తుంది. ఇదిలావుండగా, పవిత్ర నగరమైన ప్రయాగ్‌రాజ్‌లోని మహాకుంభ మేళా సందర్భంగా నాల్గవ రోజున త్రివేణి సంగమం వద్ద 3 మిలియన్లకు పైగా భక్తులు పవిత్ర స్నానాలు చేశారు. జనవరి 13న ప్రారంభమైన మహాకుంభ్ ఫిబ్రవరి 26 (బుధవారం) వరకు కొనసాగనుంది.

## జనవరి 26 నుంచి రైతు భరోసా12 వేలు ఇస్తాం: పొన్నం




సిద్దిపేట: కందుల మద్దతు ధర 7550 రూపాయలతో ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. రైతులు కందులను మద్దతు ధరకు అమ్ము కోవాలని సూచించారు. గతంలో వడ్లు, పత్తి, సన్ ఫ్లవర్ కొను గోలు కేంద్రాలను సమర్థవంతంగా నిర్వహించామన్నారు. సిద్దిపేట జిల్లాలో నాఫెడ్ టిజి మార్క్ ఫెడ్ ఆధ్వర్యంలో సిద్దిపేట వ్యవసాయ మార్కెట్ లో కందుల కొనుగోలు కేంద్రాన్ని రవాణా బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా పొన్నం మాట్లాడారు. సిద్దిపేట మార్కెట్ లో కందుల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభ చేసుకున్నామని, వడ్ల కొనుగోలు చేసిన 48 గంటలలో రైతులు నగదు చెల్లించామని, సన్న వడ్ల కు 500 బోనస్ ఇచ్చామని, జనవరి 26 నుండి వ్యవసాయ యోగ్యమైన భూములు రైతు భరోసా ఇస్తున్నామని, రైతు భరోసా 12 వేలకు పెంచామని స్పష్టం చేశారు. భూమిలేని ఉపాధి కూలీలకు 12 వేలు ఇస్తున్నామని, ఇందిరమ్మ ఇళ్ల సర్వే జరుగుతుందని, ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపు పారదర్శకంగా జరుగుతుందని, నియోజకవర్గానికి 3500 ఇళ్లు ఇస్తున్నామని, గత 10 సంవత్సరాలుగా రేషన్ కార్డులు లేవని, కొత్త రేషన్ కార్డులు పంపిణీ చేస్తున్నామన్నారు. పేర్ల మార్పిడి చేసుకోవాలనుకునే వారు చేసుకోవచ్చని, రైతు భరోసా కింద గతంలో ఉన్న దానిని 12 వేలకు పెంచామని పేర్కొన్నారు. 2 లక్షల వరకు రైతు రుణమాఫీ చేశామని, రైతు సంక్షేమం కోసం అనేక కార్యక్రమాలు చేపట్టామన్నారు. త్వరలోనే వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఇక్కడ పర్యటించి అయిల్ ఫామ్ సాగుపై రైతులకు అవగాహన కల్పిస్తారని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సిద్దిపేట జిల్లా కలెక్టర్ మను చౌదరి, అడిషనల్ కలెక్టర్ అబ్దుల్ హమీద్, ఆర్డీవో సదానందం, జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ లింగమూర్తి, జిల్లా మార్కెటింగ్ అధికారి నాగరాజు, సిద్దిపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ సెక్రటరీ వెంకటయ్య, ఇతర అధికారులు, జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# ఢిల్లీలోనూ లిక్కర్ పార్టీని ఓడిస్తాం

మొదటి పేజి తరువాయి



ఢిల్లీలో రెండోరోజూ సిఎం రేవంత్‌రెడ్డి పర్యటించారు. ఈ సందర్భంగా ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల గ్యారంటీ పోస్టర్‌లను సిఎం రేవంత్ రెడ్డి విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ఢిల్లీ పిసిసి అధ్యక్షుడు దేవేంద్ర యాదవ్, మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, రాష్ట్ర కాంగ్రెస్ ఎంపిలు మల్లు రవి, రఘువీర్ రెడ్డి, సురేష్ షెట్కార్, షబ్బీర్ అలీ, సంపత్, ఢిల్లీ కాంగ్రెస్ నేతలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిఎం రేవంత్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ అవినీతిని అడ్డుకుంటే చాలు ఆ నిధులు పేదలకు పంచవచ్చని, తెలంగాణలో అదే చేశామన్నారు. కెసిఆర్ తెలంగాణను దోచుకున్నారని సిఎం రేవంత్ మండిపడ్డారు. పెట్టబడుల కోసం దావోస్ వెళ్తున్నామని, వచ్చాక ఎన్ని నిధులు తీసుకొచ్చామో చెబుతామని సిఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. రాష్ట్రంలో రైతులకు రూ.2 లక్షల వరకు రుణమాఫీ చేశామని ఆయన స్పష్టం చేశారు. తెలంగాణలో విజయవంతంగా ఎన్నికల హామీలు అమలు చేస్తున్నామని సిఎం రేవంత్ ఉద్ఘాటించారు.

తెలంగాణలో 55 వేల మందికి ఉద్యోగాలు ఇచ్చాం

రాష్ట్రంలో 55 వేల మందికి ఉద్యోగాలు ఇచ్చామని సిఎం రేవంత్‌రెడ్డి గుర్తుచేశారు. తెలంగాణలో మహిళల కోసం ఉచిత ప్రయాణం అమలు చేశామన్నారు. ఇప్పటి వరకు 120 కోట్ల జీరో టికెట్లతో మహిళలు ప్రయాణం చేశారని సిఎం రేవంత్ పేర్కొన్నారు. ఢిల్లీలో కాంగ్రెస్ పార్టీకి ప్రజలు అవకాశం ఇవ్వాలని ఆయన కోరారు. రాష్ట్రంలో తమ ప్రభుత్వం నిబద్ధతతో పనిచేస్తోందని సిఎం రేవంత్ తెలిపారు. ఢిల్లీ ప్రజలకు రెండు గ్యారంటీ హామీలు ఇస్తున్నామని ఆయన తెలిపారు. ఢిల్లీలో 300 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, రూ.500లకే గ్యాస్ సిలిండర్ అందిస్తామని హామీ ఇస్తున్నామని సిఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. తెలంగాణ ఏర్పాటు కోసం సోనియా గాంధీ ఎంతో కృషి చేశారని ఆయన పేర్కొన్నారు.తెలుగు రాష్ట్రాల్లో పార్టీకి చాలా నష్టం జరిగినా సరే హామీ నిలబెట్టుకున్నారు తప్ప వెనుకడుగు వేయలేదని ఆయన ఉద్ఘాటించారు. షీలా దీక్షిత్ సిఎంగా ఉన్నప్పుడు మాత్రమే ఢిల్లీలో అభివృద్ధి జరిగింది తప్ప ఆ తర్వాత పరిస్థితి ఎలాంటి దుస్థితికి చేరుకుందో చూడాలన్నారు. ఢిల్లీలో అడుగు పెట్టాలంటే భయపడే పరిస్థితి ఏర్పడిందన్నారు. ఇటు సిఎంగా కేజ్రీవాల్, అటు పిఎంగా ప్రధానమంత్రి నరేంద్రమోడీ ఢిల్లీకి చేసింది ఏమీ లేదని సిఎం రేవంత్ విమర్శించారు. అబద్ధాలు ఆడటంలో ప్రధాని మోడీ, ఢిల్లీ మాజీ సిఎం కేజ్రీవాల్ ఒక్కటేనని ఆయన ఎద్దేవా చేశారు. ఇద్దరూ కలిసి ఢిల్లీని నాశనం చేశారని, ఇద్దరూ వేర్వేరు కాదని, ఇద్దరూ ఒక్కటేనని ఆయన విమర్శించారు. ఢిల్లీని బాగుచేయాలంటే కాంగ్రెస్ అధికారంలోకి రావాల్సిందేనన్నారు. వాతావరణ కాలుష్యమే కాదు, రాజకీయ కాలుష్యాన్ని కూడా ఈ ఇద్దరూ కలిసి పెంచారని ఆయన మండిపడ్డారు. తెలంగాణలో అమలు చేస్తున్న మాదిరిగానే ఢిల్లీలో కాంగ్రెస్‌ను గెలిపిస్తే ఇచ్చిన హామీలు అమలు చేస్తామని సిఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు.

# రక్తదానం చేయండి ప్రాణదాతలు కండి సోంపాలెం నాగభూషణ పిలుపు




తనకల్లు, మండల రిపోర్టర్ రవీంద్ర (శుభోదయం న్యూస్): కదిరి నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఎన్డీఏ కూటమి కుటుంబ సభ్యులుతెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు బుడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి కళామతల్లి ముద్దుబిడ్డ నటసార్వభౌముడు మాజీ ముఖ్యమంత్రివర్యులు నందమూరి తారక రామారావు గారి 29వ వర్ధంతి సందర్భంగా శనివారం 18-01-2024 తేదీన ఉదయం 9 గంటలకు మున్సిపల్ ఆఫీస్ దగ్గర ఉన్న ఎన్టీఆర్ విగ్రహానికి కదిరి శాసనసభ్యులు కందికుంట వెంకట ప్రసాద్ పూలమాలవేసి ఘన నివాళి అర్పిస్తారు .అక్కడనుండి పి వి ఆర్ ఫంక్షన్ హాల్ దగ్గరికి చేరుకుంటారు అక్కడ గౌరవ శాసనసభ్యులు శ్రీ కందికుంట వెంకట ప్రసాద్ అన్న గారి ఆధ్వర్యంలో జరిగే రక్తదాన శిబిరంలో పాల్గొంటారు. ఈ రక్తదాన శిబిరంలో ప్రతి ఒక్క తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు హాస్పిటల్ అభివృద్ధి కమిటీ సభ్యులు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జిల్లా కార్యవర్గ సభ్యులు పార్లమెంట్ కార్యవర్గ సభ్యులు నియోజవర్గం కార్యవర్గ సభ్యులు మండల కార్యవర్గ సభ్యులు పంచాయతీ బూత్ కన్వీనర్లు యూనిట్ ఇన్చార్జిలు క్లస్టర్ ఇంచార్జిలు సర్పంచులు ఎంపీటీసీలు సీనియర్ నాయకులు పాల్గొని ఈ కార్యక్రమం విజయవంతం చేయండి.

## బైక్ భాస్కర్ రెడ్డిని సన్మానించిన హ్యూమన్ రైట్స్ చైర్మన్ ఆనందం వ్యక్తంచేసిన గ్రామ వైసీపీ నేతలు కార్యకర్తలు



తనకల్లు, మండల రిపోర్టర్ , రవీంద్ర (శుభోదయం న్యూస్): సత్యసాయి జిల్లా తనకల్లు వైసీపీ సీనియర్ నేత చీకటిమానిపల్లి మాజీ సర్పంచ్ బైక విజయభాస్కర్ రెడ్డి వైఎస్ ఆర్ సీపీ జిల్లా ఉపాధ్యక్షులుగా ఎన్నికైన సందర్భంగా ఏపీ & తెలంగాణ స్టేట్స్ హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కౌన్సిల్ అఫ్ ఇండియా విజిలెన్స్ చైర్మన్ తనకంటి వేణుగోపాల్ రెడ్డి శుక్రవారం ఆయన నివాసానికి వెళ్లి శాలువతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా హ్యూమన్ రైట్స్ చైర్మన్ తనకంటి వేణుగోపాల్ రెడ్డి మాట్లాడుతూ:- విజయభాస్కర్ రెడ్డి పార్టీ కోసం అహర్నిశలు కష్టపడ్డారని, పార్టీ అధికారం లో ఉన్నప్పుడే కాదు పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు కూడా కార్యకర్తలకు అండగా ఉండి పార్టీ అభివృద్ధి కోసం కృషి చేశారని వారి సేవలను గుర్తించిన పార్టీ అధిష్టానం జిల్లా ఉపాధ్యక్షులుగా నియమించిందని కొనియాడారు. బైక్ భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ:- తనను మండల కన్వీనర్ స్థాయి నుండి జిల్లా ఉపాధ్యక్షుడిగా నియమించిన పార్టీ అధిష్టానానికి కృతజ్ఞతలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో రెడ్డిమల్లప్ప,ఎల్ ఐసీ భాస్కర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## అపర భగీరధుడు శ్రీకృష్ణదేవరాయలు శ్రీకృష్ణదేవరాయ జయంతి వేడుకల్లో లక్ష్మణ్ కుటాల



తనకల్లు, మండల రిపోర్టర్ రవీంద్ర (శుభోదయం న్యూస్) : దేశభాషలెందు తెలుగు లెస్స అని తెలుగు భాష గొప్పదనాన్ని ప్రపంచం నలుమూలల చాటి చెప్పిన బహుముఖ ప్రజ్ఞాశాలి , ఎన్నో దుర్భేద్యమైన కోటలను , హిందూధర్మ పరిరక్షణ కోసం సైన్స్ సైతం అంతు చిక్కని గొప్ప గొప్ప దేవాలయాలను నిర్మించిన చక్రవర్తి , దక్షిణ భారతదేశంలో ఎన్నో చెరువులను , కుంటలను తవ్వించి సాగు త్రాగు నీరు అందించిన అపర భగీరథుడు విజయ నగర సామ్రాజ్య రారాజు శ్రీ కృష్ణ దేవరాయల జయంతి సందర్భంగా ఆయన ఘనకీర్తి గురించి స్మరిస్తూ రాయల్ పీపుల్స్ ఫ్రంట్ మరియు కదిరి బలిజ సంఘం ఆధ్వర్యంలో ఆయన



విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించడం జరిగింది.“ కులాలకు ,మతాలకు అతీతంగా ఒక సుభిక్షమైన పరిపాలన అందించిన గొప్ప చక్రవర్తి అటువంటి మహనీయుని చరిత్రని భవిష్యత్ తరాలకు తెలిపే విధంగా పాఠ్య పుస్తకాలల్లో ముద్రించి , కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు శ్రీ కృష్ణ దేవరాయల జయంతి కార్యక్రమాలను అధికారికంగా నిర్వహించాలని రాయల్ పీపుల్స్ ఫ్రంట్ మరియు బలిజ , కాపు , తెలగ, ఒంటరి , మున్నూరుకాపు సంఘాల తరపున ఈ ప్రభుత్వానికి, రాజకీయ నాయకులకు , రాజకీయ పార్టీలకు తెలియజేస్తున్నామని కుల సంఘాల నాయకులు తెలియజేశారు.”ఈ కార్యక్రమంలో రాయల్ పీపుల్స్ ఫ్రంట్ , కాపు నాడు , కదిరి పట్టణ బలిజ సంఘం,శ్రీ కృష్ణ దేవరాయల బలిజ సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

## సీఎం సహాయనిధి కింద చెక్కులను పంపిణీ ఎమ్మెల్యే కెఈ.శ్యామ్ కుమార్.....



తుగ్గలి, మండల రిపోర్టర్ మాధవ్ (శుభోదయం న్యూస్ ): మండలం పరిధిలో నే జొన్నగిరి గ్రామానికి చెందిన సంగాల ఆనందమ్మ కు రూ 30,700 లు, రాంపల్లి గ్రామం చెందిన సుభాష్ చంద్రబోస్ కు రూ 30,200 లు ముఖ్యమంత్రి ఆర్థిక సహాయ నిధి కింద మంజూరైన చెక్కులను శుక్రవారం ఎమ్మెల్యే కెఈ. శ్యామ్ కుమార్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనారోగ్యంతో బాధపడుతూ ఆసుపత్రిలో చికిత్స పొందిన వారికి ముఖ్యమంత్రి సహాయనిధి కింద ఆర్థిక సహాయాన్ని అందించేందుకు చెక్కులను పంపిణీ చేసినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షులు తిరుపాల్ నాయుడు, టిడిపి నాయకులు జొన్నగిరి బాలన్న సంఘాల కృష్ణ మిద్దె రవి కుమార్ యాదవ్ ,లక్ష్మణస్వామి, టిడిపి కార్యకర్తలు, నాయకులు, పాల్గొన్నారు.

## పగిడిరాయి గ్రామ దేవతల దేవర ఉత్సవాలకు మాజీ ఎమ్మెల్యే శ్రీదేవమ్మ కు ఆహ్వానం.....



తుగ్గలి, మండల రిపోర్టర్ మాధవ్ (శుభోదయం న్యూస్ ): మండలం పరిధిలోని పగిడిరాయి గ్రామంలో ఈనెల 21, 22 తేదీలలో జరుగుతున్న గ్రామ దేవతల దేవర ఉత్సవాలుకు మాజీ ఎమ్మెల్యే శ్రీదేవమ్మ కు గ్రామ పంచాయతీ సర్పంచ్ గౌరవ సలహాదారుడు బోడిబండ హనుమంతు ఆహ్వాన పత్రాన్ని శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ సర్పంచ్ సలహాదారుడు బోడిబండ హనుమంతు మాట్లాడుతూ తమ గ్రామంలో 5 సంవత్సరాల తర్వాత జరుగుతున్న గ్రామ దేవతల దేవర ఉత్సవాలకు హాజరుకావాలని మాజీ ఎమ్మెల్యే శ్రీదేవమ్మ కు ఆహ్వాన పత్రాన్ని అందజేసినట్లు తెలిపారు. అందుకు మాజీ ఎమ్మెల్యే శ్రీదేవమ్మ దేవర ఉత్సవాలకు హాజరవుతానని తెలిపినట్లు గ్రామపంచాయతీ సర్పంచ్ గౌరవ సలహాదారుడు హనుమంతు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి జగన్నాథ్ రెడ్డి, వైఎస్ఆర్సిపి కార్యకర్తలు ఏ. రంగనాయకులు, కే. సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## నేటి నుండే నల్ల గుండ్లలో హజరత్ సయ్యద్ మునీర్ భాష ఉరుసు....



తుగ్గలి, మండల రిపోర్టర్ మాధవ్ (శుభోదయం న్యూస్ ): మండలం పరిధిలోని నల్ల గుండ్లలో ఈనెల 18వ తేదీ నుండి 20వ తేదీ వరకు హజరత్ సయ్యద్ మునీర్ భాష (ముని స్వామి) ఉరుసు ను గ్రామస్తులు నిర్వహిస్తున్నారు. 18వ తేదీ శనివారం గంధం, 19వ తేదీ ఆదివారం ఉరుసు, 20వ తేదీ జియారత్ ను నిర్వహిస్తున్నారు. ఉరుసు సందర్భంగా 18వ తేదీ శనివారం రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలు నిర్వహించనున్నారు. ఈ పోటీల లో విజేతలైన క్రీడా జట్లకు మొదటి బహుమతి రూ 20,016 లు నగదును చందోలి సర్పంచ్ టి .రంగప్ప, రెండవ బహుమతి రూ 15,016 లు నగదు ఎంకే కొట్టాల ముబారక్ ట్రేడర్ నిర్వాహకుడు ఎస్ మజీద్, మూడవ బహుమతి రూ 10,016 లు నగదును తెలుగు యువత మండల అధ్యక్షులు గిరి గేట్ల సత్య ప్రకాష్, నాలుగవ బహుమతి రూ 5,016 లు నగదు ను నునసారాళ్ల దేవదాసు గౌడ్ లు అందివ్వడం జరుగుతుంది. అలాగే 19వ తేదీ ఆదివారం రాత్రి చెక్కభజన కార్యక్రమాలను కూడా నిర్వహించడం జరుగుతుంది. ఉరుసు కు సంబంధించిన ఏర్పాట్లను నిర్వాహకులు పూర్తి చేయడం జరిగింది. అలాగే గ్రామ పంచాయతీ సర్పంచ్ గౌరవ సలహాదారుడు గోపాల్ రెడ్డి ,పంచాయతీ కార్యదర్శి వెంకటేష్ లు గ్రామంలో త్రాగునీటి సమస్య, పారిశుధ్య సమస్య లేకుండా ఏర్పాట్లు చేశారు .అలాగే విద్యుత్ దీపాలను కూడా ఏర్పాటు చేశారు.

## రూ 8 లక్షలతో గ్రామ ముఖ ద్వారం ఏర్పాటు....

### 19న ఎమ్మెల్యే కేఈ శ్యాం కుమార్ చేతుల మీదుగా ప్రారంభోత్సవం..





తుగ్గలి, మండల రిపోర్టర్ మాధవ్ (శుభోదయం న్యూస్ ): మండలం పరిధిలోని నల్లగుండ్ల గ్రామం లో రూ 8 లక్షల తో నూతనంగా గ్రామ ముఖద్వారం ను నిర్మించారు. గ్రామానికి చెందిన గొర్ల గిడ్డయ్య కుమారుడు కూసినేని శేఖర్ (సాఫ్ట్వేర్ ఇంజనీర్) స్వతగా రూ 8 లక్షలు తో గ్రామ ముఖ ద్వారం నిర్మించారు. గ్రామ ప్రజలు ఆరాధ్య దైవమైన హజరత్ సయ్యద్ మునీర్ భాష ( మునుస్వామి) ఉరుసు సందర్భంగా ఈనెల 19వ తేదీ ఆదివారం పత్తికొండ శాసనసభ్యులు కెఈ శ్యామ్ కుమార్ గ్రామ ముఖద్వారాన్ని ప్రారంభిస్తున్నట్లు స్థానిక టిడిపి నాయకుడు కూశినేని రవి తెలిపారు. నల్లగుండ్ల గ్రామ ప్రజలు ఆరాధ్య దైవమైన మునిస్వామి పేరుమీద ముఖద్వారమును నిర్మించారు. ఈ సందర్భంగా సాఫ్ట్వేర్ ఇంజనీర్ కుశినేని శేఖర్ మాట్లాడుతూ తమ గ్రామం లోకి ప్రవేశించే సమయంలో తమ గ్రామ ప్రజల ఆరాధ్య దైవం మునుస్వామి స్వామిని దర్శించుకోవాలనే నిపముతో మునుస్వామి పేరుమీద గ్రామ ముఖద్వారాన్ని నిర్మించడం జరిగిందని తెలిపారు. మునిస్వామి స్వామి ఆశీస్సులతో మరింత గ్రామ అభివృద్ధి కోసం తన వంతు కృషి చేస్తానని తెలిపారు.

# సదరం సర్టిఫికెట్లు పరిశీలన




రెంటచింతల, మండల రిపోర్టర్ - శ్రీనివాసరావు (శుభోదయం న్యూస్) : చక్రాల కుర్చీలో, మంచానికి పరిమితమై నడవలేని స్థితిలో ఉండి, ఎన్టీఆర్ భరోసా పథకానికి సంబంధించి రూ. 15వేల పెన్షన్ తీసుకుంటున్న లబ్ధిదారుల సదరం సర్టిఫికెట్లను పరిశీలించేందుకు ప్రభుత్వం కేటాయించిన వైద్య బృందం శుక్రవారం మండలంలో పరిశీలన చేపట్టింది. స్థానిక పిహెచ్ సీ వైద్యులు ఎన్ కృష్ణారెడ్డితో కలిసిన స్పెషలిస్ట్ వైద్య బృందం బృందాలుగా మండల పరిధిలోని వివిధ గ్రామాల్లోని లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి వారి అర్హతను పరిశీలించారు. మొత్తం 19 మంది సదరం సర్టిఫికెట్లను పరిశీలించినట్లు వైద్య బృందం వెల్లడించింది. రోజువారీ పరిశీలన నివేదికను ప్రభుత్వానికి సమర్పించనున్నట్లు బృందం సభ్యులు తెలిపారు. పరిశీలన కార్యక్రమంలో ఎంపీడీవో సరోజినీ దేవి, వైద్యులు శ్రీనివాసరావు (క్రైకలూరు), గోపికృష్ణ (గుంటూరు) స్థానిక వైద్యులు రమాదేవితో పాటు వివిధ శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

## అనాథ బాలల సంరక్షణ కేంద్రాల నిర్వహణకు రిజిస్ట్రేషన్ తప్పనిసరి జిల్లాప్రొబేషన్ అధికారి బి.జి.కె కాశీమ్ దొర




(శుభోదయం న్యూస్) బిట్రగుంట: జిల్లాలో అనాథ బాలల సంరక్షణ కేంద్రాల నిర్వహణకు రిజిస్ట్రేషన్ తప్పనిసరి అని జిల్లా ప్రొబేషన్ అధికారి బి.జి.కె.కాశీమ్ దొరఅన్నారు. శుక్రవారం కావలిలోని జెంస్ మరియు,బోగోలుమండలంముంగమూరుక్రాస్ రోడ్డువద్దగల బాలల రక్షణ, ఆధరణకొరకు ని ర్వహిస్తున్న స్వచ్ఛంద , బాలల సంరక్షణ కేంద్రాలనుతనిఖీచేసి వాటినిర్వహణకురిజిస్ట్రేషన్ విధిగాచేసుకోవాలనితెలిపారు. ఈ సందర్భంగాకాశీందొర మాట్లాడుతూ, బాలలన్యాయ చట్టంసెక్షన్41ప్రకారంబాలలరక్షణ కేంద్రాలనిర్వహణకురిజిస్ట్రేషన్ తప్పనిసరిఅన్నాడు. జిల్లాబాలలరక్షితగృహాలతనిఖీ బృందం,కావలిసిడిపిఒసౌజన్యతో కలిసి కందుకూరుచిల్డ్రన్స్ హెూమ్ నుసందర్శించి హెూమ్ నిర్వహణా



విధానాన్ని, రికార్డులనిర్వహణ, పిల్లలకు మౌలికవసతులకల్పన మొదలగుఅంశాలను పరిశీలించారు. చిల్డ్రన్స్ హెూమ్ రిజిస్ట్రేషన్ కొరకుచేసుకున్న దరఖాస్తుపరిశీలనపై హెూమ్ ను సందర్శించినబృందసభ్యులు హెూమ్ నిర్వహణపట్లసంతృప్తి వ్యక్తంచేశారు. పై కార్యక్రమంలో అధికారులుసుమలత ప్రొటెక్షన్ ఆఫీసర్ (ఇన్స్టిట్యూషనల్ కేర్),సమతా ప్రొటెక్షన్ ఆఫీసర్ (నాన్ ఇన్స్టిట్యూషనల్ కేర్), మంజుల లీగల్ కమ్ ప్రొబేషన ఆఫీసర్ పాల్గొన్నారు.

## తీవ్ర నిరాశలో ఉద్యోగ ఉపాధ్యాయిలు తక్షణమే మధ్యంతర భృతిని ప్రకటించాలి : ఏపిటిఎఫ్ డిమాండ్




విజయనగరం, జిల్లా ప్రతినిధి, బొద్దాన.శ్రీనివాస్...(శుభోదయం న్యూస్): ఉద్యోగ ,ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన ఆర్థిక బకాయిలపై చర్చించకుండగనే రాష్ట్ర కేబినెట్ సమావేశం ముగియటం తో ఉద్యోగులు, ఉపాద్యాయులు, పింఛను దారులు తీవ్ర నిరాశకు గురయ్యారని ఏ పి టి ఎఫ్ రాష్ట్ర అకడమిక్ కన్వీనర్ జె సి రాజు అన్నారు. శుక్రవారం స్థానిక ఏ పి టి ఎఫ్ కార్యాలయం లో సంఘ జోనల్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో జె సి రాజు మాట్లాడుతూ కేంద్రం ఎనిమిదో వేతన సవరణ సంఘాన్ని ఏర్పాటు చేసేందుకు నిర్ణయం తీసుకున్న నేపద్యలో, రాష్ట్ర ప్రభుత్వం కూడా కాబినెట్ సుమావేశంలో 12వ వేతన సవరణ సంఘ నియామకం,మధ్యంతర భృతి ప్రకటన పై చర్చించి కాబినెట్ ఆమోదం తెలిపే దిశగా చర్యలు తీసుకుంటారని ఉద్యోగులంతా ఆశించారని కానీ ప్రభుత్వం ఆ దిశగా చర్యలు తీసుకోకపోవడం న్యాయబద్ధంగా లేదన్నారు. తక్షణమే 12 వ వేతన సవరణ సంఘాన్ని నియమించాలిమధ్యాంతర భృతిని ప్రకటించాలి సుదీర్ఘ కాలంగా బకాయిపడిన కరువు భత్య బాకాయిలను చెల్లించాలి సంక్రాంతి కానుక అంటూ అరకొర పి ఎఫ్ బాకాయిలు 10 నెలల కు గాను రెండు నెలలకు చెల్లించారని ఇంకా పి ఎఫ్ ఖాతాదారులకు 8 నెలల బాకాయిలు తక్షణం చెల్లించేలా నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశారుప్రాథమికోన్నత పాఠశాలల వ్యవస్థను కొనసాగిస్తూ అక్కడ పాఠశాల సహాయకులను కొనసాగించాలని కోరారుఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షలు నిర్వహించేలా సంస్కరణలు ఉండాలన్నారు జిల్లా గౌరవాధ్యక్షులు జోగినాయుడు మాట్లాడుతూ రానున్న శాసన మండలి ఎన్నికల్లో ఎమ్ ఎల్ సి గా పోటీ పడుతున్న పి రఘువర్మను అత్యధిక మెజారిటీ తో గెలిపించేలా కార్యకర్తలు వివిధ మండలాల ఏ పి టి ఎఫ్ శ్రేణులు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో బొబ్బిలి మండల శాఖ అధ్యక్షులు సి హెచ్ జె ప్రవీణ్ కుమార్, సి పి ఎస్ జిల్లా కార్యదర్శి ఎల్లయ్య, కుందా శ్రీను, రామ కృష్ణ, కార్యకర్తలు పాల్గొన్నారు.

## గిరిజనులకు 48 వ దుస్తుల పంపిణీ కార్యక్రమం...



విజయనగరం,జిల్లా ప్రతినిధి, బొద్దాన.శ్రీనివాస్...(శుభోదయం న్యూస్):బొబ్బిలి మండలం కేసాయివలస గ్రామంలో స్థానిక గిరిజనులకు శుక్రవారం ఉదయం గాంధీ స్మారక నిధి సభ్యులు దుస్తుల పంపిణీ కార్యక్రమం చేపట్టారు.స్మారక నిధి అధ్యక్షుడు యం.విజయ మోహన్ రావు ఆధ్వర్యంలో వనమిత్ర కృష్ణ దాస్, జి.ధనంజయ, ఎస్. తిరుపతి నాయుడు కలసి 28 చీరలు, 12 జతల ఆడపిల్లల దుస్తులు, 22 దుప్పట్లు, తువ్వాళ్ళు, లుంగీలు , 14 జీన్ ప్యాంట్లు, 17 షర్టు లు , 20 జతల చిన్నపిల్లల దుస్తులు అందజేశారు. ఈ సందర్భంగా విజయ మోహన్ రావు మాట్లాడుతూ ప్రతి నెల పాత బొబ్బిలి బస్ స్టాప్ వద్ద ఉన్న దయ గల గోడ నుండి సేకరించిన వివిధ రకాల దుస్తులను బొబ్బిలి మక్కువ సాలూరు తదితర గిరిజన ప్రాంతాలకు అందజేస్తున్నామని తెలిపారు. ఇప్పటివరకు 48 నెలలుగా వందలాది దుస్తులను అందజేశామన్నారు. ముఖ్యంగా చిన్నపిల్లలకు, స్త్రీలకు బట్టలు అందజేయడం చాలా సంతృప్తికరంగా ఉందన్నారు.

## ఆటో డ్రైవర్లకు కౌన్సిలింగ్ ఇచ్చిన యర్రగొండపాలెం సీఐ ప్రభాకర్ రావు




దోర్నాల, మండలం రిపోర్టర్ ఆవులయ్య (శుభోదయం న్యూస్): ఆటోలలో ఇతర వాహనాలలో పరిమితికిమించి ప్రయాణికులను ఎక్కిస్తే కఠిన చర్యలు తప్పవని సీఐ ప్రభాకర్ రావు తెలిపారు......!ఈ సందర్భంగా దోర్నాల పరిధిలో శుక్రవారం ఆటో డ్రైవర్లకు కౌన్సిలింగ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం సిఐ ప్రభాకర్ మాట్లాడుతూ వాహనం నడిపేటప్పుడు వేగం కన్నా ప్రాణం మిన్న అని ఆటో డ్రైవర్లకు తెలియజేశారు.అదేవిధంగా వలస కూలీలను తరలించేటప్పుడు ఆటోలో పరిమితికి మించితే చర్యలు తప్పవని ఆటో డ్రైవర్లను హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో దోర్నాల ఎస్సై మహేష్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

## రండి... తరలిరండి...కలిసిరండి.... - రక్తదానం చేద్దాం ప్రాణదాతలవుందాం...



దోర్నాల, మండల రిపోర్టర్ ఆవులయ్య (శుభోదయం న్యూస్): సినిమాకు కథానాయకుడు, రాజకీయాలకు మహానాయకుడు... తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ శ్రీ నందమూరి తారక రామారావు గారి వర్ధంతి సందర్భంగా వారి స్మృతికి నివాళులు అర్పిస్తూ...యర్రగొండపాలెం పట్టణంలో... నేడు అనగా 18-01-2025 శనివారం ఉదయం 9 గంటలకు ఎన్టీఆర్ గారికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించడం జరుగుతుంది. అనంతరం తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో లెజెండరీ బ్లడ్ డొనేషన్ క్యాంప్ ద్వారా రక్తదాన శిబిరం ఏర్పాటు చేయడమైనది. కావున యర్రగొండపాలెం నియోజకవర్గంలోని తెలుగుదేశం పార్టీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రక్తదానం చేసి ఎన్టీఆర్ గారికి గౌరవనివాళులర్పిద్దాం అని యేర్వ మల్లికార్జున రెడ్డిపెద్ద దోర్నాల మండల అధ్యక్షులు తెలిపారు.

## పెద్ద బొమ్మలాపురం, చిన్నగుడిపాడు గ్రామాలలో.... వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం




దోర్నాల, మండల రిపోర్టర్ ఆవులయ్య (శుభోదయం న్యూస్): దోర్నాల మండలంలోని పెద్ద బొమ్మలాపురం మరియు చిన్నగుడిపాడు గ్రామంలలో వ్యవసాయ శాఖ వారు పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమం లో మండల వ్యవసాయ అధికారి డి. జవహర్ లాల్ నాయక్ గ్రామంలలో సాగు చేసిన మిరప పంటలను సందర్శించి రైతులకు సస్య రక్షణ చెర్యలు గురించి రైతులకు




అవగాహనా కల్పించడం జరిగింది.రబీ కాలం లో సాగు చేసిన ప్రతి రైతు తప్పనిసరిగా ఈ పంట నమోదు చేసుకోవాలని అలాగే %వనిఎషి% కూడా తప్పనిసరిగా చేసుకోవాలని తెలిపారు. అలాగే ఈ కార్యక్రమం లో రిలేయన్స్ ఫౌండేషన్ వారు రైతులకు మిరప పంట పై అవగాహనా కల్పించారు. ఈ కార్యక్రమం లో %సావశీ% చైతన్య కుమార్, నీలా నాయక్, హరిజన నాయక్, %శ్రూజచీఖీ% సిబ్బంది పాల్గొన్నారు. మరియు ఈ కార్యక్రమంలో పెద్ద బొమ్మలాపురం, చిన్నగుడిపాడు , రైతులు పాల్గొన్నారు.

# వైద్యారోగ్య శాఖ నియామకాలపై సమాచారమివ్వండి... పబ్లిక్ హెల్త్, క్వాలిటీ కన్సల్టెంట్ నియామకాల్లో అవకతవకలు



పార్వతీపురం, మన్యం జిల్లా ప్రతినిధి, బొద్దాన. శ్రీనువాస్...(శుభోదయం న్యూస్):ఎప్పటిలాగే ఓ విలేఖరి కొడుక్కి ఉద్యోగం ఇచ్చినట్లు తెలిసిందిగతంలో గిటిజనులకు చెందిన ఉద్యోగం విలేఖరి కూతురికిచ్చారుఇంత పోటీ ప్రపంచంలో ఈ ఉద్యోగాలకు సింగిల్ డిజిట్ దరఖాస్తులెలా వచ్చాయిఉద్యోగ నియామకాల్లో రిజర్వేషన్లు పాటించకపోవటం అన్యాయం ఆ నియామకాలను రద్దు చేసి, కొత్త నోటిఫికేషన్ ద్వారా నియామకాలు చేపట్టాలిఆయా ఉద్యోగ నియామకాలపై ఆర్టిఐ ద్వారా సమాచారం కోరిన జాతీయ మానవ హక్కుల కమిటీ, ఉత్తరాంధ్ర చెరువులు పరిరక్షణ సమితి జిల్లా అధ్యక్షులు వంగల దాలినాయుడు. వైద్య ఆరోగ్య శాఖ పార్వతీపురం మన్యం జిల్లాలో జరిగిన నియామకాలపై సమాచారం ఇవ్వాలని సమాచార హక్కు చట్టం ద్వారా జాతీయ మానవ హక్కుల కమిటీ, ఉత్తరాంధ్ర చెరువుల పరిరక్షణ సమితి జిల్లా అధ్యక్షులు వంగల దాలినాయుడు సమాచారం కోరారు. శుక్రవారం ఆయన పార్వతీపురంలోని వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో ఆర్టిఐ అధికారిని పి.శిరీష కు సమాచార హక్కు చట్టం సమాచారానికి చెందిన దరఖాస్తును అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్వతీపురం మన్యం జిల్లాకు సంబంధించిన వైద్య ఆరోగ్యశాఖ నియామకాలు అడ్డగోలుగా జరిగాయని పత్రికల్లో న్యూస్ రావడంతో పాటు పలు ఆరోపణల వచ్చాయన్నారు . అవి ఎంతవరకు నిజమో తేల్చేందుకే సమాచార హక్కు చట్టం ద్వారా సమాచారాన్ని కోరానన్నారు. వైద్య ఆరోగ్య శాఖలో క్వాలిటీ కన్సల్టెంట్, పబ్లిక్ హెల్త్ కన్సల్టెంట్ ఉద్యోగాలతో పాటు టిబి కోఆర్డినేటర్, మెడికల్ ఆఫీసర్, సీనియర్ డిఆర్, హెచ్ఐవి సూపర్వైజర్, అకౌంటెంట్ ఉద్యోగాలు నియామకంలో అవకతవకలు జరిగినట్లు పత్రికలతో పాటు పట్టణం కోడై కూస్తోందన్నారు. ముఖ్యంగా ఐటీడీఏ పరిధిలో గాని, వైద్య ఆరోగ్యశాఖ పరిధిలో గాని ఏ ఉద్యోగాలు నియామకం చేపట్టినా తప్పనిసరిగా ఓ పత్రిక విలేకరి కి ఒక ఉద్యోగం ఇవ్వటం అధికారులు ఆనవాయితీగా చేస్తున్నారన్నారు. గతంలో గిరిజనులకు చెందిన ఓ ఉద్యోగాన్ని ఆ విలేఖరి కూతురికి ఇచ్చారన్నారు. దీనిపై గిరిజన సంఘాలు, గిరిజన నిరుద్యోగులు ఐటిడిఏ కార్యాలయం ముందు నిరసన దీక్షలు చేపట్టారన్నారు. ఈ నియామకాల్లో కూడా ఆ విలేకరి కొడుకుకి కూడా ఒక ఉద్యోగం అధికారులు కట్టబెట్టినట్లు తెలిసిందన్నారు. ఒక విలేఖరికి ఉద్యోగ నియామకాల్లో ఉద్యోగాలు అప్పగిస్తున్నారంటే, వాటి నియామకం అవకతవకలు జరిగినట్లే అని ఆరోపించారు. ఉద్యోగ నియామకాల్లో ఆ విలేఖరికి ఎందుకు ఉద్యోగాలు అప్పగిస్తున్నారో అధికారులు చెప్పాలన్నారు. గతంలో జిల్లా ఆస్పత్రిలో కూడా ఆ విలేఖరి సిపార్సుపై పలు ఉద్యోగ నియామకాలు జరిగినట్లు తెలిసిందన్నారు. విలేఖరని భయంతోనే ఉద్యోగాలు ఇస్తున్నారా లేక ముడుపులు తీసుకొని ఇస్తున్నారా...? అనేది అధికారులు స్పష్టం చేయాలన్నారు. ఏ చిన్నపాటి ఉద్యోగ నోటిఫికేషన్ వచ్చినా వందలాది దరఖాస్తులు వచ్చే ఇప్పటి పోటీ ప్రపంచంలో పార్వతీపురం వైద్యారోగ్య శాఖ కార్యాలయం చేపట్టిన ఉద్యోగాలకు తక్కువ సంఖ్యలో సింగిల్ డిజిట్ లో దరఖాస్తులు రావడం వెనుక మతలబు జరిగి ఉంటుందన్నారు . ఇంతకీ ఆ విలేఖరి కూతురు, కొడుక్కి ఇచ్చిన ఉద్యోగాల నియామకం అర్హతను బట్టి ఇచ్చారా...? లేదా అనే దానిపై సమాచార హక్కు చట్టం ద్వారా వచ్చే సమాచారాన్ని బట్టి స్పష్టత వస్తుందన్నారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖలో నియామకాలన్నీ రిజర్వేషన్లు పాటించకుండా, నిబంధనలను తుంగలో తొక్కి ఉద్యోగ నియామకాలు చేపట్టడం సరికాదన్నారు . తక్షణమే ఆ నియామకాల అన్నింటిని రద్దుచేసి, కొత్తగా నోటిఫికేషన్ ఇవ్వాలన్నారు. ఆయ నియామకాలపై దర్యాప్తు నిర్వహించాలన్నారు. దీనికి కారణమైన అధికారులపై చర్యలు చేపట్టాలన్నారు. ఆయ నియామకాలపై తక్షణమే దర్యాప్తు నిర్వహించాలన్నారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖలో పరిపాలన గాడి తప్పిందన్నారు . తక్షణమే ఆయా నియామకాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సమాచారం వచ్చాక పక్కా సమాచారంతో ప్రభుత్వానికి ఫిర్యాదు చేస్తామన్నారు.

## టిడిపి శాశ్వత సభ్యత్వం స్వీకరించిన వడ్లమూడి నాగేంద్ర వడ్లమూడిని అభినందించిన కాకర్ల




ప్రకాశం జిల్లా బ్యూరో - చంద్ర శుభోదయం న్యూస్ (వేంపాడు): ఉదయగిరి నియోజకవర్గం వరికుంటపాడు మండల టిడిపి సీనియర్ రాజకీయ నాయకులు,వేంపాడు టిడిపి నాయకులు వడ్లమూడి నాగేంద్ర ఉదయగిరి శాసనసభ్యులు కాకర్ల సురేష్ ఆధ్వర్యంలో లక్ష రూపాయలు చెల్లించి టిడిపి శాశ్వత సభ్యత్వం స్వీకరించడం జరిగింది. ఈ సందర్భంగా కాకర్ల సురేష్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా టిడిపి సభ్యత్వ నమోదు భారీ స్థాయిలో నమోదు కావడం జరిగిందని అలాగే శాశ్వత సభ్యత్వాలు కూడా అదే స్థాయిలో జరుగుతున్నట్లు అన్నారు. శాశ్వత సభ్యత్వం స్వీకరించిన టిడిపి నాయకులు వడ్లమూడి నాగేంద్ర ను కాకర్ల సురేష్ అభినందించారు. ఈ కార్యక్రమంలో పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

## సిబ్బంది ఉండరు.. వైద్యం అందదు..

### పుల్లల చెరువు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంపై అసహనం వ్యక్తం చేస్తున్న రోగులు




ఎర్రగొండపాలెం నియోజకవర్గ ఇంచార్జ్ - కాకర్ల కోటయ్య (శుభోదయం న్యూస్ ): రాష్ట్ర ప్రభుత్వం ప్రతి పేదవాడికి మెరుగైన వైద్యం అందించాలని వైద్య ఆరోగ్య రంగానికి పెద్దపీట వేసింది. వైద్య ఆరోగ్య కేంద్రాల్లో ఎక్కడ కూడా అసౌకర్యాలు లేకుండా సిబ్బంది కొరత లేకుండా సకల సౌకర్యాలు ఏర్పాటు చేస్తున్నప్పటికీ రోగులకు మాత్రమే పూర్తిస్థాయిలో వైద్యం అందడం లేదు. వైద్యో నారాయణ హరి అనేది మాటలకే పరిమితం తప్ప పుల్లల చెరువు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అలాంటి ఊసే కనపడటం. వివరాల్లోకి వెళితే స్థానిక పుల్లల చెరువు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సిబ్బంది పనితీరు పై రోగులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఎప్పుడైనా వైద్యం కోసం ఆస్పత్రులకు వచ్చినప్పుడు సిబ్బంది ప్రవర్తన పరివాహకం మీద విస్తుపోతున్నారు. ఇక్కడ వైద్యం అనేది సకాలంలో అందకపోవడం వల్ల ఎక్కువగా స్థానికంగా నిత్యం అందుబాటులో ఉండే ఆర్ఎంపీ డాక్టర్లును ఆశ్రయిస్తున్నారు. ప్రభుత్వ హాస్పిటల్ లో వైద్యం, మందులు, వైద్యపరీక్షలు అన్ని ఉచితం. అయినప్పటికీ అక్కడ వైద్య సదుపాయాలు సరిగ్గా ఉండటం లేదని వచ్చిన రోగులు , డబ్బులు వెచ్చించి ఆర్ఎంపీ డాక్టర్లతో వైద్యం చేయించుకుంటున్నారు.ఇక్కడ పని చేసే సిబ్బంది సకాలంలో వైద్య సేవలు అందించకపోవడమే ఇందుకు నిదర్శనం. సిబ్బంది స్థానికంగా ఉండకపోవడం వల్ల సాయంత్రం అయ్యే సరికి బస్సులు ఉండవని ఇంటి ప్రయానానికి వెతుకులాట మొదలవుతుంది. ముందుగా ఇంటికి వెళ్ళాలనే తాపత్రయంతో ఎవరికి వారే యమునా తీరే అన్న చందనంగా డ్యూటీకి రావాల్సిన సిబ్బంది రాకముందే ఇంటికి పయనం అవుతున్నారు.పొరపాటున పురిటి నొప్పులతో హాస్పటల్ కి వచ్చిన గర్భిణి స్త్రీలు వైద్యుల కోసం ఎదురు చూసి చూసి చేసేదేమీలేక 108 సహాయంతో యర్రగొండపాలెం హాస్పిటల్ వెళ్ళాల్సివస్తుందని ప్రజలు వాపోతున్నారు.ఆ సమయంలో ఏదైనా జరగరానిది జరిగితే ఉంటే ఎవరు బాధ్యత వహిస్తారని బాధితులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.ఇప్పటికే చాల సందర్భాల్లో ఇలా జరిగిందని వారు వాపోయారు. పేరుకే ఆరోగ్య కేంద్రం తప్ప ఇక్కడ సిబ్బంది సక్రమంగా విధులు నిర్వహించడం లేదని, ఇక్కడ సిబ్బంది నిర్లక్ష్య వైఖరితో ప్రజల ప్రాణాలు కోల్పోయే పరిస్థితి ఉందని చెప్పుకొచ్చారు. సంబంధిత అధికారులు స్పందించి వైద్య ఆరోగ్య సిబ్బంది స్థానికంగా ఉండి ఆరోగ్యకేంద్రానికి వచ్చే ప్రజలకు సేవలు అందించే విధంగా సంబంధిత స్పందించి చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

## పాకల మరియు పాత సింగరాయకొండ గ్రామాలలో పొలం పిలుస్తుంది కార్యక్రమం




సింగరాయకొండ, మండల రిపోర్టర్ - పసుమర్తి జాలయ్య (శుభోదయం న్యూస్): సింగరాయకొండ మండలంలోని పాకల మరియు పాత సింగరాయకొండ గ్రామాలలో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించడం జరిగినది ఈ కార్యక్రమానికి సింగరాయకొండ సహాయ వ్యవసాయ సంచాలకులు(రె ) నిర్మలా కుమారి మరియు మండల వ్యవసాయ అధికారి సుధాకర్ పాల్గొన్నారు సహాయ వ్యవసాయ సంచాలకులు నిర్మల కుమారి మాట్లాడుతూ పిఎం కిసాన్ పథకం కింద నమోదైన ప్రతి రైతు మార్చి 31 లోపు ఫార్మర్ రిజిస్ట్రేషన్ స్థానిక రైతు సేవ కేంద్రాలలో పూర్తి చేసికోవలసింది గా తెలియజేశారు. మండల వ్యవసాయ అధికారి మాట్లాడుతూ గ్రామంలో పంటవేసిన ప్రతి రైతు తప్పనిసరిగా ఈ పంట నమోదు చేసుకోవలసినదిగా తెలియజేశారు పిఎం కిసాన్ కొరకు బ్యాంకు అకౌంట్ ని తప్పనిసరిగా ఎన్. పి. సి. ఐ మ్యాపింగ్ చేయించుకోవలసినదిగా తెలియజేశారు. అనంతరం సహాయ వ్యవసాయ సంచాలకులు మరియు మండల వ్యవసాయ అధికారి, వరి పంటలో క్షేత్ర సందర్శన చేయడం జరిగినది ఇందులో భాగంగా వరి పంటలో పొటాష్ దాతులోపాలను మరియు ఆకు ముడతను గుర్తించడం జరిగినది వీటికి నివారణ చర్యలుగా ఎకరాకు 20 కేజీలుపోటాష్ పైపాటుగా వేసుకోవలసినదిగా మరియు ఆకు ముడత నివారణకు ఎసిపేట్ మందును 1 గ్రా లీటర్ నీటికి కలిపి 200 లీటర్లు ఎకరాకు పిచికారి చేసుకోవలసినదిగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి జహీర్, గ్రామ వ్యవసాయ సహాయకులు కిషోర్, సురేష్ , అరుణ్ చంద్ మరియు గ్రామ రైతు సోదరులు పాల్గొన్నారు.

## బొబ్బిలి మండల ప్రజా పరిషత్ కార్యాలయం నందు డివిజనల్ స్థాయి ఉపాధి హామీ టెక్నికల్ అసిస్టెంట్లతో శిక్షణ...



విజయనగరం, జిల్లా ప్రతినిధి, బొద్దాన.శ్రీనివాస్,(శోభోదయం న్యూస్):బొబ్బిలి మండల ప్రజా పరిషత్ కార్యాలయం నందు డివిజనల్ స్థాయి ఉపాధి హామీ టెక్నికల్ అసిస్టెంట్లతో శిక్షణ...కార్యక్రమం జరిగినది. శిక్షణ కార్యక్రమమునకు ఎం కిరణ్ కుమార్ ఏపీ డి, పి రవికుమార్ ఎంపీడీవో, జే ఈ చక్రవర్తి, జిల్లా డుమా ఆఫీస్ నుంచి చిన్నం నాయుడు హాజరైనారు. సదరు శిక్షణ కార్యక్రమం నందు చేపల చెరువులు, ఫామ్



పాంట్స్, రింగ్ ట్రెంచెస్, బౌండ్రీ ట్రాంచెస్, అమృత్ సరోవర్ లాంటి వ్యవసాయ సంబంధమైన పనులు పై ప్రత్యేక శ్రద్ధ వహించి చేయించాలని తెలియపరిచారు. మరియు కనీస వేతనం రోజుకి 300 రూపాయలు వేతనదారుడు కి లబ్ధి పొందేలా పని చేయించవలెనని తెలియపరిచారు.

# యూనియన్ డైరీ బహుకరణ



ప్రకాశం జిల్లా స్టాఫ్ రిపోర్టర్, (శుభోదయం న్యూస్): చీరాల డివిజన్ విద్యుత్ ఎక్సక్యూటివ్ ఇంజనీర్ జె థామస్ ని 1104 విద్యుత్ యూనియన్ నాయకులు శాలువతో మరియు పుష్పగుచ్ఛ మ్ తో సత్కరించారు అనంతరం 1104 యూనియన్ డైరీని ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కి బహుకరించినారు. ఈ సందర్భంగా ఈఈ మాట్లాడుతూ సంస్థ అభివృద్ధి కొరకు ప్రతి కార్మికుడు కష్టపడి పని చెయ్యాలన్నారు. ఈ కార్యక్రమంలో 1104 డివిజన్ అధ్యక్షులు యన్ శ్రీనివాసరావు కార్యదర్శి డి మనోహర్ మరియు కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

# యాడికి గ్రామంలో గ్రామ సభ నిర్వహించిన ఎమ్మెల్యే జేసీ అస్మిత్ రెడ్డి



యాడికి, నవంబర్ 17 మండల రిపోర్టర్ బండారు బాలకృష్ణ (శుభోదయం న్యూస్): మండలంలోని హాస్పిటల్ కాలనీ రాముల గుడి వద్ద తాడిపత్రి ఎమ్మెల్యే జేసీ అస్మిత్ రెడ్డి ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించడం జరిగింది. ఈ సమావేశానికి హాస్పిటల్ కాలనీ, చౌడేశ్వరి కాలనీ, చెన్నకేశవ స్వామి కాలనీ, లాలెప్ప కాలనీలు, ఎస్సీ కాలనీలకు సంబంధించి ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ సమావేశంలో ప్రజలు తమ సమస్యలను



ఎమ్మెల్యే అస్మిత రెడ్డికి తెలుపగా సత్వరమే పరిష్కారం లభించే వాటికి అక్కడే పరిష్కారం చూపించారు. మరికొన్ని సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువెళ్లి సమస్యను తొందరగా పరిష్కరించాలని ఆదేశించారు. కొంతమంది ప్రజలు అడిగిన సమస్యలను సావధానంగా విని తొందరలోనే వాటికి కూడా పరిష్కారం చేస్తామని తెలిపారు. ఈ సమావేశంలో మండల స్థాయి అధికారులు, పోలీసు అధికారులు, సచివాలయ ఉద్యోగులు, టిడిపి, జనసేన, బిజెపి కూటమి నాయకులు కార్యకర్తలు జెసి అనుచరులు అభిమానులు పాల్గొనడం జరిగింది.

# తెలంగాణ రాష్ట్ర హైకోర్టు జడ్జిగా "నందికొండ నర్సింగ్ రావు" నియామకం....



తెలంగాణ రాష్ట్ర (శుభోదయం న్యూస్) : హైకోర్టు న్యాయమూర్తులుగా నలుగురి పేర్లను సుప్రీంకోర్ట్ కొలిజియం కేంద్ర ప్రభుత్వానికి సిఫారసు చేసింది..సిటీ సివిల్ స్మాల్ కాజేస్ కోర్ట్ చీఫ్ జడ్జి "నందికొండ నర్సింగ్



రావు" ను "తెలంగాణ రాష్ట్ర హైకోర్ట్ న్యాయమూర్తిగా" సుప్రీంకోర్టు ఈ నెల 11 న సిఫారసు చేసింది..కొన్నే సంపత్, బార్లపాటి జయరాం, లోగిడి జయన్న, కోట్ల శ్రీనివాస్, కుమార స్వామి, ఆరవింద్, నర్సింగ్ రావు ను మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు..చైర్మన్ : సి.సావిత్రి, దేవలూటి శంకర్, శివ శంకర్, కృష్ణ మూర్తి, కౌలూరి శ్రీనివాసులు, కాశిరావు, తదితరులు త్వరలో నర్సింగ్ రావు ను మర్యాదపూర్వకంగా కలిసి సన్మానం చేయనున్నట్లు ఒక ప్రకటన లో తెలిపారు.

# ఆర్యవైశ్యసంఘ అధ్యక్షుడిగా గోపవరపు గురునాథం



యర్రగొండపాలెం, నియోజకవర్గ ఇన్చార్జ్ - కాకర్ల కోటయ్య (శుభోదయం న్యూస్) : పుల్లలచెరువు మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్ష ఎన్నికలు ప్రస్తుత మండల అధ్యక్షులు గ్రంథిశిల వెంకట కృష్ణారావు గారి ఆధ్వర్యంలో వారి షాపులో శుక్రవారం నిర్వహించడం జరిగినది. ఈ ఎన్నికల కార్యక్రమానికి ఎన్నికల అధికారులుగా రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ టూరిజం శాఖ చైర్మన్ అనుమాలశెట్టి సుబ్బారావు గారు ప్రకాశం జిల్లా ఆర్యవైశ్య సంఘం కార్య నిర్వహణ సభ్యులు కొత్త మాసు సుబ్రమణ్యం గారు పుల్లలచేరువు మండల ఆర్యవైశ్య అధ్యక్షులుగా గోపవరపు వెంకట గురునాథం ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. ప్రధాన కార్యదర్శి ఉప్పల వెంకట ఫణీంద్ర కుమార్ ఉపాధ్యక్షులుగా కాసుల రాంప్రసాద్ కోశాధికారిగా కాసులు వెంకటేశ్వర్లు ను ఎన్నుకున్నట్లు తెలిపారు. కోట హనుమంతరావు అధ్యక్షులు ప్రకాశం జిల్లా ఆర్యవైశ్య సంఘం ఆదేశాలు మేరకు ఎన్నికల నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల ఆర్యవైశులు హనుమంతరావు , బాల రామాంజనేయులు , వెంకట స్వామి ఎ వెంకటేశ్వర్లు , భాస్కర్ , కే వెంకటేశ్వర్లు , జి నరసింహారావు , యూ పుల్లారావు , యూ సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

# సారంగపల్లి లో క్రికెట్ టోర్నమెంట్



మంచిర్యాల జిల్లా ప్రతినిధి - శ్రీనివాస్ (శుభోదయం న్యూస్ ):: మందమర్రి మండలం సారంగపల్లి గ్రామంలో స్వర్గీయ గడ్డం వెంకటస్వామి (కాక) స్మారక క్రికెట్ టోర్నమెంట్ ఎర్పాటు చేసారు. ఈ టోర్నమెంట్ కు ముఖ్యఅతిథిగా కాంగ్రెస్ నాయకులు తిరమల్ రెడ్డి పాల్గొనడం జరిగింది. అనంతరం వారు మాట్లాడుతూ క్రీడాలు యువతలో ప్రతిభను వెలికి తీయడంలో మరియు సామాజిక విలువలను పెంపొందించడంలో కీలకపాత్ర పోషిస్తాయి క్రీడలతోపాటు వ్యక్తిత్వ వికాసానికి కృషి అని అన్నారు. అలాగే టోర్నమెంట్ కి తనవంతు కృషి చేస్తానన్నాడు. ఈ కార్యక్రమంలో భాగంగా మేనేజ్మెంట్ సభ్యులు మాజీ సర్పంచ్ చంద్రకళ, బచ్చలి రాములు, ఎండి తాజుద్దీన్, యాదగిరి మల్లేష్ , లింగయ్య యాదవ్, రామగిరి కుమార్ స్వామి, మాట్లాడుతూ స్వర్గీయ గడ్డం వెంకటస్వామి క్రికెట్ టోర్నమెంట్ ను సారంగపల్లి లో నిర్వహించడం వలన మందమరి మండలంలోని చుట్టుపక్కల గ్రామాల యువతను ప్రోత్సహించడం జరుగుతుందని అన్నారు...

# ఫ్యాబ్రికేషన్ కార్మికులకు రావలసిన రెండు నెలల వేతనం ఇప్పించిన

## బిఆర్ టియు రాష్ట్ర కార్మిక నాయకుడు శ్రమశక్తి అవార్డు గ్రహీత రవిసింగ్..



కుత్బుల్లాపూర్,(శుభోదయం న్యూస్ ): నియోజకవర్గంలోని సూరారం ఇండస్ట్రీ ఏరియాలో "భాష్ ఖాన్ ఫ్యాబ్రికేషన్" లో ప్రవీణ్, మున్న, ఇద్దరు కార్మికులు ఫ్యాబ్రికేషన్ షాప్ లో గత కొన్ని సంవత్సరల నుంచి ఫ్యాబ్రికేషన్ ఓనర్ భాష దగ్గర చేసేవారు... కొన్ని అనివార్య కారణాలవల్ల రెండు నెలల వేతనం ఇవ్వకుండా ఇబ్బంది పెడుతుండడంతో ఫ్యాబ్రికేషన్ వర్క్ మానేయడం జరిగింది... మొత్తం "జూన్, జూలై," రెండు నెలల వేతనం 60,000/- వేల రూపాయలు ఇవ్వాల్సి ఉండగా పలుమార్లు ఫ్యాబ్రికేషన్ ఓనర్ ఎండి. భాషను ఇంత అడిగిన నిర్లక్ష్యం వహిస్తూ పట్టించుకోకపోవడంతో విసుగు చెందిన కార్మికులు ప్రవీణ్, మున్న తమకు తెలిసిన తోటి కార్మికుల ద్వారా మనకు ఎవరైతే న్యాయం చేస్తారో అని తెలుసుకొని, బిఆర్ టియు రాష్ట్ర కార్మిక నాయకుడు శ్రమశక్తి అవార్డు గ్రహీత రవిసింగ్ గురించి తెలుసుకొని తన కార్యాలయం వద్దకు వచ్చి తనకు జరిగిన అన్యాయం గురించి వివరించారు...వెంటనే స్పందించిన కార్మిక నాయకుడు రవిసింగ్.. హుటాహుటిన ఫ్యాబ్రికేషన్ షాప్ దగ్గరికి వెళ్లి ఓనర్ ఎండి.భాష తో పలుమార్లు చర్చించి కార్మికులు ఇద్దరికీ కలిపి మొత్తం రావాల్సిన వేతనం జూన్, జూలై రెండు నెలల వేతనం, 60,000/- వేల రూపాయలు ఇప్పించడం జరిగింది... ఫ్యాబ్రికేషన్ కార్మికులు మాట్లాడుతూ మాకు న్యాయం చేసిన రవిసింగ్ కి ప్రత్యేక ధన్యవాదాలు, తెలియజేశారు... ఈ కార్యక్రమంలో అనిల్, సుదర్శన్, జగన్, కిరణ్, తదితరులు పాల్గొన్నారు..

# రాష్ట్రపతి చేతుల మీదుగా

## "అర్జున అవార్డు"ను అందుకున్న ఓరుగల్లు ముద్దుబిడ్డ దీప్తి జీవంజి



వరంగల్ స్టాఫ్ రిపోర్టర్ - శ్యామ్ (శుభోదయం న్యూస్):రాష్ట్రపతి భవన్‌లో జరిగిన జాతీయ క్రీడా అవార్డుల ప్రధానోత్సవంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా శుక్రవారం రోజున అర్జున అవార్డును అందుకున్న తెలంగాణ క్రీడారత్నం,వరంగల్ జిల్లా పర్వతగిరి మండల పరిధిలోని కల్లెడ గ్రామ ముద్దుబిడ్డ,పారా ఒలింపియన్ అథ్లెట్ దీప్తి జీవంజికి వర్ధన్నపేట ఎమ్మెల్యే విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు శుభాకాంక్షలు తెలిపారు.తెలంగాణలో కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ఏర్పడ నాటి నుంచి సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో క్రీడలను ప్రోత్సహిస్తూ వారిని గౌరవిస్తూ అలాగే మరింత మంది క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ పోటీల్లో రాణించేలా మెరుగైన స్పోర్ట్స్ పాలసీతో ప్రజా ప్రభుత్వం ముందుకుపోతున్న విషయాన్ని ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగరాజు గుర్తుచేశారు.

# రామగుండం నగరపాలక సంస్థ పరిధిలోని వివిధ ప్రాంతాలలో పారిశుధ్య నిర్వహణ, ఇతర సమస్యలను పరిశీలించిన అదనపు కలెక్టర్ జె.అరుణ శ్రీ



రామగుండం మండలం రిపోర్టర్-తిరుపతి,(శుభోదయం న్యూస్) పెద్దపల్లి జిల్లా అదనపు కలెక్టర్ ( స్థానిక సంస్థలు ) . రామగుండం నగర పాలక సంస్థ కమిషనర్ ( ఎఫ్ ఎ సి ) జె. అరుణ శ్రీ శుక్రవారం రామగుండం నగర పాలక సంస్థ పరిధిలోని వివిధ ప్రాంతాల్లో పర్యటించి పారిశుద్ధ్య నిర్వహణ, ఇతర సమస్యలను ప్రత్యక్షంగా పరిశీలించారు. విట్టల్ నగర్ లో ప్రమాదకరంగా పగుళ్లు చూపిన వంతెన పరిశీలించి యుద్ధ ప్రాతిపదికన మరమ్మత్తులు చేపట్టాలని ఆదేశించారు. గౌతమి నగర్ లోని కంపోస్ట్ యార్డ్



, డ్రై రీసోర్స్ సెంటర్ పరిశీలించారు. తడి చెత్త తో కంపోస్ట్ తయారీ పటిష్టంగా జరిగేలా చర్యలు చేపట్టాలని అన్నారు. అనంతరం నగర పాలక సంస్థ పారిశుద్ధ్య వాహన చోదకులతో సమావేశం నిర్వహించారు. ఉదయం 5 గంటల నుండి మధ్యాహ్నం ఒంటిగంట వరకు క్షేత్ర స్థాయిలో ఉండి విధులు నిర్వహించాలని ఆదేశించారు . సేకరించిన చెత్తను ఎక్కడ పడితే అక్కడ పడ వేయకుండా డంపింగ్ యార్డ్ కు రవాణా చేయాలని అన్నారు. ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం పారిశుద్ధ్య కార్మికులకు ఇవ్వవలసిన ఉపకరణాలు , దుస్తులు వగైరా వెంటనే అందజేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా నగర పాలక సంస్థ అసిస్టెంట్ కమిషనర్ రాయలింగు , ఇఇ రామన్ , సానిటరీ ఇన్స్పెక్టర్లు నాగ భూషణం , సునీల్ రాథోడ్, ఎన్విరాన్మెంటల్ ఇంజనీర్ మధుకర్ తదితరులు ఉన్నారు.

# భారత రాజ్యాంగ నిర్మాత బాబాసాహెబ్

## డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గారి, విగ్రహాన్ని తరలించవద్దు తొలగించవద్దు



గోదావరిఖని టౌన్ రిపోర్టర్- సురేష్,(శుభోదయం న్యూస్) ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం, ఆలయ ఫౌండేషన్ తెలంగాణ అంబేద్కర్ భవన నిర్మాణ కమిటీ చారిటబుల్ ట్రస్ట్,ఆధ్వర్యంలో నేషనల్ ఎస్సీ కమిషన్ సభ్యులు గౌరవ శ్రీ వడ్డేపల్లి రామ్ చందర్,గారిని, పెద్దపెల్లి జిల్లా అదనపు కలెక్టర్ రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ ఇన్చార్జి కమిషనర్ శ్రీమతి అరుణ శ్రీ ఐఏఎస్ గారిని శుక్రవారం కలవడం జరిగింది, గోదావరిఖని పట్టణంలోని రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ ఆఫీస్ ముందు గల భారతరత్న బాబాసాహెబ్ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గారి విగ్రహాన్ని తరలించేందుకు తొలగించేందుకు కొంతమంది మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు కుట్రలు పన్నుతున్నారని విగ్రహాన్ని తరలించడం గాని తొలగించడం గాని చేయవద్దని వారికి విజ్ఞప్తి చేశారు ప్రభుత్వం చేపట్టే అభివృద్ధి కార్యక్రమాలకు ఆల్ ఇండియా అంబేద్కర్



యువజన సంఘం, వ్యతిరేకం కాదని, విగ్రహం చుట్టూ రోడ్డు వెడల్పు చేయించి, వాటర్ ఫౌంటెన్ ఇతర అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలని విజ్ఞప్తి,చేశారు, ఈ మేరకు నేషనల్ ఎస్సీ కమిషన్ సభ్యులు గౌరవ శ్రీ వడ్డేపల్లి రామచందర్ గారికి చేసిన విజ్ఞప్తిలో, జిల్లా కలెక్టర్ గారికి తగిన ఆదేశాలు ఇప్పించవలసిందిగా విజ్ఞప్తి చేయడం జరిగింది, నేషనల్ ఎస్సీ కమిషన్ సభ్యులు శ్రీ వడ్డేపల్లి రామచంద్ర గారిని ఎన్టిపిసి జ్యోతిభవన్ విఐపి గెస్ట్ హౌస్ లో కలవడం జరిగింది, పెద్దపల్లి జిల్లా అదనపు కలెక్టర్ రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ ఇంచార్జ్ కమిషనర్ శ్రీమతి అరుణా శ్రీ ఐఏఎస్ గారిని రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో కలవడం జరిగింది ఈ కార్యక్రమంలో ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం జాతీయ ఉపాధ్యక్షులు శ్రీ మామిడిపల్లి బాపయ్య, గారు, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు శ్రీబొంకూరి మధు ఆరు, రిటైర్డ్ ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ శ్రీ,బి,రాజయ్య గారు, ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం, జాతీయ కార్యదర్శి శ్రీ,కొంకటి లక్ష్మణ్ గారు రాష్ట్ర ఉపాధ్యక్షులు శ్రీమైస రాజేష్ గారు, శ్రీకాంపల్లి సతీష్ గారు, ఆలయ ఫౌండేషన్ సీఈవో శ్రీ,తీట్ల రమేష్ బాబు గారు, డిప్యూటీ సీఈవో, శ్రీమిట్టపల్లి రాజేందర్ కుమార్, గారు,సభ్యులు శ్రీ ఆర కొండ వెంకటేశ్వర్లు జయశంకర్ భూపాలపల్లి జిల్లా కోఆర్డినేటర్ శ్రీ,పొట్ట పోచయ్య గారు, నాయకులు శ్రీపంతకాని చిన్న సడవలి గారు, శ్రీ,గద్దల సంపత్ గారు, తదితరులున్నారు.

# రామగుండం కార్పొరేషన్ లో వీది కుక్కల సంరక్షణ కేంద్రంను ఏర్పాటు చేసి ప్రజల సౌకర్యార్థం హెల్ప్ లైన్ నంబర్ కేటాయించాలి..!



నగరపాలక సంస్థ కమిషనర్ కు వినతిపత్రం ఇచ్చిన బిఆర్ఎస్ నాయకులు ఈదునూరి నర్సింగ్

గోదావరిఖని టౌన్ రిపోర్టర్– సురేష్,(శుభోదయం న్యూస్) రామగుండం పారిశ్రామిక ప్రాంతంలోని మున్సిపల్ కార్పొరేషన్ లో ఉన్నటువంటి 50 డివిజన్ల పరిధిలో వీధి విధిలో కుక్కల వల్ల మరియు కోతుల బెడద వలన గల్లీలలో వీధి కుక్కలు గుంపులు, గుంపులుగా స్వైర విహారం చేయడం వల్ల చిన్న పిల్లలు నుండి మొదలుకొని పెద్దల వరకు ఒంటరిగా బయటకు వెళ్ళాలంటే.. బయ భ్రాంతులకు లోనవుతూ..అనేక ఇబ్బందులకుగురవుతున్నారు. ఈ కుక్కల దాడుల వలన అనేక మంది గాయల బారినపడి కొంత మంది చిన్న పిల్లలు చనిపోయిన దారుణ మైన ఘటనలు కూడా వున్నాయి.ఉదయం తెల్లవారుజామున ఇంటి నుండి వాకింగ్ కు సైతం వెళ్ళలేని పరిస్థితి నెలకొన్నది. ఈ ప్రాంతంలో ఆయా ఎరియాల వారీగా.. వాకింగ్ చేసే మహిళలను, స్కూల్ కు, కాలేజ్ లకు వెళ్లే విద్యార్థిని విద్యార్థులు, చిన్న పిల్లలను కుక్కలు వెంబడించి వారిని పరుగులు పెట్టించి మరి కరుస్తున్నాయి. డ్యూటిలకు వెళ్లే సింగరేణి కార్మికులు, ఇతరాత్ర ఉద్యోగస్తులు ముఖ్యంగా.. రాత్రి సమయాలలో బైక్ పై వెళ్లిన వారిపై సైతంవెంబడిస్తున్నాయి. దీనితో ప్రజలు అనేక ఇబ్బందులకు గురవుతున్నారు... ఈ కుక్కల బెడద వలన పలుమార్లు, మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ గారి ఆదేశాల మేరకు సంబంధిత మున్సిపల్ కార్పొరేషన్ అధికారుల దృష్టికి తీసుకువచ్చిన మున్సిపల్ సిబ్బంది ఎలాంటి చర్యలు తీసుకోలేక పోవడం దురదృష్టకరం.కావునా రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ప్రజల సౌకర్యార్థం గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ తరహాలో ఇక్కడి రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ లో కూడా విధి కుక్కల సంరక్షణ కేంద్రం ఏర్పాటు చేసి,ఈ ప్రాంత ప్రజలు ఎప్పుడు ఫోన్ చేసిన మున్సిపల్ సిబ్బంది. అందుబాటులో వుండే విధంగా హెల్ప్ లైన్ వాట్సాప్ నెంబర్ నుకేటాయించాలి.కుక్కలను చంప కుండా వాటి కోసం ఈ ప్రాంతంలో కుక్కల సంరక్షణ కేంద్రం ఏర్పాటు చేయాలని బిఆర్ఎస్ పార్టీ పక్షాన తమరికి సహృదయం తో..విజ్ఞప్తి చేస్తున్నాను.

# తప్పుడు అఫిడవిట్ సమర్పిస్తే చట్టపరమైన కఠిన చర్యలు తప్పవు పోలీస్ కమీషనర్ శ్రీ ఎం. శ్రీనివాస్



రామగుండం మండల రిపోర్టర్–తిరుపతి,(శుభోదయం న్యూస్): తమపై ఎలాంటి పోలీస్ కేసులు లేవు అని క్లియరెన్స్ నిమిత్తం కొంతమంది తప్పుడు అఫిడవిట్ లు సమర్పించడం జరుగుతుంది కావున అట్టి వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తప్పవు అని కేసులు నమోదు చేయడం జరుగుతుంది అని రామగుండం పోలీస్ కమిషనర్ సిఎం శ్రీనివాస్ ఐపిఎస్ ఐజి గారు ఒక ప్రకటనలో తెలిపారు.రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధి పెద్దపల్లి, మంచిర్యాల జోన్ పరిధిలోని వారు పాస్ పోర్ట్ కోసం, ఉద్యోగ నియామకాల కోసం, బయట దేశాలకు వెళ్లడం కోసం, తదితర కంపెనీ, సంస్థలు, పరిశ్రమలలో పనిచేయడం కోసం పోలీస్ వెరిఫికేషన్ సర్టిఫికెట్ ( పి వి సి) పోలీస్ క్లియరెన్స్ సర్టిఫికెట్ (పీసీసీ) కోసం దరఖాస్తు లు చేసుకొనే వారు కొంతమంది వారిపై గతంలో కేసులు నమోదు కాబడిన కూడా తమపై ఏలాంటి కేసులు లేవని పోలీస్ కేసుల క్లియరెన్స్ నిమిత్తం తప్పుడు అఫిడవిట్ లు సమర్పించడం జరుగుతుంది. రామగుండం కమీషనరేట్ స్పెషల్ బ్రాంచ్ అధికారులు, సిబ్బంది వారి దరఖాస్తు ఆధారంగా విచారణ చేసినప్పుడు కొంతమంది పై కేసులు నమోదు కాబడినవి అని గుర్తించడం జరిగింది. గతంలో కూడా తప్పుడు అఫిడవిట్ ఇచ్చిన వారిపై కేసులు నమోదు



చేయడం జరిగింది. ఇప్పుడు తప్పుడు అఫిడవిట్ లు ఇచ్చిన సుమారు 20 మందిని స్పెషల్ బ్రాంచ్ వారు గుర్తించడం జరిగింది వారిపై చట్టపరమైన కేసులు నమోదు చేయడం జరుగుతుంది. భవిష్యత్తు లో కూడా పోలీస్ వెరిఫికేషన్ సర్టిఫికెట్, పోలీస్ క్లియరెన్స్ సర్టిఫికెట్ కోసం దరఖాస్తు చేసుకునే ప్రతి ఒక్కరు తప్పుడు అఫిడవిట్ సమర్పించినట్లయితే వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుంది కేసులు నమోదు చేసి జైలుకు పంపడం జరుగుతుందని రామగుండం పోలీస్ కమీషనర్ గారు హెచ్చరించారు. అఫిడవిట్ నోటరీ చేసే వాళ్ళు కూడా మీ దగ్గరకు అఫిడవిట్ కోసం వచ్చే వాళ్లకు కూడా తప్పుడు సమాచారంతో అఫిడవిట్ సమర్పిస్తే విచారణలో పోలీసు వారు గుర్తించడం ద్వారా కేసులు నమోదు కాబడతాయని తెలియజేయాలని సూచించారు.

# రోడ్డు ట్రాఫిక్ సైన్ లపై అవగాహన ఉండాలి

## రోడ్డు భద్రతా నియమాలు పాటిస్తూ ప్రయాణం చేసి గమ్యస్థానాలకు సురక్షితంగా చేరుకోవాలి : ట్రాఫిక్ ఏసిపి నరసింహులు



గోదావరిఖని టౌన్ రిపోర్టర్– సురేష్,(శుభోదయం న్యూస్) రోడ్డు భద్రత మాసోత్సవాల సందర్భంగా రామగుండం పోలీస్ కమిషనర్ గారి ఆదేశాల మేరకు పెద్దపల్లి ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ అనిల్ కుమార్ ఆధ్వర్యంలో ఈరోజు పెద్దపల్లి పట్టణంలోని రైల్వే స్టేషన్ రోడ్ లో గల వ్యాన్ అసోసియేషన్ వారి కార్యాలయం ఆవరణలో ట్రాఫిక్ రూల్స్, ట్రాఫిక్ చిహ్నాంల, రోడ్ సేఫ్టీ పై అవగాహన కల్పించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ట్రాఫిక్ ఏసిపి జాడి నరసింహులు ముఖ్యఅతిథిగా హాజరై డ్రైవర్స్ తో మాట్లాడడం జరిగింది. సందర్భంగా ఏసిపి గారు మాట్లాడుతూ... గత సంవత్సరంలో నాలుగు లక్షల ప్రమాదాలు జరగగ అందులో 1,73 వేల పైచిలుకమంది ప్రాణాలు కోల్పోవడం జరిగిందన్నారు. అందులో ఎక్కువ శాతం యువతే ఉంటుందని చిన్నచిన్న తప్పిదల వల్ల ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. ఇట్టి ప్రభావం దేశ ఆర్థిక ప్రగతి నష్టం కలిగిస్తుంది అని అన్నారు. వ్యాన్ డ్రైవర్ వాహనం నడిపే సమయంలో రోడ్డుపై ఉన్న చిహ్నాలను గురించి అవగాహన కలిగి జాగ్రత్తగా గమనిస్తూ వాహనాల నడపాలని, వాహనాలను రహదారిపై ఆపినప్పుడు పూర్తిగా రోడ్డున దింపి ఆపాలని సూచించారు. అదేవిధంగా వ్యాన్లు రాత్రి వేళలో ప్రయాణం చేసినప్పుడు గాని పార్కింగ్ చేసినప్పుడు గాని ఆ మార్గంలో ప్రయాణం చేసే ఇతర వాహనాలకు వాహనం కనిపించే విధంగా వ్యాన్ ఇరుపక్కల వెనుక భాగంలో కూడా రేడియం స్టిక్కర్ను అంటించాలని, వాహనం ఏదైనా అత్యవసర పరిస్థితుల్లో ఆగిపోయి నట్లయితే వాహనం చుట్టూ జాగ్రత్తలు పాటిస్తూ ఇతర వాహనదారులకు ఇబ్బంది కలగకుండా సూచికలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. ద్విచక్ర వాహనం నడిపినప్పుడు తప్పనిసరిగా హెల్మెట్లు ధరించాలని ట్రాఫిక్ రూల్స్ పాటించాలని రోడ్డు భద్రతా నియమాలను పాటిస్తూ క్షేమంగా గమ్యస్థానాలకు చేరాలని డ్రైవర్లకి అవగాహన కల్పించడం జరిగింది.పెద్దపల్లి ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ అనిల్ కుమార్, పెద్దపల్లి, అసిస్టెంట్ మోటర్ వెహికల్ ఇన్స్పెక్టర్ మధు, ఎస్ ఐ సహదేవ్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

# భాదిత కుటుంబని పరామర్శించిన అధర్ష్ రెడ్డి







జిన్నారం, (శుభోదయం న్యూస్): సంగారెడ్డి జిల్లా జిన్నారం మండల పరిధిలో మధిర గ్రామం పెద్దమ్మ గూడెం లో ఆత్మ కమిటీ డైరెక్టర్ దుబ్బక మహేష్ గారి నాన్న గారు దుబ్బక యాదయ్య కొన్ని రోజుల క్రితం అనారోగ్యం తో మరణించడం జరిగింది. ఈ విషయం తెలుసుకున్న ఆదర్శ్ రెడ్డి వారి కుటుంబని పరామర్శించి అండగా ఉంటామని వారు తెలిపారు. ఈ కార్యక్రమం లో స్థానిక నాయకులు బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు జి వెంకటేశం గౌడ్ మండల అధ్యక్షుడు నాయి కోటి రాజేష్ సింహ రెడ్డి,మంద రమేష్,శ్రీనివాస్ గౌడ్, శ్రీనివాస్ యాదవ్, ఇదిగాని మల్లేష్,ఏలేశ్, బాలేష్ తదితరులు పాల్గొన్నారు.

# లారీ టాక్కర్ చేయగా ఒక్కరు మృతి



కామారెడ్డి జిల్లా ప్రతినిధి (శుభోదయం న్యూస్):-లింగంపేట మండలంలోని ముస్తాపూర్ తాండా వాసి మృతుడు ఐనా సభవత్ మోహన్ వయస్సు 29 సం నివాసం ముస్తపూర్ తండా తేది గురువారం నాడు సాయంత్రం 6:30 గంటలకి పశువులని తీసుకుని ఇంటికి వస్తుండగా ముస్తపూర్ గ్రామ శివారులో రోడ్ పక్క నుండి నడుచుకుంటూ వస్తుండగా కామారెడ్డి నుండి లింగంపేట్ వైపు వస్తున్నా %o12బు%4138 నెంబర్ గల లారీ డ్రైవర్ లారిని అతి వేగంగా అజగ్రత్తగా నడుపుతూ మోహన్ కి వెనుక నుండి టక్కర్ ఇవ్వగా కింద పడి లారీ క్రింద ఇరుక్క పోగా నడుము భాగంలో మరియు ఇతర చోట్ల బలమైన దెబ్బలు తగలగా వెంటనే 108 అంబులెన్సు ఆసుపత్రి కి తరలించగా చికిత్స పొందుతూ హైదరాబాద్ లో శుక్రవారం నాడు ఉదయం 05 గంటలకి చనిపోయినాడు. మృతుని తండ్రి దరఖాస్తు మేరకి కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభిస్తున్నామని ఎస్ఐ సుధాకర్ తెలిపారు.

# నూతన వస్త్రాలంకరణ వేడుకల్లో యువనేత సాయి కుమార్



రేగొండ మండలం, రిపోర్టర్ మంతెన సురేష్ (శుభోదయం న్యూస్) రేగొండ మండలం కేంద్రంలోనూతన వస్త్రాలంకరణ వేడుకల్లో బిఆర్ఎస్ పార్టీ యువజన నాయకులు సాంబారి సాయికుమార్ పాల్గొన్నారు. భూపాలపల్లి మండలంలోని పుల్లూరి రామయ్య పల్లి గ్రామానికి చెందిన బిఆర్ఎస్ పార్టీ నాయకులు, సాయికుమార్ వీరాభిమాని ఆకుల సతీశ్ కుమార్తె, నూతన వస్త్రాలంకరణ వేడుకలు శుక్రవారం మధ్యాహ్నం వారి నివాసంలో జరుపుకున్నారు. ఈ వేడుకల్లో తెరాస యువజన నాయకులు సాంబారి సాయి కుమార్ పాల్గొని చిన్నారినీ ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో సాంబారి సాయి కుమార్ వీరాభిమానులు , కార్యకర్తలు పాల్గొన్నారు..

# గుమ్మడిదలలో వాలీబాల్, కబడ్డీ క్రీడా పోటీలు విజయవంతం



గుమ్మడిదల (శుభోదయం న్యూస్):సి.జి.ఆర్. ట్రస్ట్ ఆధ్వర్యంలో గుమ్మడిదల మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో నిర్వహించిన ఓపెన్ టు ఆల్ వాలీబాల్, కబడ్డీ క్రీడా పోటీలు విజయవంతంగా ముగిశాయి. ఈ కార్యక్రమంలో క్రీడా అభిమానులు, యువత ఉత్సాహంగా పాల్గొన్నారు.క్రీడా పోటీలు విజయవంతంగా నిర్వహించిన సీనియర్ పిటీ అమ్మగారి విష్ణువర్ధన్ రెడ్డి, వాలీబాల్ అసోసియేషన్ సంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి అలుక కృష్ణ యాదవ్, సీనియర్ క్రీడాకారుడు పడమటి వెంకటరెడ్డి, మెదక్ జిల్లా వాలీబాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి రవీందర్ చారిలను సి.జి.ఆర్. ట్రస్ట్ చైర్మన్ చిమ్ముల గోవర్ధన్ రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా చైర్మన్ గోవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ, "క్రీడలు వ్యక్తుల మధ్య స్నేహభావాన్ని పెంపొందించడంతో పాటు మానసిక, శారీరక ఆరోగ్యంలో మెరుగుదలకు దోహదం చేస్తాయి. ఈ పోటీల విజయవంతం కోసం కృషి చేసిన సి.జి.ఆర్ ట్రస్ట్ సభ్యులు, యువసేన సభ్యులు, క్రీడాకారులకు నా ప్రత్యేక అభినందనలు" అని తెలిపారు. క్రీడా పోటీల్లో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ హృదయపూర్వక అభినందనలు తెలియజేస్తూ, మరిన్ని ఇలాంటి కార్యక్రమాలను నిర్వహించేందుకు సిద్ధంగా ఉంటామని ట్రస్ట్ సభ్యులు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పిటిసి కుమార్ గౌడ్, దేవేందర్ రెడ్డి, క్రీడాకారులు ఫిజిఆర్ ట్రస్ట్ సభ్యులు సిజిఆర్ యువసేన సభ్యులు పాల్గొన్నారు.

# ఏడుపాయల జాతర టెండర్లు ఖరారు



పాపన్నపేట, మండల రిపోర్టర్ రవి, (శుభోదయం న్యూస్):మెదక్ జిల్లా ఏడుపాయల వనదుర్గా క్షేత్రంలో 2025 మాఘ అమావాస్య,మహా శివరాత్రి జాతర నిర్వహణకు శుక్రవారం ఈఓ కార్యాలయంలో సీల్డ్ టెండర్లు నిర్వహించారు. 1).తడకల పందిర్లు వేయడానికి రూ. 2.34 లక్షలకు ఎన్.కవిత హక్కు పొందారు. 2).తాత్కాలిక



విద్యుత్ దీపాల ఏర్పాట్లు చేయుటకు రూ. 3.40 లక్షలకు టి.అశోక్ ఈ హక్కు పొందారని ఆలయ ఈఓ చంద్రశేఖర్ తెలిపారు.ఇందులో భాగంగా దేవాదాయ శాఖ ఇన్స్ పెక్టర్ రంగారావు,ఆలయ సిబ్బంది సూర్య శ్రీనివాస్,ప్రతాప్ రెడ్డి,శ్యామ్,తదితరులు ఉన్నారు.


# హెల్మెట్ లేకున్నా.. పెండింగ్ చలానాలు ఉన్న చర్యలు తప్పవు స్పెషల్ డ్రైవ్ లో ఎస్ఐ. అభిమన్యు

నందిగామ,(జిల్లా కమిషనర్ ఎస్ వి రాజశేఖర్ బాబు ఆదేశానుసారం ఏసిపి. జి తిలక్ సూచనమేర సి.ఐ వై. వి. నాయుడు ఆధ్వర్యంలో నందిగామ ఎస్.ఐ అభిమన్యు శుక్రవారం తమ సిబ్బందితో నందిగామ పోలీస్ స్టేషన్ వద్ద హెల్మెంట్ లేకుండా వాహనలు నడిపుతూన్న వారికి పైన్ లు మరియు పెండింగ్ చలనా రికవరీ కార్యక్రమం నిర్వహించారు. ఈ డ్రైవ్ లో హెల్మెట్ లేకుండా వాహనాలు నడిపుతూన్న వాహనదారులకు పైన్ లు. పలు వాహనాలను తనిఖీ చేసి పెండింగ్ చలానాలను రికవరీ చేశారు. ఈ స్పెషల్ డ్రైవ్ లో ఎస్ ఐ అభిమన్యు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ఆదేశాల మేరకు వాహనాలపై ఏమైనా చలానాలు పెండింగ్ పైన్ లు ఉన్న యెడల 90రోజులో పైన్ కట్టవలసిన వెబ్సైట్ ఇ చలాన్ పరివాహన్ గవర్నమెంట్. ఇన్ ద్వారానో, ఫోన్ పే ద్వారానో తక్షణమే చెల్లించాలని. అలా చెల్లించని వాహనాలను సీజ్ చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు

# ఘనంగా శ్రీరామ మాలాధారణ కార్యక్రమం

తుంగతుర్తి క్రాంతి కుమాం:సూర్యాపేట జిల్లా తుంగతుర్తి మండలం కరివిరాల గ్రామంలోనీ రామాలయంలో శుక్రవారం ఘనంగా శ్రీరామ మాలధారణ కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ప్రధాన పూజారి ఆమంచి అనంతరామ శర్మ కరివిరాల గ్రామానికి చెందిన మాలధారణ స్వాములకు మాలలు వేశారు. ఆలయ ప్రధాన అర్చకులు వాస్తు వెంకన్న ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.శ్రీరామ మాలాధారణ 23 రోజులు ఎంతో నిష్టగా మాలాధారణ స్వాములు పూజలు చేస్తారని పేర్కొన్నారు.

# భారీగా పతనమైన ఫారెక్స్ రిజర్వ్ నిల్వలు.. 625.871 బిలియన్ డాలర్లకు పరిమితం..!




ఈ నెల పదో తేదీతో ముగిసిన వారానికి ఫారెక్స్ రిజర్వు నిల్వలు 8.714 బిలియన్ డాలర్లు పతనమై 625.871 బిలియన్ డాలర్లకు పడిపోయాయని ఆర్బీఐ శుక్రవారం తెలిపింది. భారత్ ఫారెక్స్ రిజర్వ్ నిల్వలు భారీగా తగ్గాయి. ఈ నెల పదో తేదీతో ముగిసిన వారానికి ఫారెక్స్ రిజర్వు నిల్వలు 8.714 బిలియన్ డాలర్లు పతనమై 625.871 బిలియన్ డాలర్లకు పడిపోయాయని ఆర్బీఐ శుక్రవారం తెలిపింది. ఈ నెల మూడో తేదీతో ముగిసిన వారంలోనూ ఫారెక్స్ రిజర్వ్ నిల్వలు 5.693 బిలియన్ డాలర్లు పతనమై 634.585 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయని ఆర్బీఐ వెల్లడించింది. గత కొన్ని వారాలుగా ఫారెక్స్ రిజర్వ్ నిల్వలు తగ్గుతూ వస్తున్నయి. అంతర్జాతీయంగా ఫారెక్స్ మార్కెట్లో అనిశ్చితి నెలకొన్నప్పుడు రూపాయి విలువ పతనం కాకుండా ఆర్బీఐ బహిరంగ మార్కెట్లో డాలర్లు విక్రయిస్తున్నది. 2024 సెప్టెంబర్ నెలాఖరులో ఫారెక్స్ రిజర్వు నిల్వలు రూ.704.885 బిలియన్ డాలర్లతో జీవిత కాల గరిష్టాన్ని తాకాయి.ఈ నెల పదో తేదీతో ముగిసిన వారానికి ఫారిన్ కరెన్సీ అసెట్స్ 9.469 బిలియన్ డాలర్లు తగ్గిపోయి 536.011 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయని ఆర్బీఐ శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపింది. బంగారం రిజర్వు నిల్వలు 792 మిలియన్ డాలర్లు క్షీణించి 67.883 బిలియన్ డాలర్ల వద్ద స్థిర పడ్డాయి. స్పెషల్ డ్రాయింగ్ రైట్స్ (ఎస్డీఆర్ఎస్).. 33 మిలియన్ డాలర్లు పడిపోయి 17.781 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయి. అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థ (ఐఎంఎఫ్)లో భారత్ ఫారెక్స్ రిజర్వ్ నిల్వలు 4 మిలియన్ డాలర్లు పతనమై 4.195 బిలియన్ డాలర్లకు పరిమితం అయ్యాయని ఆర్బీఐ వెల్లడించింది.

## కర్ణాటకలో మరో బ్యాంక్ దోపిడీ.. రూ.15 కోట్ల ఆభరణాలు, రూ.5 లక్షల నగదు చోరీ



మంగుళూరు : కర్ణాటకలో మరో బ్యాంక్ దోపిడీ ఘటన చోటుచేసుకుంది. శుక్రవారం మధ్యాహ్నం ఉల్లాల్ సమీపంలోని కెసి రోడ్ బ్రాంచ్‌లో కోటేకర్ వ్యవసాయ సహకార బ్యాంక్‌పై పట్టపగలు ఆరుగురు సాయుధ దుండగులు దోపిడీకి పాల్పడ్డారు. బ్యాంక్ సిబ్బందిని తుపాకులతో బెదిరించి రూ.15 కోట్ల విలువైన బంగారు ఆభరణాలు, రూ.5లక్షల నగదును దోచుకువెళ్లినట్లు అధికారులు తెలిపారు. అనంతరం బూడిదరంగు ఫియట్ కారులో పరారయ్యారని అన్నారు. దుండగులు కత్తులు, తుపాకులతో బ్యాంకులోకి చొరబడ్డారని, సిబ్బందితో పాటు సిసిటివి టెక్నీషియన్‌ను బెదరించారని అన్నారు. సిబ్బందిలో ముగ్గురు మహిళలు ఉన్నారని చెప్పారు. దోపిడీకి ముందు దుండుగుల భవనం గ్రౌండ్‌ఫ్లోర్‌లోని బేకరీలో విద్యార్థులను అక్కడి నుండి వెళ్లాల్సిందిగా బెదిరించారని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. వారు తమలో తాము కన్నడలో మాట్లాడుకున్నారని, బ్యాంక్ సిబ్బందితో మాత్రం హిందీలో మాట్లాడారని అన్నారు. ఘటనా స్థలాన్ని కర్ణాటక అసెంబ్లీ స్పీకర్ యుటి ఖాదర్ సందర్శించారు. విచారణను వేగవంతం చేయాల్సిందిగా పోలీసులను ఆదేశించారు.కర్ణాటకలోని బీదర్‌లో గురువారం దోపిడీ దొంగలు భీభత్సం సృష్టించిన సంగతి తెలిసిందే. ఎటిఎంలో డబ్బులు పెట్టేందుకు వచ్చిన వాహనంపై దుండగులు కాల్పులు జరిపారు. ఈ ఘటనలో సెక్యూరిటీ గార్డు మరణించగా, ఇద్దరు సిబ్బందికి గాయాలయ్యాయి.

## అతిపెద్ద బ్యాటరీ స్టోరేజీ ప్లాంట్‌లో అగ్ని ప్రమాదం .. స్థానికుల తరలింపు



శాక్రమెంటో : కాలిఫోర్నియాలోని ప్రపంచంలోనే అతిపెద్ద బ్యాటరీ స్టోరేజీ ప్లాంట్ (మాస్ ల్యాండింగ్ టెస్లా బ్యాటరీ ఫ్యాక్టరీ )లో గురువారం మధ్యాహ్నం అగ్ని ప్రమాదం జరిగినట్లు అధికారులు తెలిపారు. ఉత్తర కాలిఫోర్నియాలోని జాతీయ రహదారి 1లో కొంత భాగాన్ని మూసివేశారు. వందలాది మందిని ఆప్రాంతాన్ని ఖాళీ చేయాల్సిందిగా ఆదేశాలు జారీ చేశారు. అగ్ని ప్రమాదం కారణంగా అన్ని పాఠశాలలు, కార్యాలయాలను శుక్రవారం మూసివేసినట్లు నార్త్ మాంటెరీ కౌంటీ యంత్రాంగం ప్రకటించింది. మంటలు అంతకంతకూ వ్యాపిస్తుండటంతో పాటు ఆప్రాంతమంతా నల్లని దట్టమైన పొగ కమ్మేసింది. గురువారం రాత్రికి కూడా మంటలు తగ్గే సూచనలు కనిపించకపోవడంతో మాస్ ల్యాండింగ్ (బ్యాటరీ స్టోరేజ్ ప్లాంట్ ప్రాంతం), ఎల్కోర్న్ స్లాఫ్‌లను చెందిన దాదాపు 1,500 మందిని ఖాళీ చేయాల్సిందిగా ఆదేశించినట్లు స్థానిక మీడియా వెల్లడించింది. శాన్‌ఫ్రాన్సిస్కోకు దక్షిణంగా 77 మైళ్ల దూరంలో ఉన్న మాస్ ల్యాండింగ్ పవర్‌ప్లాంట్ టెక్సాస్ కంపెనీ విస్ట్రా ఎనర్జీకి చెందినది. పదివేల లిథియం బ్యాటరీలను కలిగి ఉంది. సౌరశక్తి, పునరుత్పాదక వనరుల నుండి ఉత్పత్తి చేసే విద్యుత్‌ను ఈ బ్యాటరీల్లో నిల్వ చేస్తుంది. ఈ ఫ్యాక్టరీలో మంటలను ఆర్పేందుకు అగ్నిమాపక సిబ్బంది తీవ్రంగా కృషి చేస్తోందని, ఇది అతిపెద్ద విపత్తు అని మాంటెరీ కౌంటీ సూర్‌వైజర్ గ్లెన్‌చర్చ్ పేర్కొన్నారు. కాంక్రీట్ భవనంపైకి మంటలు వ్యాపిస్తాయని ఊహించలేదని అన్నారు. తాజా అగ్ని ప్రమాదానికి కారణాలు తెలియరాలేదని విస్ట్రా ప్రతినిధి జెన్నీ లియాన్ పేర్కొన్నారు. ప్రమాదాన్ని గుర్తించిన వెంటనే సిబ్బందిని సురక్షితంగా తరలించామని తెలిపారు. మంటలను అదుపు చేసిన అనంతరం విచారణకు ఆదేశిస్తామని పేర్కొన్నారు. కమ్యూనిటీ, సిబ్బంది భద్రతకు ప్రాధాన్యత నిచ్చామని అన్నారు. అత్యవసర సిబ్బంది అందిస్తున్న సహకారానికి కృతజ్ఞతలు తెలిపారు. ఫైర్ స్ప్రింకర్ల సిస్టమ్ పనిచేయకపోవడంతో 2021-2022లో విస్ట్రా ప్లాంట్‌లో మంటలు చెలరేగాయి. ఫలితంగా కొన్ని యూనిట్లు వేడెక్కాయని మెర్క్యురీ న్యూస్ మీడియా తెలిపింది.ం

## వ్యాధినిరోధక శక్తిపై దాడి, పెరగనున్న శ్వాస సంబంధ వ్యాధులు




లాస్‌ఏంజెల్స్ : గత కొన్నిరోజులుగా లాస్‌ఏంజెల్స్‌లోని పలు ప్రాంతాలను భస్మీపటలం చేసిన కార్చిచ్చు ప్రపంచ వ్యాప్తంగా ఆందోళన సృష్టించిన సంగతి తెలిసిందే. గృహాలు, ఇతర నిర్మాణాలను బూడిదగా మారుస్తూ పెద్ద ఎత్తున విధ్వంసం సృష్టించింది. కార్చిచ్చుతో ఇప్పటి వరకు 24 మంది మరణించారు. అయితే ఈ కార్చిచ్చు ప్రత్యక్షంగానే కాకుండా మానవ ఆరోగ్యంపై దీర్ఘకాలిక ప్రభావం చూపే అవకాశం ఉందని ఆరోగ్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. ప్రత్యేకించి, వ్యాధినిరోధక శక్తిపై దాడి చేయడమే కాకుండా శ్వాస సంబంధ వ్యాధులను, ఇన్ఫెక్షన్‌లను వ్యాప్తి చేస్తుందని తెలిపారు.

వ్యాధి నిరోధక శక్తిపై ప్రభావం

మంటలతో కాలిన గాయాలు, దట్టమైన పొగ ప్రాణాపాయాన్ని కలిగించే అవకాశం ఉంది. అయితే ఇవి రెండూ కూడా రోగనిరోధక వ్యవస్థలో తీవ్రమైన మరియు దీర్ఘకాలిక మార్పులకు కారణమవుతాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఇన్ఫెక్షన్ల బారిన పడే అవకాశం ఉందని తెలిపారు. కొన్ని గాయాలు హైపర్ ఇన్‌ఫ్లమేషన్‌కు దారితీస్తాయి. తీవ్రమైన గాయాలతో పోరాడిన వ్యక్తుల్లో న్యుమోనియా, ఇతర శ్వాసకోశ ఇన్ఫెక్షన్ల ప్రమాదాన్ని పెంచే అవకాశం ఉందని పరిశోధనలు హెచ్చరిస్తున్నాయి. దట్టమైన పొగ అస్థిరమైన కర్బన సమ్మేళనాలు, ఓజోన్, విషవాయువులు, సూక్ష్మజీవులను కలిగి ఉంటుంది. ఇవి శ్వాసకోశ ఇన్ఫెక్షన్లతో పాటు ఆస్తమాను కలిగించవచ్చని పరిశోధకులు హెచ్చరిస్తున్నారు. 2019-20లో ఆస్ట్రేలియాలో బ్లాక్ సమ్మర్ తర్వాత కరోనా వ్యాప్తికి అవకాశం అధికంగా ఉందని పరిశోధనలు వెల్లడించాయి. పొగ కారణంగా మానవుల్లో ఫంగల్ ఇన్ఫెక్షన్లపై శాస్త్రవేత్తలు పరిశోధనలను పరిశీలిస్తున్నారు. పొడి నేలల్లో ఉండే కొక్సిడియోయిడ్స్ ఇమ్మిటిస్, కోక్సిడియోయిడ్స్ పోసాడాసి వంటి బ్యాక్టీరియా దుమ్ము, పొగతో మానవుల్లోకి చేరే అవకాశం ఉంది. ఇవి జ్వరానికి, ఫ్లూ, ఊపిరితిత్తుల ఇన్ఫెక్షన్ కలిగిస్తాయి. కాలిఫోర్నియాలో వైల్డ్‌ల్యాండ్ అగ్నిమాపక సిబ్బందిపై జరిపిన ఓ అధ్యయనంలో వ్యాలీ ఫీవర్ ఇన్ఫెక్షన్లు ఎక్కువగా ఉన్నట్లు తేలింది.

## స్పేడెక్స్ అనుసంధానం విజయవంతం : ఇస్రో




న్యూఢిల్లీ : స్పేడెక్స్ డాకింగ్ ప్రయోగం విజయవంతమైనట్లు భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) ప్రకటించింది. అమెరికా, రష్యా, చైనా తర్వాత ఈ చారిత్రాత్మక ప్రయోగాన్ని చేపట్టిన నాలుగో దేశంగా భారత్ నిలిచింది. డిసెంబర్ 30న పిఎస్ఎల్‌వి సి60 ద్వారా ప్రయోగించిన రెండు ఉపగ్రహాలు ఎస్‌డిఎక్స్ 01 (ఛేజర్), ఎస్‌డిఎక్స్ 02 (టార్గెట్)లను ఇస్రో టెలిమెట్రీలోని మిషన్ ఆపరేషన్స్ కాంప్లెక్స్ (ఎంఒఎక్స్) నుండి అంతరిక్షంలోకి అనుసంధానం చేసినట్లు ఇస్రో ప్రకటించింది. క్లిష్టతరమైన డాకింగ్ విధానాన్ని ఇస్రో టెలిమెట్రీ, ట్రాకింగ్, కమాండ్ నెట్‌వర్క్ (ఐఎస్‌టిఆర్‌ఎసి) పర్యవేక్షించిందని తెలిపింది. అంతరిక్ష నౌక డాకింగ్ పూర్తయిందని, ఇదో చారిత్రాత్మక క్షణమని ఇస్రో సోషల్ మీడియా ఎక్స్‌లో పేర్కొంది. చంద్రునిపైకి భారతీయ వ్యోమగామిని పంపడం, చంద్రుని నుండి నమూనాలను భూమిపైకి తీసుకురావడం, భారతీయ అంతరిక్ష కేంద్రం నిర్వహణకు ఈ సాంకేతికత అవసరమని తెలిపింది.

# గాజాలో శాంతి సాధ్యమేనా!



బాంబుల మోత ఆగుతుందంటే... తుపాకులు మౌనం పాటిస్తాయంటే... క్షిపణుల జాడ కనబడదంటే... ఇనుప డేగల గర్జనలు వినబడవంటే... నిత్యం మృత్యువు వికటాట్టహాసం చేస్తున్నచోట హర్షాతిరేకాలు వ్యక్తం కావటం సహజమే. అందుకే 15 నెలలుపైగా... అంటే 467 రోజులుగా రాత్రింబగళ్లు ప్రాణభయంతో కంటి మీద కునుకు లేకుండా గడిపిన గాజా ప్రజానీకం వీధుల్లోకొచ్చి పండుగ చేసుకున్నారు. అటు హమాస్ చెరలో మగ్గుతున్నవారి కుటుంబసభ్యులు సైతం ఆనందోత్సాహాలతో ఉన్నారు. ఇజ్రాయెల్-మిలిటెంట్ సంస్థ హమాస్‌ల మధ్య కాల్పుల విరమణ ఒప్పందం కుదిరిందని మధ్యవర్తులుగా వ్యవహరించిన అమెరికా, ఖతార్ ప్రతినిధులు బుధవారం రాత్రి ప్రకటించగానే ప్రపంచం, ప్రత్యేకించి పశ్చిమాసియా ఊపిరి పీల్చుకున్నాయి. 'నేను దేశాధ్యక్షపదవి స్వీకరించబోయే జనవరి 20 నాటికి బందీలకు స్వేచ్ఛ లభించకపోతే సర్వనాశనం ఖాయమ'ని అమెరికాకు కాబోయే అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ పక్షం రోజుల నాడు ప్రకటించారు. 'నా హెచ్చరిక ఫలించబట్టే కాల్పుల విరమణ ఒప్పందం సాకారమైంద'ని ఇప్పుడు ఆయన అంటుంటే... 'నా అనుభవంలోనే అత్యంత కఠినమైన ఈ చర్చల ప్రక్రియను మొత్తానికి సుఖాంతం చేయగలిగాన'ని ప్రస్తుత అధ్య క్షుడు జో బైడెన్ చెబుతున్నారు. ఈ ఘనత ఎవరి ఖాతాలో పడాలన్నది తేలకముందే ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహూ మొండికేస్తున్నారు. తొలుత ఒప్పందాన్ని స్వాగతించిన ఆయనే ఇంకా తేలాల్సినవి ఉన్నాయంటున్నారు. ఒప్పందంపై ఆమోదముద్ర వేసేందుకు నిర్వహించాల్సిన కేబినెట్ సమావేశాన్ని నిలిపివేశారు. ఈలోగా నిన్న, ఇవాళ గాజాపై ఇజ్రాయెల్ సాగించిన బాంబు దాడుల్లో 19మంది పిల్లలు సహా 80 మంది చనిపోయారు. కాల్పుల విరమణ ఒప్పందం అమలవుతుందా లేదా, ఈ ప్రాంతంలో తాత్కాలికంగానైనా శాంతి నెలకొంటుందా అన్న అంశంలో సందిగ్ధత ఏర్పడింది. సుదీర్ఘకాలం ఘర్షణలతో అట్టుడికినచోట సాధారణ పరిస్థితులు ఏర్పడటం అంత సులభమేమీ కాదు. అందునా ఇజ్రాయెల్‌తో వైరమంటే మామూలుగా ఉండదు. ఇజ్రాయెల్ భూభాగంలోకి హమాస్ మిలిటెంట్లు చొరబడి 2023 అక్టోబర్ 7న విచ్చలవిడిగా కాల్పులు జరిపి 1,200 మంది పౌరులను హతమార్చటంతో పాటు, 251 మందిని బందీలుగా తీసు కెళ్లటంతో ఇదంతా మొదలైంది. హమాస్ మతిమాలిన చర్య తర్వాత ఇజ్రాయెల్ క్షిపణులు, బాంబులతో గాజా, వెస్ట్‌బ్యాంక్‌లపై సాగించిన దాడుల పర్యవసానంగా ఇంతవరకూ కొందరు హమాస్ కీలకనేతలతో పాటు 46,700 మంది పౌరులు చనిపోయారు. ఇందులో అత్యధికులు పిల్లలు, మహి ళలే. ఇతరులు నిత్యం చావుబతుకుల మధ్య రోజులు వెళ్లదీస్తున్నారు. ఇజ్రాయెల్ సైన్యం జారవిడిచే కరపత్రాలు సూచించిన విధంగా ఎటు పొమ్మంటే అటు వలసపోతూ అష్టకష్టాలు పడుతున్నారు. తిండీ, నీళ్లూ కరువై, అంతంతమాత్రం వైద్య సదుపాయాలతో జీవచ్ఛవాల్లా బతుకుతున్నారు. ఒక్కోటి 42 రోజులు (ఆరు వారాలు)ఉండే మూడు దశల కాల్పుల విరమణ ఒప్పందం సజావుగా అమలవుతుందా, మధ్యలో తలెత్తగల సమస్యలేమిటి అన్న ప్రశ్నలకు ఎవరి దగ్గరా సమాధానాల్లేవు. హమాస్ చెరలో ఇంకా 94 మంది బందీలు మిగిలారని, వారిలో 34మంది మరణించివుండొచ్చని ఇజ్రాయెల్ అంచనా. తొలి దశ అమల్లోవుండగా గాజా స్ట్రిప్ నుంచి ఇజ్రాయెల్ దళాలు వైదొలగాలి. ఆ తర్వాత పాలస్తీనా ఖైదీల విడుదలకు బదులుగా 33 మంది బందీలను హమాస్ విడుదల చేస్తుంది. ఒకసారంటూ ఒప్పందం అమలు మొదలైతే ఇరువైపులా ఉన్న బందీలను దశలవారీగా విడుదల చేస్తారు. గాజాకు భారీయెత్తున సాయం అందటం ప్రారంభమవుతుంది. ఒప్పందం ప్రకారం తొలి దశ కొనసాగుతున్న దశలోనే ఇజ్రాయెల్ రెండోదశ కోసం హమాస్‌తో చర్చించటం మొదలెట్టాలి. రెండో దశకల్లా బందీలతోపాటు దాడుల సందర్భంగా హమాస్‌కు చిక్కిన ఇజ్రాయెల్ ఆడ, మగ సైనికులు పూర్తిగా విడుదలవుతారన్నది అంచనా. అప్పుడు మొదలుకొని తొలి దశలో వున్న తాత్కాలిక కాల్పుల విరమణ ఒప్పందం శాశ్వత కాల్పుల విరమణగా మారుతుంది. మూడో దశ అంతా పునర్నిర్మాణంపై కేంద్రీకరిస్తారు. హమాస్ బందీలుగా ఉంటూ మరణించినవారి మృత దేహాలను అప్పగించాలి. కేవలం మొదటి దశకు మాత్రమే ప్రస్తుత ఒప్పందం పరిమితమనీ... కొత్తగా చర్చలు జరిగాకే రెండు, మూడు దశలకు సంబంధించి తుది నిర్ణయం ఉంటుందనీ ఇప్పటికే నెతన్యాహూ ప్రకటించారు. తొలి దశ పూర్తయ్యాక మళ్లీ యుద్ధం తప్పదన్న హామీ ఇవ్వకపోతే తమ ఆరుగురు మంత్రులూ తప్పుకుంటారని తీవ్ర మితవాదపక్ష నాయకుడు, జాతీయ భద్రతా మంత్రి బెన్‌గివర్ హెచ్చరించటం తీసిపారేయదగ్గది కాదు. లెబనాన్‌లోని హిజ్బొల్లాతో ఉన్న రెండు నెలల కాల్పుల విరమణ ఒప్పందం ప్రస్తుతం అంతంతమాత్రంగానే ఉంది. అక్కడ ఇరువైపులా కాల్పులు జరగని రోజంటూ లేదు. ఆ ఒప్పందం కూడా ఈనెల 26తో ముగుస్తుంది. ఇప్పుడు హమాస్‌తో కుదిరిన ఒప్పందం గతి కూడా అలాగే ఉంటుందా అన్నది ప్రశ్నార్థకం. సిరియాలో అసద్ నిష్క్రమణ, ఉక్రెయిన్ యుద్ధంలో రష్యా నిమగ్నమైవుండటం, ఇరాన్ బల హీనపడటం, ట్రంప్ ఆగమనం వంటి పరిణామాలతో హమాస్‌లో పునరాలోచన మొదలయ్యాకే ఈ ఒప్పందానికి అంగీకరించింది. ఎనిమిదినెలల నాడు దాదాపు ఇవే షరతులు ప్రతిపాదిస్తే ఆ సంస్థ తిరస్కరించటం గమనార్హం. మొత్తానికి పశ్చిమాసియా తెరిపిన పడటానికి అన్ని పక్షాలూ చిత్తశుద్ధి ప్రదర్శించటం అవసరం. దాడులతో ఎవరినీ అణిచేయలేమని ఇన్నాళ్ల చేదు అనుభవాల తర్వాతైనా ఇజ్రాయెల్ గుర్తిస్తే మంచిది. ఎన్ని లోటుపాట్లున్నా ఘర్షణలు అంతరించాలి. శాంతి చిగురించాలి.

# హుకుంనామా!



మరెవరిదో కాదు.. పైన తాళ్లులాగే వారిదే! మనకి కనపడే వారంతా "కేతిగాళ్లు.. బంగారక్కలే..!" మరీ ముఖ్యంగా 1990ల తర్వాత ప్రపంచ బ్యాంకు విధానాలు మెల్లిగా పాతుకోవడం మొదలైంది. ఆ తర్వాత దేశమంతా ఈ తోలు బొమ్మలాట క్యారెక్టర్లే తైతక్కలాడుతున్నాయి. వెనక తాళ్లు లాగే ప్రపంచబ్యాంకు సూత్రధారులు అస్సలు కనపడరు. పాలకులను, వారి హావభావాలను, డైలాగులను బట్టి, పార్టీల రంగులను బట్టి చూస్తే తప్ప విధానాల లోతుపాతులు అర్థంకావు. 1990ల్లో అటు బహుళజాతి గుత్త సంస్థలు, ఇటు ఐఎంఎఫ్ ప్రపంచబ్యాంకు వంటి అంతర్జాతీయ మదుపు సంస్థలు అన్ని మూడవ ప్రపంచ దేశాల్లోని విద్యుత్ సంక్షోభాలకు ప్రధాన కారణం, అవసరమైనంత భారీ థర్మల్ కేంద్రాలు లేకపోవడమేననీ, దానికి చాలినంత బొగ్గు, గ్యాసు దిగుమతి చేసుకునైనా సరే అర్జంటుగా థర్మల్ కేంద్రాలు స్థాపించాలన్నాయి. ఇకనేం?! ఎన్రాన్ అలా వచ్చి, మహారాష్ట్ర స్టేట్ ఎలక్ట్రిసిటి బోర్డు (ఎంఎస్‌ఈబీ) ని ఇలా ముంచిపోయింది. పాత కథంతా ఇప్పుడెందుకనుకుంటున్నారేమో?! దేనికైనా గతించిన చరిత్ర తెల్సుకోకపోతే వర్తమానం అర్థంకాదు. భవిష్యత్ డోలాయామానంలో ఉంటుంది. ముఖ్యంగా విద్యుత్‌కు సంబంధించి ప్రస్తుత పాలకుల కార్యాచరణ అర్థం కావాలంటే పాత నేపథ్యం కొంత అర్థమై ఉండాలి. తాజాగా రేవంత్‌రెడ్డి ప్రభుత్వం "గ్రీన్ ఎనర్జీ"అనే పాట పాడింది. ఆశ్చర్యమేమంటే ఇదే పాట అమరావతిలోనూ ప్రతిధ్వనించింది. అక్కడితో ఆగితే ఫరవాలేదు. మోడీ మహాశయుని పుణ్యాన దేశమంతా మారుమోగుతోంది. బహుశా నిన్న పత్రికల్లేవు గాని, ఉండుంటే పతాక శీర్షికలెక్కాల్సిన వార్త "తెలంగాణ ప్రజలకి కరెంటు చార్జీలు పెంచట్లేదనే 'శుభవార్త'ట! వార్త కరెక్టే గాని దీంట్లో శుభం ఎంతో, అశుభం ఎంతో రాష్ట్ర ప్రజలకి తెలియాలి. ఎప్పటికప్పుడు పారదర్శకంగా ప్రజలకి చార్జీల మోత అర్థం కావాల్సిందిపోయి రెగ్యులేటరీ కమిషన్లు ప్రభుత్వాల చేతిలో కీలుబొమ్మలైనాయి. అందుకనే బీఆర్ఎస్ సుమారు రూ. 16వేల కోట్లకు పైబడే మొత్తాన్ని ఎప్పటికప్పుడు వాయిదాలు వేసుకుంటూ చివరికి పైసా చెల్లించకుండానే దాటిపోయింది. దాన్ని రేవంత్ ప్రభుత్వం తమ భుజాల మీదేసుకుంది. ఆ మేరకు మంచిదే. చివరికి 2025-26 ఏడాదికి సంబంధించింది కూడా ప్రభుత్వం మీదేసుకుంది. అదేనట శుభవార్త. ఇక్కడ అసలు విషయమేమిటంటే 2000 సంఎలో జరిగిన విద్యుత్ చార్జీల వ్యతిరేక ఉద్యమంతో ఈ పాతికేండ్లలో వచ్చిన ఏ పార్టీ, ఏ ప్రభుత్వమూ విద్యుత్ చార్జీలు పెంచే ధైర్యం చేయలేకపోతోంది. చివరికి విద్యుత్ సంస్థలు వేల కోట్ల రూ.లు 'ట్రూ-అప్' చార్జీలు పేర పేరబెట్టి ఈఆర్సీ ముందుకుపోయినా ప్రభుత్వాలు సాహసించలేకపోతున్నాయి. ఇప్పుడు తాజాగా రాష్ట్రం ప్రకటించిన గ్రీన్ ఎనర్జీ పాలసీ (7.6)లో వ్యవసాయ భూముల్లో సోలార్ ప్లాంట్‌లు పెడితే దాన్ని నాలుగెకరాల వరకు వ్యవసాయేతర భూమిగా 'డీమ్డ్ కన్వర్షన్' స్టేటస్ ఇస్తారు. ఒక రకంగా నయా భూస్వాముల తయారీకి ఇది పెద్దమార్గం కానుంది. ప్రభుత్వ పెద్దల వ్యవహారం చూస్తే అరచేతిలో పెట్టి మోచేతి దాకానో, వీలైతే ఇంకా ఆ పైకో నాకించేలా ఉన్నారు. తెలంగాణ రాష్ట్రంలో 2024-25లో గరిష్ట డిమాండు 15,623 మె.వా. ఉందట. అది మరో పదేండ్లకు 31,809 మె.వా. పెరుగుతుందట. ఎలానో తెలుసా? మెట్రో రైలు విస్తరణ, ఫ్యూచర్ సిటీ, ఎ.ఐ. సిటీ, ఫార్మాసిటీ, రీజినల్ రింగ్ రోడ్, పారిశ్రామిక కారిడార్ తదితర అభివృద్ధి పనుల వల్లనట! సామెతలు చెబితే పెద్దలు నొచ్చుకోవచ్చు. ఆలీ లేదు.. చూలూ లేదు పుట్టబోయే కొడుకు పేరు సోమలింగమట?! మొన్న ఫార్మాసిటీ అంటేనే నానా యాగీ జరిగింది. అబ్బే! అది ఫార్మాసిటీ కాదు, దాని పేరు ఇండిస్ట్రియల్ కారిడార్ అన్నారు. అయితే, గియితే సోమలింగమే పుడితే పందేరం రెడీ చేశారు. ఫ్లోటింగ్ సోలార్ ప్లాంట్‌లట, విండ్ పవర్ ప్లాంట్లట, గ్రీన్ హైడ్రోజనట, హైబ్రిడ్ ప్రాజెక్టులట! పంచరంగుల చిత్రాలు 70 ఎమ్.ఎమ్.లో చూపుతున్నారు. ముందస్తు ప్రణాళికలు మంచివే! కానీ అవి ఎవరి ప్రయోజనాలను కాస్తున్నాయో జనానికి అర్థం కావాలిగా?!!

# ఇంతన్నాడంతన్నాడే ట్రంప్!



'అధికారానికి వచ్చిన 24గంటల్లోనే ఉక్రెయిన్ సమస్యను పరిష్కరిస్తా'నన్నాడు డోనాల్డ్ ట్రంప్, కావాలంటే దానికంటే ముందే కూడా చేస్తానని కూడా సెలవిచ్చాడు. ఒక్కరోజులో కాదులే గానీ కనీసం వందరోజులు పడుతుందన్నాడు ఉక్రెయిన్ రాయబారిగా ట్రంప్ ఎంచుకున్న కెయిత్ కెలోగ్. వంద రోజులా? చెప్పటానికి బాగానే ఉంటుంది గానీ, అంత తేలిగ్గా ఎలా కుదురుతుంది? కొన్ని నెలలు, అంతకంటే ఎక్కువ కాలమే పట్టవచ్చునని ట్రంప్ సలహాదారులు చెప్పినట్లు రాయిటర్స్ తాజా కథనం.ఈ తీరు చూసినపుడు 'ఇంతన్నాడంతన్నాడే గంగరాజు నన్నొగ్గేసెల్పోనాడే గంగరాజు' అన్నట్టుగా ఉక్రెయిన్ పరిస్థితి తయారైనట్లు కనిపిస్తోంది. ఎన్నికలకు ముందు ఎన్నో కబుర్లు వల్లించిన పెద్దమనిషి నోట ఫలితాలు వెలువడిన మరుసటి రోజు నుంచే మాటలో తేడా వచ్చింది. అప్పు రేపు అని గోడమీద రాసినట్లుగా " పరిష్కరిస్తా" అని మాత్రమే మాట్లాడుతున్నాడు. గాజాలో దాడులకు స్వస్తి పలకటం కంటే ఉక్రెయిన్ పోరు ముగించటం కష్టంగా కనిపిస్తోందని ఒక సందర్భంగా చెప్పాడు. ఎప్పటికెయ్యది అప్పటికా మాటలాడి తప్పించుకు తిరుగువాడు ట్రంప్.పైకి ఎన్ని బింకాలను ప్రదర్శించినా ఏదో విధంగా రాజీచేసి పరువు దక్కించమని పశ్చిమ దేశాలను జెలెన్‌స్కీ వేడుకుంటున్నాడన్నది స్పష్టం. ఉక్రెయిన్ మీద రష్యా ప్రారంభించిన సైనిక చర్య గురువారం నాడు 1,057వ రోజులోకి ప్రవేశించింది. ం

బుధవారం నాడు రష్యా ప్రయోగించిన 40 క్షిపణులు, 70డ్రోన్ దాడులతో ఉక్రెయిన్ గ్యాస్ మౌలిక సదుపాయాలతో సహా విద్యుత్ సర ఫరా వ్యవస్థ చిన్నాభిన్నమైందని వార్తలు. అయితే ముందు జాగ్రత్త చర్యగా తామే అనేక ప్రాంతాల్లో కోతలు విధించినట్లు జెలెన్‌స్కీ యంత్రాంగం చెప్పుకుంది. తమ భద్రతకు పనామా కాలువను, గ్రీన్‌లాండ్ ప్రాంతాన్ని అప్పగించాలని, కెనడాను విలీనం చేయాలని డోనాల్డ్ ట్రంప్ చేసిన ప్రకటనను రష్యా తనకు అనువుగా మలుచుకొంటోంది. రాజీ కుదిరితే స్వాధీనం చేసుకున్న ఉక్రెయిన్ ప్రాంతాలను అప్పగిస్తారా? అన్న ప్రశ్నకు అసలు దాని గురించి చర్చలకు కూడా ఆస్కారం లేదని పుతిన్ సహాయకుడు నికోలారు పత్రుషెవ్ కుండబద్దలు కొట్టినట్లు చెప్పాడు. ట్రంప్ కొన్ని ప్రాంతాలు కావాలని కోరుకుంటున్నట్లే తమకూ ఉక్రెయిన్లో కొంత ప్రాంతం అవసరమే కదా అన్నట్లుగా పోలిక తెచ్చాడు. తమ దేశ భద్రతకు హామీగా నాటోలో ఉక్రెయిన్‌ను చేర్చుకో కూడదన్న వినతిని పెడచెవిన పెట్టిన తరువాతే రష్యా 2022 ఫిబ్రవరి 24 నుంచి మిలిటరీ చర్య జరుపుతున్నది. ట్రంప్ ప్రకటన తరువాత దానికి మరింత బలం చేకూరుతున్నది. అమెరికా తన అవసరాలకు అనుగుణంగా ప్రపంచ పటాన్ని తిరిగి గీస్తున్నది, అందులో భాగంగానే అనేక దేశాల వ్యవహారాల్లో జోక్యం చేసుకుంటున్నదని పత్రుషెవ్ చెప్పాడు.ఉక్రెయిన్, ఐరోపా యూనియన్‌తో నిమిత్తం లేకుండా ముందుగా అమెరికా-రష్యాలు ఒక ఒప్పందానికి రావాలని అన్నాడు.చర్చలకు ప్రత్యేక పరిస్థితులేమీ అవసరం లేదని పుతిన్ ప్రతినిధి పెష్కోవ్ చెప్పాడు.దీని అర్థం సైనిక చర్యను తాత్కాలికంగా కూడా నిలిపివేసేది లేదని చెప్పటమే. డోనాల్డ్ ట్రంప్ ఒక రాజకీయవేత్తగా ఓట్ల కోసం లేదా స్వభావసిద్ధంగానే వదరుబోతు కావచ్చు,కానీ అమెరికా పాలకవర్గ ప్రయోజనాలకు అనుగుణంగానే అంతిమంగా వ్యవహరిస్తాడు. 'నువ్వొకందుకు పోస్తే నేనొకందుకు తాగా' అన్నట్లుగా పుతిన్ ఉన్నాడు. ట్రంప్‌తో చర్చలకు తాము సముఖమే గానీ ఆయన సలహాదారులు ముందుకు తెచ్చిన ప్రతిపాదనలు కొన్ని కుదిరేవి కాదని రష్యా చెబుతున్నది. సంక్షోభ ముగింపు కొన్ని నెలలు పట్టవచ్చున్న సలహాదారుల వ్యాఖ్యలపై మాస్కో మౌనం పాటించింది. యుద్ధం కొనసాగిన కొద్దీ ప్రజల సొమ్ము ఖర్చు చేయాల్సి వస్తోందనే మనో భావాలను ట్రంప్ రెచ్చగొట్టవచ్చు, దాని వలలో కొందరు పడవచ్చు గానీ సంక్షోభం ఎంత దీర్ఘకాలం కొనసాగితే అమెరికా ఆయుధ పరిశ్రమలకు లాభాలు, కొంత మందికి ఉపాధి, రష్యా ఇంధన మార్కెట్‌ను అమెరికా కంపెనీలు ఆక్రమించి లాభాలు పిండుకుంటాయి. అందుకనే ఏదో ఒకసాకు చూపి ట్రంప్ కూడా జో బైడెన్ బూట్లలో కాళ్లు దూర్చి నడిచేందుకే చూస్తాడు. ఐరోపాలోని అగ్రరాజ్యాలకు రష్యా బలహీనం కావటం అవసరం. అందుకే ఈ సంక్షోభం ఇప్పట్లో ముగిసేది కాదని భావిస్తున్నారు.నాటో కూటమి దేశాల ఉద్దేశ్యాలను గ్రహించి కావచ్చు, తొలి రోజుల మాదిరి రష్యా ఇప్పుడు దూకుడుగా ముందుకు పోవటం లేదు, నిదానంగా అడుగులు వేస్తున్నది. అమెరికా, ఇతర పశ్చిమ దేశాల చెలగాటం మనవంటి తృతీయ ప్రపంచ సమాజాలకు ప్రాణసంకటంగా మారుతోంది.

## ఇమ్రాన్‌ఖాన్‌కు 14 ఏళ్ల జైలు శిక్ష



ఇస్లామాబాద్ : భూ అవినీతి కేసులో పాకిస్థాన్ మాజీ ప్రధాని ఇమ్రాన్‌ఖాన్‌కు 14 ఏళ్ల జైలు శిక్ష ఖరారైంది. అల్-ఖాదిర్ ట్రస్ట్‌కు సంబంధించిన భూ అవినీతికేసులో స్థానిక కోర్టు శుక్రవారం ఈ శిక్ష విధించింది. ఇదేకేసులో ఆయన భార్య బుష్రా బీబీకి ఏడేళ్ల జైలు శిక్ష విధిస్తున్నట్లు స్థానిక కోర్టు తెలిపింది. పలు కారణాల రీత్యా మూడుసార్లు తీర్పు వాయిదా పడింది. జనవరి 13న అవినీతి నిరోధక కోర్టు జడ్జి నాసిర్ జావేద్ తీర్పు వెల్లడించారు. అత్యంత కట్టుదిట్టమైన భద్రత మధ్య ఆదిలా జైలులో ఏర్పాటు చేసిన తాత్కాలిక కోర్టులో ఈ తీర్పును జడ్జి ప్రకటించారు. ఇమ్రాన్ ఖాన్ ఎదుర్కొంటున్న ఆర్థిక అవతవకల ఆరోపణల్లో ఇది అతిపెద్ద కేసు. రావల్పిండిలోని గార్రిసన్ సిటీలోని జైలులో అక్రమాస్తుల నిరోధక న్యాయస్థానం ఈ కేసులో తీర్పునిచ్చింది. 2023 ఆగస్ట్ నుండి ఖాన్ ఇదే జైలులో ఉన్నారు. 2023 డిసెంబర్‌లో ఇమ్రాన్‌ఖాన్, ఆయన భార్య బుష్రా బీబీ సహా మరో ఆరుగురిపై నేషనల్ అకౌంటబిలిటీ బ్యూరో (ఎన్ఎబి) కేసు నమోదు చేసింది. రియల్ఎస్టేట్ వ్యాపారి మాలిక్ రియాజ్ హుస్సేన్‌తో ఒప్పందంలో భాగంగా బ్రిటన్ నేషనల్ క్రైమ్ ఏజన్సీ పాకిస్థాన్‌కు పంపిన 190 మిలియన్ పౌండ్ల (240 మిలియన్ డాలర్లు) మొత్తాన్ని దుర్వినియోగం చేయడంతో పాటు ప్రజలకు నష్టం కలిగించారని ఆరోపించింది. ఇమ్రాన్‌ఖాన్ అధికారంలో ఉన్నప్పుడు మనీలాండరింగ్‌లో నగదుకు బదులుగా అతని నుండి యూనివర్శిటీ కోసం భూమిని బహుమతిగా స్వీకరించినట్లు ఆరోపించింది. అలాగే సుప్రీంకోర్టు గతంలో రియాజ్‌హుసేన్‌కు విధించిన జరిమానాలో కొంత మొత్తాన్ని ఆ నగదులో నుంచి కట్టడానికి అనుమతించారని పేర్కొంది. అయితే ఈ కేసులో మిగిలిన నిందితులందరూ దేశం వెలుపల ఉండంతో ఖాన్, బుష్రా బీబీలపై మాత్రమే విచారణను ఎదుర్కొన్నారు. ఈ ఆరోపణలను ఇమ్రాన్ ఖాన్ ఖండించారు. ఇవి రాజకీయ ప్రేరేపితం, తనను అధికారం నుండి దూరంగా ఉంచేందుకు ప్రతిపక్షాలు చేస్తోన్న కుట్ర అని అన్నారు.

## అమిత్ షా పర్యటనను వ్యతిరేకిస్తూ ఈనెల 19న రాష్ట్రవ్యాప్త నిరసనలు



విజయవాడ : అంబేద్కర్ పై వ్యాఖ్యలను నిరసిస్తూ అమిత్‌షా పర్యటనను వ్యతిరేకించాలని, ఈనెల 19న రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టనున్న నిరసనలను జయప్రదం చేయాలని వామపక్ష పార్టీలు పిలుపునిచ్చాయి. దీనికి సంబంధించిన ఓ ప్రకటనను శుక్రవారం వామపక్ష పార్టీల నేతలు విడుదల చేశారు. భారత రాజ్యాంగ రూపకర్త డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్‌పై రాజ్యసభలో అవమానకరమైన, అప్రతిష్ఠాకరమైన వ్యాఖ్యలు చేసిన కేంద్ర హెూం మంత్రి అమిత్‌షా విజయవాడ పర్యటన వ్యతిరేకిస్తూ జనవరి 19న రాష్ట్ర వ్యాపితంగా నిరసనలకు వామపక్ష పార్టీలు పిలుపునిస్తున్నాయన్నారు. అంబేద్కర్‌ను అభిమానించేవారిని ఎగతాళి చేస్తూ, అంబేద్కర్ జపం చేయడం ఫ్యాషన్‌గా మారిందనీ, ఆ జపం ఏదో దేవుడిని తలుచుకుంటే స్వర్గమన్నా వచ్చేదంటూ అత్యంత అభ్యంతరకరమైన అమిత్ షా వ్యాఖ్యలపై దేశ వ్యాపితంగా ఆగ్రహావేశాలు పెల్లుబికినా, నిరసనలు వెల్లువెత్తినా కేంద్ర బిజెపి వైఖరిలో మార్పులేదని ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. అన్ని తరగతుల, వర్గాల ప్రజానీకం, సామాజిక, ప్రజాసంఘాలు బిజెపి కేంద్ర ప్రభుత్వ వైఖరిని ఎండగట్టాలని కోరారు. ఈనెల 19న చేపట్టనున్న నిరసనకు ప్రజలు తమ మద్దతునిచ్చి పాల్గొనాలని, జయప్రదం చేయాలని వామపక్ష నేతలు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ(యం) రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, సిపిఐ(యంఎల్) న్యూడెమోక్రసీ నాయకులు వై.సాంబశివరావు, సిపిఐ(యంఎల్) నేత జాస్తి కిషోర్‌బాబు, యంసిపిఐ(యు) నాయకులు కాటం నాగభూషణం, సిపిఐ(యంఎల్) లిబరేషన్ నేత యన్.మూర్తి, ఫార్వర్డ్‌బ్లాక్ లీడర్ పి.వి.సుందరరామరాజు, రివల్యూషనరీ సోషలిస్టు పార్టీ నేత జానకి రాములు పాల్గొన్నారు.

## కీలక నిర్ణయాలు తీసుకున్న ఏపీ కేబినెట్



అమరావతి : ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన జరుగుతోన్న ఆంధ్రప్రదేశ్ కేబినెట్ సమావేశంలో పలు కీలక నిర్ణయాలకు ఆమోదం లభించింది. ధాన్యం కొనుగోలు కోసం 700 కోట్ల రూపాయల రుణం తీసుకునేందుకు ఏపీ మార్క్‌ఫెడ్‌కు ప్రభుత్వ హామీ ప్రతిపాదనపై కేబినెట్ అనుమతి ఇచ్చింది. గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగవ్యవస్థపై చర్చించనుంది. ఇక, 62 నియోజకవర్గాల్లో అన్న క్యాంటీన్ల ఏర్పాటుకు సంబంధించి నిర్ణయం కేబినెట్ నిర్ణయం తీసుకోనుంది. మరోవైపు.. ఫెర్రో అల్లాయ్స్ పరిశ్రమలకు ఎలక్ట్రిసిటీ డ్యూటీ టారిఫ్ తగ్గింపు ప్రతిపాదనకు కేబినెట్ ఆమోదం తెలిపింది. నాగావళి నదిపై గొౌతు లచ్చన్న తోటపల్లి బ్యారేజ్ పై కుడి, ఎడమ వైపు మిని హైడల్ ప్రాజెక్టుల నిర్మాణం ప్రతిపాదనకు కేబినెట్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. కడప జిల్లా సీకే దిన్నె మండలంలో ఏపీ ఇండస్ట్రియల్ కారిడార్ ఇన్ఫ్రా కార్పొరేషన్ కు కేటాయించిన 2,595 ఎకరాల బదిలీకి స్టాంపు డ్యూటీ మినహాయింపు ప్రతిపాదనకు కేబినెట్ ఆమోదం తెలిపింది. అభ్యంతరం లేని ఆక్రమిత స్థలాల క్రమబద్ధీకరణ ప్రతిపాదన పైనా కేబినెట్ లో చర్చించనున్నారు. వైసీపీ హయాంలో దాదాపు 7 లక్షల ఎకరాల భూములు నిషేధిత జాబితా నుంచి తొలగించగా.. దీనిపై అధ్యయనం చేసి ఆయా భూములను ఏం చేయాలన్న దానిపై కేబినెట్ సబ్ కమిటీ ప్రభుత్వానికి నివేదిక ఇవ్వనుంది.

## ఖేల్‌రత్న పురస్కారాలను ప్రదానం చేసిన రాష్ట్రపతి

న్యూఢిల్లీ : భారత అత్యున్నత క్రీడాపురస్కారం మేజర్ ఖేల్ రత్నను రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రదానం చేశారు. శుక్రవారం రాష్ట్రపతి భవన్‌లో అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమం జరిగింది. షూటింగ్‌లో డబుల్ ఒలింపిక్ పతకాలను గెలుచుకున్న మనుబాకర్, ప్రపంచ చెస్ చాంపియన్ గుకేష్, హాకీ కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సింగ్, పారా అథ్లెట్ ప్రవీణ్‌కుమార్‌లు రాష్ట్రపతి నుండి ప్రతిష్టాత్మకమైన ఖేల్ రత్న అవార్డులను అందుకున్నారు. వీరితో పాటు 32 మంది అథ్లెట్లను అర్జున అవార్డుతో సత్కరించారు. వీరిలో 17 మంది పారాఅథ్లెట్లు కావడం విశేషం. ఐదుగురు ద్రోణాచార్య పురస్కారాలును అందుకున్నారు. పారిస్ ఒలింపిక్స్‌లో కాంస్య పతకం సాధించిన రెజ్లర్ అమన్ సెహ్రావత్, షూటర్లు స్వప్నిల్ కుసాలే, సరబ్జోత్ సింగ్, పురుషుల హాకీ క్రీడాకారులు జర్మన్ ప్రీత్ సింగ్, సుఖ్‌జీత్ సింగ్, సంజరు అభిషేక్ సహా పలువురు క్రీడాకారులు అర్జున అవార్డులను అందుకున్నారు. తెలుగు రాష్ట్రాలకు చెందిన క్రీడాకారిణులు జివాంజి దీప్తి (పారాఅథ్లెటిక్స్), జ్యోతి యర్రాజీ (అథ్లెటిక్స్) అర్జున పురస్కారాలను స్వీకరించారు. 2014నుంచి అథ్లెటిక్స్‌లో ప్రాతినిధ్యం వహిస్తున్న జ్యోతి.. 2019లో తొలిసారి జాతీయ అండర్-18 మహిళల హర్డిల్స్‌లో స్వర్ణ పతకం కైవసం చేసుకొని అందరి దృష్టిని ఆకర్షించింది. 2022 ఆసియా క్రీడల్లో 100మీ. హార్డిల్స్‌లో రజత పతకం సాధించి పారిస్ ఒలింపిక్స్‌కు అర్హత సాధించింది. 2024 పారిస్ ఒలింపిక్స్ 100మీ. హార్డిల్స్‌లో భారత్‌నుంచి ప్రాతినిధ్యం వహించిన ఏకైక మహిళా అథ్లెట్‌గా జ్యోతి యర్రాజి చరిత్ర సృష్టించారు. పారిస్ పారా ఒలింపిక్స్‌లో మహిళల 400మీ. 20 విభాగంలో దీప్తి కాంస్యం సాధించింది. 55.82 సెకన్లలో లక్ష్యాన్ని చేరుకుని ఈ ఫీట్ సాధించింది.

# ఇండియా కూటమి విచ్ఛిన్నమైపోయినట్లేనా




ఇండియా కూటమి మూడునాళ్ల ముచ్చటే అని తేలిపోయింది. విభిన్న సిద్ధాంతాలు, అభిప్రాయాలు గల దాదాపు 24 పార్టీలు ఏకంకావడమే అరుదు. జెడి(యు) అధినేత నితీశ్ కుమార్ సూచనతో కేంద్రంలో బిజెపిని 2024 పార్లమెంటు ఎన్నికలలో ఓడించడమే లక్ష్యంగా కూటమి ఏర్పడింది. అనూహ్యంగా కాంగ్రెస్ కూటమిలో పెద్దన్నపాత్ర వహించాల్సి వచ్చింది. కూటమి కన్వీనర్‌గా నితీశ్ కుమార్‌ను ఎన్నుకోవాలన్న భావన అదిలోనే దెబ్బతింది. ఫైర్ బ్రాండ్‌గా పేరుపొందిన మమతా బెనర్జీ మొదటినుంచి ఇండియా కూటమిపట్ల పెద్దగా ఆసక్తి చూపలేదు. కాంగ్రెస్ పెత్తనం ఆమెకు అసలే ఇష్టం లేదు. ఇక కమ్యూనిస్ట్‌లు అంటే ఎప్పుడూ చుక్కెదురే. కూటమిలో లెఫ్ట్ పార్టీలతో సహ భాగస్వామిగా ఉండేందుకు విముఖత చూపారు. ఇక బెంగాల్‌లో అసెంబ్లీ గానీ, పార్లమెంటు ఎన్నికలు గానీ ఏ ఎన్నికల్లో అయినా ఒంటరిపోరే తమ సిద్ధాంతంగా ఎంచుకున్నారు. కాంగ్రెస్‌కు 2 పార్లమెంటు స్థానాలు కూడా ఇచ్చేందుకు అంగీకరించలేదు. బెంగాల్‌లో 34 ఏళ్లు అధికారంలో ఉన్నా.. నానాటికీ దిగజారిపోయాయి వామపక్షాలు. బెంగాల్‌లో 48ఏళ్లుగా అధికారానికి దూరమై ఏ ఏటికాయేడు పతనమై.. ప్రస్తుతం నామమాత్రంగా మిగిలిన కాంగ్రెస్, కమ్యూనిస్ట్ లతో కలిసినా కనీసం ఏ ఎన్నికలలోనూ విజయాన్ని అందుకోలేకపోయారు. పార్లమెంటు ఎన్నికల నాటికి కూటమిలో కీలక పార్టీలు బిజెపికి దీటుగా ఒకే ఉమ్మడి అభ్యర్థిని నిలబెట్టాలన్న లక్ష్యం మసక బారిపోయింది. ఆమ్ఆద్మీ పార్టీ కేజ్రీవాల్ పరిస్థితి మరోలా ఉంది. ఇష్టం లేకుండానే కూటమిలో చేరినట్లు కన్పించారు. లోక్‌సభ ఎన్నికల నాటికి ఢిల్లీలో పొత్తు.. పంజాబ్‌లో లేదు అన్నట్లు వ్యవహరించారు. సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేశ్ తీరు మరోలా ఉంది. కాంగ్రెస్‌తో ఉన్నట్లే ఉన్నా.. ఎప్పటికప్పుడు ఆ పార్టీకి చెక్ పెట్టే ధోరణిలోనే వ్యవహరించారు. మధ్యప్రదేశ్‌లో కనీసం స్థానాల్లో పోటీ చేసేందుకు కాంగ్రెస్ సహకరించకపోవడంతో పూర్తిగా దూరమయ్యారు. హర్యానా, మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ ఘోర ఓటమితో ఆ పార్టీపై ప్రతిపక్షాలలో ముఖ్యంగా కూటమి పార్టీలలో పూర్తిగా నమ్మకంపోయింది. కాంగ్రెస్‌కు దాదాపు అన్ని పార్టీలు దూరమయ్యాయి. జమ్మూకశ్మీర్‌లో కాంగ్రెస్ నేషనల్ కాన్ఫరెన్స్ కలిసినా, మహబూబా ముఫ్తీ ఒంటరి పోరుకు సిద్ధమయ్యారు. వయోభారం, అనారోగ్యం కారణంగా నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ అధినేత శరద్ పవార్ అంత చురుగ్గా రాజకీయాల్లో పాల్గొనడం లేదు. ఎన్‌సిపిను అజిత్ పవార్‌వర్గం చీల్చిన తర్వాత మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి తర్వాత శరద్ పవార్ ఇంటికే పరిమితమయ్యారు. తాజాగా ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలతో ఇండియా కూటమి పూర్తిగా రద్దయిపోయినట్లయింది. ఢిల్లీలో ఆమ్ ఆద్మీ పార్టీ రెండు టర్మ్‌లుగా అధికారంలో ఉంటోంది. పదేళ్లుగా కాంగ్రెస్ ఒక అసెంబ్లీ స్థానం కూడా గెలవలేదు. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలు బిజెపి, ఆమ్‌ఆద్మీ పార్టీకి డైరెక్ట్ ఫైట్‌గా కన్పిస్తున్నాయి. దీంతో కాంగ్రెస్ ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో పోటీకి సిద్ధమైంది. ఢిల్లీలో బిజెపి అధికారంలోకి రాకుండా చూడాలంటే.. ఆమ్‌ఆద్మీ పార్టీకి గంపగుత్తగా మద్దతు ఇవ్వాలని ఇండియా కూటమిలో కీలక పార్టీలు నిర్వహించాయి. దీంతో సమాజ్‌వాదీ పార్టీ, తృణమూల్ కాంగ్రెస్, ఆర్‌జెడి, శివసేన ఉద్ధవ్ పార్టీ ఆమ్‌ఆద్మీ పార్టీకే మద్దతుగా నిలిచాయి. దీంతో కాంగ్రెస్ ఏకాకి అయింది. ఆ పార్టీకి ఆఖరుకు నేషనల్ కాన్ఫరెన్స్ కూడా దూరమైంది. ఇండియా కూటమి అన్నది కేవలం పార్లమెంటు ఎన్నికల కోసం ఏర్పడిందని ఆయన ప్రకటించారు కూడా. దీంతో ఇండియా కూటమి ముక్కచెక్కలైనట్లు స్పష్టమైంది. కాంగ్రెస్ పార్టీ పూర్వవైభవం కలే%ా% భవిష్యత్‌లో. ప్రతిపక్షాల ఐక్యత అసాధ్యమే అని తేలిపోయింది.

# విద్యార్హతల కన్నా నైపుణ్యమే మిన్న




దేశంలో రానున్న ఐదేళ్లలో ఉద్యోగాల స్వరూపమే అనూహ్యంగా మారిపోయే పరిణామాలు కనిపిస్తున్నాయి. ఇదివరకు డిగ్రీలుంటేకానీ సరైన ఉద్యోగాలు రాని పరిస్థితి ఉండగా, ఇప్పుడు సాంకేతిక నైపుణ్యం ముందు డిగ్రీలు చిన్నబోతున్నాయి.దేశంలో ఎఐ(కృత్రిమ మేధ) నైపుణ్యాలకు డిమాండ్ పెరుగుతోంది. ప్రపంచ స్థాయిలో 88% వరకు ఎఐ ప్రోగ్రాములు అమలవుతుండగా, భారతీయ సంస్థలు 96% వరకు ఎఐ ప్రోగ్రాములు అమలు చేస్తున్నాయి. ఉత్పాదక ఆధారిత ఎఐ శిక్షణ నమోదులో అమెరికా, భారత్ దేశాలు ముందుండడంతో ప్రపంచ వ్యాప్తంగా ఎఐ నైపుణ్యాలకు డిమాండ్ పెరిగింది. జనరల్ ఎఐ శిక్షణను పెంచడంలో కార్పొరేట్ సంస్థలు ముందుంటున్నాయి. ఈ కార్పొరేట్ సంస్థలకు ప్రపంచ వ్యాప్తంగా 14 మిలియన్ల కన్నా ఎక్కువ మంది ఉద్యోగులు ఉన్నారు. జనరల్ ఎఐ వినియోగం ప్రస్తుతం అన్ని రంగాల్లో పెరుగుతోంది. అందుబాటులో ఉన్న సమాచారాన్ని వినియోగించుకుని సరికొత్త చిత్రాలు, పాఠ్యాంశాలు, సంగీతం తదితర అంశాలను సృజించే వ్యవస్థలను జనరేటివ్ ఎఐగా వ్యవహరిస్తున్నారు.గత ఐదేళ్లలో ప్రపంచస్థాయిలో జనరేటివ్ ఎఐపై పెట్టుబడులు భారీగా పెరిగాయి. 2019లో 88.2 కోట్ల డాలర్లు పెట్టుబడులు పెట్టగా, 2020లో 218 కోట్ల డాలర్లు, 2021లో 417 కోట్ల డాలర్లు, 2022 లో 264 కోట్ల డాలర్లు, 2023లో 2243 కోట్ల డాలర్ల వరకు పెట్టుబడులు పెరిగాయి. ఎఐ నైపుణ్యానికి సంబంధించి దేశంలో 67% కంపెనీలు కొత్త విభిన్న నైపుణ్య ప్రతిభపై దృష్టి సారిస్తున్నాయి. 30% కంపెనీలు డిగ్రీ షరతులను తొలగించి నైపుణ్యాలకు ప్రాధాన్యం ఇస్తున్నాయి. 2030 నాటికి దేశంలో 17 కోట్ల కొత్త ఉద్యోగాలు సృష్టించబడగా, మరోవైపు 9.2 కోట్ల ఉద్యోగాలు కోల్పోవాల్సి వస్తుందని, అలాగే ప్రపంచంలో 170 మిలియన్ కొత్త ఉద్యోగాలు సృష్టించబడగా, 92 మిలియన్ ఉద్యోగాలు కోల్పోవడమవుతుందని వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్ (డబ్లుఇఎఫ్) నివేదిక వెల్లడించింది. కొత్త టెక్నాలజీని అందిపుచ్చుకోవడంలో భారతీయ కంపెనీలు ప్రపంచాన్ని అధిగమించేందుకు సిద్ధంగా ఉన్నాయి. ఎఐ, రోబోటిక్స్, ఎనర్జీ టెక్నాలజీ వంటి రంగాల్లో భారీగా పెట్టుబడులు పెడుతున్నాయి. 35% భారతీయ కంపెనీలు సెమీకండక్టర్లు, కంప్యూటింగ్ టెక్నాలజీ, తమ వ్యాపారాన్ని పూర్తిగా మార్చగలవని విశ్వసిస్తున్నాయి. 21శాతం కంపెనీలు క్యాంటం, ఎన్‌క్రిప్షన్ టెక్నాలజీలే ముఖ్యమైనవిగా భావిస్తున్నాయి. దేశంలో బిగ్‌డేటా, ఎఐ, మెషిన్‌లెర్నింగ్, సైబర్ నిర్వహణ వంటి ఉద్యోగాలు దేశంలో వృద్ధి చెందే అవకాశాలు కనిపిస్తున్నాయి. భారత దేశంలోని ఐటి రంగం ప్రస్తుతం 5.4 మిలియన్ మందికి ఉద్యోగాలు కల్పిస్తోంది. 2030 నాటికి ఈ సంఖ్యను 10 మిలియన్ వరకు రెట్టింపు చేయాలన్న టార్గెట్ ఉండగా, కేవలం 7.5 మిలియన్ వరకే సాధించగలమని ఆయా రంగ నిపుణులు చెబుతున్నారు. దీనికి కారణం ఎఐ విస్తరించడం వల్ల ఇప్పుడున్న ఉద్యోగాలు పోతాయన్న భయం వెంటాడుతుండడమే.ఐటి రంగం ఏటా 58 శాతం వరకు నిదానంగా వృద్ధి చెందుతుందని, 2027 సంవత్సరం నాటికి 6.2 మిలియన్ నుంచి 6.8 మిలియన్ ఉద్యోగాలు కల్పిస్తుందని అంచనా వేస్తున్నారు. ప్రస్తుతం ఈ వృద్ధి అంతా డిజిటల్ సాంకేతికత వైపు దూసుకెళ్తోంది. ఎఐ, క్లౌడ్ కంప్యూటింగ్, ఆటోమేషన్ తదితర సాంకేతిక ప్రక్రియలు పారిశ్రామిక, వాణిజ్య సంస్థల ప్రోత్సాహంతో విస్తరిస్తున్నాయి. ఇదివరకటి 10 మిలియన్ ఉద్యోగాల టార్గెట్‌ను 7.5 మిలియన్ ఉద్యోగాలకు సవరించినప్పటికీ, ఉద్యోగాల రాశి కన్నా నైపుణ్యం, నాణ్యతలకు పట్టం కడుతున్నారు. ఎఐ, ఆటోమేషన్ వంటి అభివృద్ధి చెందుతున్న సాంకేతికతలు ఉద్యోగాల నియామక ప్రక్రియలను క్రమబద్ధం చేస్తున్నాయి. ఈ మార్పులు, అత్యంత విలువైన సాంకేతిక సేవలు, నూతన ఆవిష్కరణల వైపు దేశాన్ని ముందుకు నడిపిస్తున్నాయి. ఈ ఆధునిక సాంకేతిక నైపుణ్య ప్రక్రియలను అందిపుచ్చుకోగలిగితేనే ఇప్పుడు ఉద్యోగాలు లభిస్తాయి. ఈ మేరకు ఉద్యోగ అవకాశాలు 80% వరకు సాంకేతిక నిపుణులతో 2025 26 నాటికి 20% వరకు పెరుగుతాయని ఐటి రంగ వర్గాలు పేర్కొంటున్నాయి. అత్యంత ఆధునిక సాంకేతికతల వల్ల 2030 నాటికి దేశంలో 150 బిలియన్ డాలర్ల వరకు ఆర్థిక ప్రయోజనం సిద్ధిస్తుందని అంచనా వేస్తున్నారు. జనరేటివ్ ఎఐ వంటి సాంకేతికతలే ఐటి రంగంలో 2030 నాటికి రెండు మిలియన్ల వరకు కొత్త ఉద్యోగాలను సృష్టిస్తాయని నివేదికల వల్ల తెలుస్తోంది. దేశంలో ప్రస్తుతం 1700 గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లు (జిసిసి) ఉన్నాయి. వీటి వల్ల 1.9 మిలియన్ మంది ఉద్యోగాలు పొందుతున్నారు. 2030 నాటికి గ్లోబల్ కేపబిలిటీ సెంటర్ల సంఖ్య 2200 వరకు చేరుకుంటుందని, వాటి ద్వారా 2.5 మిలియన్ నుంచి 2.8 మిలియన్ వరకు ఉద్యోగాలు లభించే అవకాశాలు ఉన్నాయని ఐటి నిపుణులు చెబుతున్నారు. గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లు అనేవి ఎదురవుతున్న సవాళ్లకు అనుగుణంగా అనేక రకాల వ్యూహాత్మక విధులను నిర్వహించడానికి బహుళజాతి సంస్థలు స్థాపించే కేంద్రాలు. ఆవిష్కరణ కార్యక్రమాలు, పరిశోధనలు, సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్, సైబర్ సెక్యూరిటీ, డిజిటల్ పరివర్తన కార్యక్రమాలను వేగవంతం చేయడం, వనరుల వినియోగాన్ని పెంచడం తదితర విధులను ఈ కేంద్రాలు నిర్వహిస్తుంటాయి. ఐటి రంగంలో ఒప్పందం ప్రకారం ఉద్యోగులను నియమించుకునే విధానంలో 43.5% డిమాండ్‌తో బెంగళూరు కేంద్ర స్థానంగా ఉన్నప్పటికీ, 13.4% డిమాండ్‌తో రెండో అత్యధిక స్థానంలో హైదరాబాద్ ఉంది. ఈ ఉద్యోగాల కల్పనలో విద్యార్హతల కన్నా సాంకేతిక నైపుణ్యమే కీలక పాత్ర వహిస్తోందన్నది ఉద్యోగార్థులు గమనించవలసిన కీలకాంశం.

# డిటెన్షన్ విధానం మంచిదే కానీ..!



సమర్థ మానవ వనరుల నిర్మాణానికి విద్య అత్యంత కీలకమైనది. అందరికీ నాణ్యమైన విద్య అందించినప్పుడే ఇది సాధ్యమవుతుంది. ఈ లక్ష్య సాధనలో విద్యాహక్కు చట్టం 2009ను తీసుకురావడం జరిగింది. ఈ చట్టం ప్రకారం 6 నుంచి 14 సంవత్సరాలు పిల్లలందరికీ ఉచిత నిర్బంధ విద్యను అందించడం జరుగుతున్నది. విద్యను సార్వత్రికం చేయడంలో ఈ చట్టం విజయవంతమైందని చెప్పవచ్చు. నేడు మెజారిటీ విద్యార్థులకు విద్య అందుబాటులోకి వచ్చినప్పటికీ నాణ్యతా ప్రమాణాలు లోపిస్తున్నాయని అనేక అధ్యయనాలు పేర్కొంటున్నాయి.ఈ విషయాన్ని అసర్ సర్వే, నేషనల్ అచీవ్‌మెంట్ సర్వేలు ధ్రువీకరిస్తున్నాయి. ఈ క్రమంలో విద్యా నాణ్యతపై దృష్టి పెట్టాల్సిన అవసరం ఏర్పడింది. ఇందులో భాగంగానే డిటెన్షన్ విధానాన్ని ప్రవేశపెట్టారు. వాస్తవంగా మొదట్లో విద్యాహక్కు చట్టం సెక్షన్ 16 ప్రకారం నో- డిటెన్షన్ విధానం ఉండేది. ఈ సెక్షన్ రెండు కీలకమైన నిబంధనలను నిర్దేశిస్తుంది. మొదటిది, ప్రాథమిక విద్యను పొందుతున్న ఏ పిల్లవాడినీ పాఠశాలనుంచి బహిష్కరించకూడదు. రెండవది, ఏ తరగతిలోనూ పిల్లలను నిలుపుదల చేయకూడదు. అనగా 8వ తరగతి వరకు విద్యార్థులను నిర్బంధించకుండా పైతరగతులకు అనుమతించాలి. పిల్లలు ప్రతి తరగతిలో ఫెయిల్ అవుతానేమో అనే భయంలేకుండా కనీస అభ్యసనస్థాయి పొందేలా చేయడం, తద్వారా డ్రాపౌట్ రేటును తగ్గించడం సెక్షన్ 16 ప్రధాన ఉద్దేశం. సమ్మిళిత విద్యను ప్రోత్సహించడం, డ్రాపౌట్లను తగ్గించడం కోసం నో -డిటెన్షన్ విధానం ఒక సదుద్దేశంతో తీసుకురావడం జరిగింది. అయితే, దీని అమలు తీరు పలు విమర్శలను ఎదుర్కొంది. ఈ విధానం పిల్లల-స్నేహపూర్వక విద్యా వ్యవస్థను ప్రోత్సహించాలని లక్ష్యంగా పెట్టుకున్నప్పటికీ విద్య నాణ్యత, జవాబుదారీతనంపై ప్రభావం చూపింది. ప్రాథమిక విద్యపై ఇటీవల కేంద్రప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. 5, 8 తరగతులకు నో డిటెన్షన్ పాలసీని రద్దు చేసింది. దీని ప్రకారం ఈ రెండు తరగతులకు చెందిన విద్యార్థులపై తరగతులకు వెళ్లేందుకు తప్పనిసరిగా పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించాల్సి ఉంటుంది. ఇప్పటివరకు పాసైనా, ఫెయిలైనా హాజరు శాతంతో విద్యాహక్కు చట్టం ప్రకారం పైతరగతులకు పంపిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన నోటిఫికేషన్ ప్రకారం విద్యార్థి ఫెయిలైతే మళ్లీ పరీక్ష రాసేందుకు అవకాశం కల్పిస్తారు. పరీక్షల ఫలితాలు వెలువడే తేదీకి రెండు నెలల్లోపే మళ్లీ పరీక్షపెడతారు.ఒకవేళ అందులోనూ ఫెయిలైతే వారు 5, 8 తరగతులను మళ్లీ చదవాల్సి ఉంటుంది. ఫెయిలైన విద్యార్థుల జాబితాను ప్రధానోపాధ్యాయులు నిర్వహించాల్సి ఉంటుంది. అయితే, ప్రాథమికోన్నత విద్య పూర్తయ్యేవరకు ఏ విద్యార్థినీ బహిష్కరించరాదని కేంద్రం స్పష్టం చేసింది. మరోవైపు కేంద్రం నిర్ణయించినట్లు 5, 8 తరగతుల్లో డిటెన్షన్ విధానం అమలు చేస్తే ప్రభుత్వ విద్యా సంస్థల్లో డ్రాపౌట్లు పెరుగుతాయని ఉపాధ్యాయ సంఘాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ప్రాథమిక విద్య రాష్ట్ర జాబితాలోని అంశమైనందున ఈ విషయంలో ఆయా రాష్ట్రాలు నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుంది. కేంద్ర ప్రభుత్వం పరిధిలోని దాదాపు 3 వేల కేంద్రీయ విద్యాలయాలు, నవోదయ, సైనిక పాఠశాలలకు ఇది వర్తిస్తుంది.ఇప్పటికే ఢిల్లీ సహా 16 రాష్ట్రాలు, 2 కేంద్ర పాలిత ప్రాంతాలు నో డిటెన్షన్ విధానాన్ని రద్దు చేశాయి. డిటెన్షన్ విధానం తెలంగాణలో అమలుపై సందిగ్ధత నెలకొంది. రాష్ట్రంలో ఇటీవల విద్యా వ్యవస్థలో సంస్కరణల కోసం విద్యా కమిషన్ నియమించినది. ఇది విద్యా వ్యవస్థలో నాణ్యత, మౌలిక సదుపాయాలపై అధ్యయనం చేస్తోంది. ప్రస్తుతం 9వ తరగతి వరకు నో డిటెన్షన్ విధానం అమలవుతోంది. పరీక్షల్లో పాసైనా.. కాకున్నా పై తరగతులకు పంపిస్తున్నారు. కేంద్రం నూతన విద్యా విధానం 2020 తీసుకురావడం జరిగింది.

ప్రస్తుతం పలు రాష్ట్రాలు నూతన విద్యావిధానం అమలు దిశగా ముందుకుపోతున్నాయి. ఈ విధానంలో కూడా లోపాలు ఉన్నాయని విద్యావేత్తలు అభిప్రాయపడుతున్నారు. ఈ క్రమంలో పాఠశాల విద్యలో కీలక మార్పులు చేయాల్సిన అవసరమైతే ఉంది. విద్యా నాణ్యతను మరింత మెరుగుపరచడానికి నిరంతర సమగ్ర మూల్యాంకనం, నో డిటెన్షన్ విధానంపై విద్యాహక్కు చట్టంలో చేసిన సవరణలు సమీక్షించాలి. ప్రాథమిక స్థాయిలో నో డిటెన్షన్ విధానం రద్దువలన విద్యార్థుల్లో ఒత్తిడి పెరుగుతుంది. కావున, దీనిపై పునఃసమీక్షించి 8వ తరగతి నుంచి అమలుచేస్తే బాగుంటుంది.